

బుధవారం 17 సెప్టెంబర్ 2025
https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



దేశ రాజకీయాల్లో.. ఎన్టీఆర్ పెను సంచలనం

5



# వృద్ధిరేటు 15శాతం

- లక్ష్య సాధన దిశగా అడుగులేద్దాం
- మానవ వనరును సద్వినియోగం చేయాలి
- శాంతిభద్రతలతోనే పెట్టుబడులు సాధ్యం
- 35 శాతం క్రైం రేట్ తగ్గించగలగాలి..
- సాంకేతిక వినియోగంపై పూర్తి దృష్టిపెట్టండి
- ఉన్న వనరులే ప్రగతి సాధన ఆయుధాలు
- అంతిమంగా స్వర్ణాంధ్ర-2047 సాధనే లక్ష్యం
- స్పష్టం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- కలెక్టర్ల సదస్సు ముగింపు సెషన్‌లో దిశానిర్దేశం

2

*సీఐజీఆర్ 13.49 శాతం వృద్ధి సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. కలెక్టర్ల సదస్సు ముగింపు సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "రాష్ట్రానికి ఏటా కావాల్సిన ఆదాయం రూ.76వేల కోట్లు. గతేడాది 12.02శాతం వృద్ధి సాధించాం. కొన్ని జిల్లాల్లో వృద్ధి చాలా బాగుంది. కొన్ని జిల్లాల్లో వృద్ధి లేదు. వృద్ధిపై అందరూ దృష్టి పెట్టాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. దీర్ఘకాలం ప్రయోజనాల దృష్ట్యా పది సూత్రాలు తీసుకువచ్చాం. ఉపాధి కల్పనకు భవిష్యత్తులో చాలా ప్రాధాన్యం ఉంటుంది. రాష్ట్ర వృద్ధిరేటు 15 శాతం సాధించాలి.*



## స్వచ్ఛాంధ్ర.. ఓ ఉద్యమం!

- జనవరినుంచి వేస్ట్ అనేదే కన్పించకూడదు
- అర్బన్ సౌకర్యాలతో ఏజెన్సీ గ్రామాభివృద్ధి
- కొండపల్లి, ఏటికొప్పాక.. అద్భుతమైన కళ
- ఆ బొమ్మలకు కలప చెట్లు పెంచాలి..
- రాష్ట్రంలో 5 సర్క్యులర్ ఎకానమీ పార్కులు
- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

3

## ప్రభుత్వ సేవలకు రేటింగ్స్

- కలెక్టర్లనుంచి కార్యదర్శులు రిపోర్టులు కోరవద్దు
- క్షేత్రస్థాయి సమాచారాన్ని ఆర్టీజీఎస్‌నుంచి తీసుకోవాలి
- మెరికల్లాంటి యువ ఐఏఎస్‌ల సేవల్ని వాడుకుంటాం
- టెక్నాలజీ వినియోగంపై మంత్రులు, కలెక్టర్లకు శిక్షణ
- నవంబర్‌నుంచి అందుబాటులోకి ఆర్టీజీ జిల్లా కేంద్రాలు
- క్వాంటం భవనాల డిజైన్లపై కలెక్టర్ల అభిప్రాయం కోరిన సీఎం

2

## ఏటా రూ.8వేల కోట్ల లబ్ధి

- జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు చేకూరే లబ్ధి ఇది
- యోగాంధ్ర తరహాలో పెద్దఎత్తున ప్రచారం చేయండి
- అభ్యంతరాల్లేని భూములను రెగ్యులరైజ్ చేయాలి
- పారదర్శకతకు అద్దంపట్టేలా ఎక్సైజ్ శాఖ పనితీరుండాలి
- ప్రజలకు మంచి చేస్తున్నాం... సంతృప్తస్థాయి పెరగాలి
- రెండో రోజు కలెక్టర్ల కాన్ఫరెన్సులో సీఎం చంద్రబాబు

4

## అసెంబ్లీకి రాకుండా ఏం చేస్తారు?



- గెలిపించిన ప్రజలను గాలికొదిలేస్తారా?
- దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

9

## అది శ్రీమహా విష్ణువు విగ్రహం కాదు

- భూమనది అసత్య ప్రచారం
- ఫ్యాక్ట్‌చెక్ విభాగం స్పష్టీకరణ
- అలిపిరి స్టేషన్‌లో కేసు నమోదు

10

# పెట్టుబడుల వేట..

## లండన్‌లో మంత్రి లోకేష్ రోడ్ షో




- నవంబర్‌లో విశాఖ పార్టనర్ షిప్ సమ్మిట్ విజయవంతమే లక్ష్యం
- గ్లోబల్ లీడర్లకు ఆహ్వానం
- ఏపీలో అమలవుతున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్, ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలపై ప్రెజెంటేషన్
- 15 నెలల్లో రూ.10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులకు అనుమతి
- మరో ఏడాదిలో రెట్టింపు చేయటమే టార్గెట్

3
5

### ఇల్లు, స్థలం ఆక్రమించిన
## అక్రమ రిజిస్ట్రేషన్

11

- కాకినాడలో వైసీపీ కార్పొరేటర్, మరో నేత దందా
- జార్జియా వీసా పేరుతో రూ.60 లక్షలకు టోకరా
- ప్రజావినతుల కార్యక్రమంలో బాధితుల ఫిర్యాదు

## రైతులపై జగన్ మొసలికన్నీరు



- వైసీపీ హయాంలో వారికి మిగిలింది కడగండ్లే
- నేడు అబద్ధాలతో సానుభూతి డ్రామాలు
- మద్దతు ధర విధానం అంటే జగన్‌కు తెలుసా
- ఉల్లి, టమోటా రైతులకు అండగా కూటమి ప్రభుత్వం
- వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

- వివరాలు 6 లో..

చైతన్యరథం

# వృద్ధిరేటు 15శాతం

- లక్ష్య సాధన దిశగా అడుగులేద్దాం
- మానవ వనరును సద్వినియోగం చేయాలి
- శాంతిభద్రతలతోనే పెట్టుబడులు సాధ్యం
- 35 శాతం క్రైం రేట్ తగ్గించగలగాలి..
- సాంకేతిక వినియోగంపై పూర్తి దృష్టిపెట్టండి
- ఉన్న వనరులే ప్రగతి సాధన ఆయుధాలు
- అంతిమంగా స్వర్ణాంధ్ర-2047 సాధనే లక్ష్యం
- స్పష్టం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- కలెక్టర్ల సదస్సు ముగింపు సెషన్‌లో దిశానిర్దేశం



అమరావతి (చైతన్య రథం): సీఐజీఆర్ 13.49 శాతం వృద్ధి సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. కలెక్టర్ల సదస్సు ముగింపు సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "రాష్ట్రానికి ఏటా కావాల్సిన ఆదాయం రూ.76వేల కోట్లు. గతేడాది 12.02శాతం వృద్ధి సాధించాం. కొన్ని జిల్లాల్లో వృద్ధి చాలా బాగుంది. కొన్ని జిల్లాల్లో వృద్ధి లేదు. వృద్ధిపై అందరూ దృష్టి పెట్టాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. దీర్ఘకాలం ప్రయోజనాల దృష్ట్యా పది సూత్రాలు తీసుకువచ్చాం. ఉపాధి కల్పనకు భవిష్యత్తులో చాలా ప్రాధాన్యం ఉంటుంది. రాష్ట్ర వృద్ధిరేటు 15 శాతం సాధించాలి. శాంతిభద్రతలు బాగుంటేనే పెట్టుబడులు వస్తాయి. ఒక కుటుంబం.. ఒక వ్యాపారవేత్త నినాదం తీసుకున్నాం. నైపుణ్యం పోర్టల్ ద్వారా నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ఇస్తున్నాం. ఉపాధి కల్పనతో ఆదాయం సృష్టి జరుగుతుంది. మానవ వనరులను సమర్ధంగా ఉపయోగించుకోవాలి. ఈ ఏడాది 35శాతం క్రైమ్ రేటు తగ్గాలి. జిల్లాల్లో పరిస్థితులమేరకు కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలి. అన్ని కార్యాలయాల్లో గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యమివ్వాలి. రాయలసీమకు సోలార్, విండ్, పంప్డ్ ఎనర్జీ వచ్చే అవకాశం ఉంది. అన్ని వాహనాలు ఎలక్ట్రిక్‌కు మారాల్సిన అవసరం ఉంది. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ భారం తగ్గుతుంది. సర్క్యులర్ ఎకానమీలో పోలీసు వ్యవస్థ భాగస్వామ్యం కావాలి" అని సీఎం వివరించారు. రెండు రోజులపాటు జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో కలెక్టర్లు, ఎస్పీలకు సీఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా అంతా పనిచేయాలని ఆదేశించారు. గత పాలకులవల్ల రాష్ట్రం చాలా అవకాశాలను కోల్పోయిందంటూ.. తిరిగి వృద్ధిరేటు సాధనకు రాజీలేకుండా పనిచేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. 'పదిసూత్రాల ఆధారంగా కూటమి పరిపాలన కొనసాగుతోంది. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనకు మనకున్న వనరుల్ని వినియోగించి ముందుకెళ్దాం. మానవ వనరుల్ని సమర్ధంగా వినియోగించుకునేలా అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. అందుకే -వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్, వర్క్ ఫ్రమ్ హెూంలాంటి విధానాలను అవలంబిస్తున్నాం. నేను, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. 35శాతం క్రైమ్ రేట్ తగ్గించే లక్ష్యంతో జిల్లా ఎస్పీలు, కలెక్టర్లు పనిచేయాలి. అందుకు -సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించుకుని లక్ష్యాలను చేరుకోండి. గ్రీన్ ఎనర్జీకి అత్యంత ప్రాధాన్యత, ఈవీలను ప్రోత్సహించాలి. ఇక -క్లీన్ అండ్ గ్రీన్ సంప్రదాయంగా మారాలి. రోడ్లు, రైల్వేలు, పోర్టులు, ఎయిర్ పోర్టులను సమర్ధంగా వినియోగించుకుని లాజిస్టిక్స్ వ్యయం తగ్గించాలి అభివృద్ధి- సంక్షేమం- సుపరిపాలనే లక్ష్యంగా కూటమి పనిచేస్తోంది. పబ్లిక్ పాలసీలవల్ల కొన్ని దేశాల భవిష్యత్ మారిందన్న విషయం గ్రహించండి. త్వరలోనే భారత్ 2వ అతిపెద్ద ఎకానమీగా ఎదుగుతుంది.

శాంతిభద్రతలు పటిష్టంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయి. వైద్యారోగ్యరంగంలో ఇక పెనుమార్పులు వస్తాయి. సంజీవని అందుబాటులోకి వస్తే వైద్యానికి చేసే వ్యయం కూడా తగ్గిపోతుంది. ప్రస్తుతం వైద్యారోగ్యానికి రూ.20 వేల కోట్లు ఖర్చవుతుంది. అందరూ ఆరోగ్యంగావుంటే ఈ వ్యయంలో 30 శాతం తగ్గుతుంది. జీఎస్టీ సంస్కరణలవల్ల ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఆర్ధిక వ్యవస్థ మెరుగుపడుతుంది. దేశాన్ని నిర్మించే క్రతువులో మీరంతా భాగస్వాములవ్వాలి. టెక్నాలజీ గేమ్ చేంజర్. దాన్ని సద్వినియోగం చేసుకుంటే నిర్ణయాలు వేగంగా తీసుకోవచ్చు" అంటూ సీఎం చంద్రబాబు కలెక్టర్లు, ఎస్పీలకు దిశానిర్దేశం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, ఎన్ఎండీ ఫరూక్, సీఎస్, డీజీపీ సదస్సులో పాల్గొన్నారు.

---

# ప్రభుత్వ సేవలకు రేటింగ్స్

- కలెక్టర్లనుంచి కార్యదర్శులు రిపోర్టులు కోరవద్దు
- క్షేత్రస్థాయి సమాచారాన్ని ఆర్టీజీఎస్‌నుంచి తీసుకోవాలి
- మెరికల్లాంటి యువ ఐఏఎస్‌ల సేవల్ని వాడుకుంటాం
- టెక్నాలజీ వినియోగంపై మంత్రులు, కలెక్టర్లకు శిక్షణ
- నవంబర్‌నుంచి అందుబాటులోకి ఆర్టీజీ జిల్లా కేంద్రాలు
- రెండోరోజు కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు స్పష్టం
- క్వాంటం భవనాల డిజైన్లపై కలెక్టర్ల అభిప్రాయం కోరిన సీఎం



అమరావతి (చైతన్య రథం): వివిధ ప్రభుత్వ శాఖలు అందించే సేవలకు ఇకపై రేటింగ్స్ ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. క్వాంటం వ్యాలీ, వాట్సప్ గవర్నెన్స్, డేటా లేక్, ఆర్టీజీఎస్ లెన్స్, అవేర్ 2.0 అంశాలపై సీఎం సమీక్షించారు. పాలనలో టెక్నాలజీ వినియోగంపై జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "కొన్ని ప్రభుత్వ శాఖల పనితీరు మరింతగా మెరుగుపడాల్సిన అవసరముంది. గతంతో పోల్చుకుంటే కొన్ని శాఖల పనితీరు మెరుగైనా.. రెవెన్యూలాంటి శాఖల పనితీరు మరింత బాగుపడాలి. ఎన్నిసార్లు చెబుతున్నా రెవెన్యూ శాఖ ప్రజలకు సంతృప్తస్థాయిలో సేవలు అందించటం లేదు. ఈ పరిస్థితుల్లో అన్ని ప్రభుత్వ సేవల్ని రేటింగ్ చేయాలని నిర్ణయించాం. కలెక్టర్లు చూసే దస్త్రాల క్వాలిటీ ఎంత ఉందో కూడా తనిఖీ చేస్తాం. సీనియర్ అధికారులు కూడా తమ పని విధానం మార్చుకోవాలి. ఇకపై తమ తమ శాఖలకు సంబంధించిన క్షేత్రస్థాయి సమాచారం కోసం పదే పదే కలెక్టర్లను నివేదికలు అడిగే పరిస్థితి రాకూడదు. ఆర్టీజీఎస్ నుంచి అవసరమైన మేరకు నివేదికలు తీసుకోవాలి. దానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో పని చేయించాలి. ఉన్నతాధికారులు కలెక్టర్లను రిపోర్టులు కోరుతూ ఉండడంవల్ల పనులు ముందుకు కదలడం లేదనే విమర్శలు వస్తున్నాయని. ఇకపై ఇలాంటి వాటికి చెక్ పెట్టాలి. ఆ కాలం ముగిసింది" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఫైళ్లన్నీ ఆన్ లైన్ చేయాల్సిందే..

"రెండు నెలల్లో నూరుశాతం ఫైళ్లు ఆన్ లైన్‌లో ఉండాల్సిందే. మానుప్యులేషన్ లేకుండా ఫోరెన్సిక్ ఆడిటింగ్ లాంటివి కూడా తీసుకువస్తాం. నెక్స్ట్ జెన్ టెక్నాలజీవైపు మనం ముందడుగు వేయాలి. ఆర్టీజీఎస్ ద్వారా అవేర్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. దీని ద్వారా 42 రకాల సమాచారం కలెక్టర్లకు అందుతోంది. నవంబరు నెలలోగా డేటా లేక్ పూర్తిగా అందరికీ అందుబాటులోకి వస్తుంది. వచ్చే కలెక్టర్ల సదస్సునాటికి ఏయే జిల్లాలు ఎక్కడెక్కడ తమ పనితీరు మెరుగుపరుచుకోవాలో కూడా రియల్ టైమ్‌లో చెప్పేలా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నాం. లాస్ట్ మైల్ వరకూ ప్రయోజనాలు అందేలా టెక్నాలజీ వినియోగించాలి. వచ్చే రెండేళ్లలో ఈ ఫలితాలను కూడా అందుకోవచ్చు. ఆర్టీజీ జిల్లా కేంద్రాలు నవంబర్‌నాటికి సిద్ధమవుతాయి. టెక్నాలజీ వినియోగంపై అక్టోబరు నెలలో మంత్రులు, అధికారులు, కలెక్టర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తాం" అని సీఎం వెల్లడించారు.

## టెక్నాలజీ ఎకో సిస్టం తెస్తాం

"ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కానీ... ఇతర అత్యవసర సమయాల్లో ప్రజలను అలెర్ట్ చేసేలా అలెర్ట్ బ్రాడ్ కాస్ట్ సిస్టం ఏర్పాటు చేయాలి. దీన్ని వివిధ ప్రాంతాల్లో చేపట్టాలి. అలాగే సీసీ టీవీ ఫుటేజీలను అనాలసిస్ చేసే పరిస్థితి తీసుకురావాలి. బ్యాండ్ విడ్త్‌లేని సమయం నుంచి అత్యధిక బ్యాండ్ విడ్త్‌తో పనిచేసే సమయం వచ్చింది. చురుగ్గా ఉండే యువ అఖిల భారత సర్వీసు అధికారుల సేవల్ని వినియోగించుకుంటాం. ఏపీలో టెక్నాలజీ ఎకో సిస్టం క్రియేట్ చేసేందుకు ఐదుగురు యువ అధికారులను నియమించాం. టెక్నాలజీ రంగంతోపాటు... ఇన్నోవేషన్‌వంటి రంగాల్లో కూడా యువ ఐఏఎస్‌లకు బాధ్యత అప్పజెప్పాం. ఇటీవల కాలంలో నేను చాలామంది ఐఏఎస్‌లతో మాట్లాడాను. కొందరు యువ ఐఏఎస్‌లలో చాలా ఆలోచనలు ఉన్నాయి. చాలా వినూత్నంగా ఆలోచిస్తున్నారు. అలాంటి వాళ్లను పికప్ చేస్తున్నాం" అని చంద్రబాబు చెప్పారు.

## క్వాంటం భవనాల డిజైన్లు

కలెక్టర్ల కాన్ఫరెన్సులో క్వాంటం వ్యాలీ భవనాల డిజైన్లను ప్రదర్శించారు. ఆ భవనాలపై కలెక్టర్ల అభిప్రాయాలను సీఎం కోరారు. భవిష్యత్తులో 3 వేల క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ల ఏర్పాటుకు వీలుగా కార్యాలయ స్థలం అందుబాటులోకి రానున్నట్టు చంద్రబాబు వెల్లడించారు. 80వేలమంది పని చేసేలా క్వాంటం వ్యాలీ భవనాల నిర్మాణం చేపడుతున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్లకు వివరించారు.



# స్వచ్ఛాంధ్ర.. ఓ ఉద్యమం!

- జనవరి నుంచి వేస్ట్ అనేదే కన్పించకూడదు
- అర్బన్ సౌకర్యాలతో ఏజెన్సీ గ్రామాభివృద్ధి
- కొండపల్లి, ఏటికొప్పాక.. అద్భుతమైన కళ
- ఆ బొమ్మలకు కలప చెట్లు పెంచాలి..
- రాష్ట్రంలో 5 సర్క్యులర్ ఎకానమీ పార్కులు
- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో అమలు చేస్తున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో కొనసాగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో రెండో రోజు కలెక్టర్ల సదస్సు జరిగింది. స్వచ్ఛాంధ్ర, సర్కులర్ ఎకానమీవంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "జనవరినుంచి వేస్ట్ అనేది ఎక్కడా కనిపించకూడదు. 83 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వేస్ట్ క్లియర్ చేసాం. చెత్తపై పన్ను కూడా రద్దుచేశాం. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలకోసం కార్పొరేషన్ ద్వారా నిధులిస్తున్నాం. స్వచ్ఛ భారత్ కోసం ఏ జిల్లాలో అయినా పైలట్ ప్రాజెక్టుగా కార్యక్రమాలు చేపడితే అది రాష్ట్రమంతా వర్తింపచేయండి. ఉమ్మడి రాష్ట్రంలోనే సింగపూర్ విధానాలను పరిశీలించి ఉమ్మడి రాష్ట్రంలో స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టాం. ఆ తర్వాత క్లీన్ అండ్ గ్రీన్, పచ్చదనం పరిశుభ్రత పేరిట కార్యక్రమాలు నిర్వహించాం. స్వచ్ఛత అంటే పరిశుభ్రత పాటించేలా చూడడమే కాదు... ప్రజల ఆలోచనా విధానమూ మారేలా చేయడం. ఇంట్లో చెత్తను రోడ్డు బయట వేయటం కొందరికి అలవాటు. డ్రెయిన్స్‌లో చెత్తవేయటం వల్ల అవి అడ్డుపడి నీటి ప్రవాహానికి ఇబ్బంది. ఇలాంటి అలవాట్లకు ప్రజలు దూరం జరిగేలా చూడాలి. ఎలాంటి కార్యక్రమమైనా ప్రజల భాగస్వామ్యం ఉంటే సక్సెస్ అవుతుంది. అందర్నీ గేదర్ చేసి కార్యక్రమాలు నిర్వహిస్తే ఆయా కార్యక్రమాలు సక్సెస్ కావడంతోపాటు... ఒత్తిడి కూడా తగ్గుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే గతంలో హ్యాపీ సండేవంటి కార్యక్రమాలు చేపట్టాం. ప్రజలు ఆ కార్యక్రమాల్లో పాల్గొని తమ టాలెంట్‌ను ప్రదర్శించేవారు. ఇక ఒత్తిడి తగ్గించుకునేందుకు లాఫింగ్ సొసైటీల నుంచి షౌటింగ్ సొసైటీలు ఏర్పాటు చేసేంత వరకూ వెళ్లారు. జాతరలు వంటివి చేపట్టేది ప్రజల గ్యాదరింగ్ కోసమే. ఆ తరహాలోనే స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు చేపట్టాలి. స్వచ్ఛతాహీ సేవ సెప్టెంబరు 17నుంచి అక్టోబరు 2 వరకూ చేపట్టాలి" అని సీఎం ఆదేశించారు.

## చేతి వృత్తులకు చేయూతనివ్వాలి

"ఏటి కొప్పాక, కొండపల్లి బొమ్మలు మన సంస్కృతీ సంప్రదాయం. ఆబొమ్మలకు అవసరమైన కలప కోసం చెట్లుపెంచడానికి కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి. చేతి వృత్తులను, కుల వృత్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉంటుంది. గిరిజన, వెనుకబడిన ప్రాంతాల్లో వెదురుతో చేసే ఉత్పత్తుల కోసం ఓ కార్యక్రమాన్ని రూపొందించండి. వెదురు ఉత్పత్తులు చేసేవారికి వెదురును సరఫరా చేసేలాచూడండి. చేతివృత్తులు, కుల వృత్తులు దెబ్బతినకుండా కాపాడాలి. ఎన్ఆర్ఈజీఎస్ కింద ఘన వ్యర్థాల షెడ్లు నిర్మాణానికి కేంద్రానికి లేఖ రాద్దాం. ఇక సీసీ రోడ్లనిర్మాణం సమయంలో కాలువల కోసం మళ్లీ తవ్వ కుండా ముందుగానే పైపులైన్లు పెట్టేలా నిర్మాణంచేపట్టండి. ఏజెన్సీప్రాంతాలను రూరల్ ఏరియా అర్బన్ సౌకర్యాలతో మోడల్ పంచాయితీలుగా తీర్చిదిద్దండి. రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సీసీ రోడ్లున్నా.. డ్రెయిన్లు సరిగ్గా లేవు. ఇలాంటిచోట్ల మేజిక్ డ్రెయిన్ల నిర్మాణంచేపట్టాలి. చాలాచోట్ల మరుగు దొడ్లు లేవు. వాటి వాడకం కూడా జరగటం లేదు. పంచాయితీల్లో పిట్స్‌ను ఎప్పటికప్పుడు క్లీన్ చేసేలా చూడాలి. అత్యవసర పనులకు నిధులుతక్షణం మంజూరు చేస్తాం" అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## గ్రీన్‌కవర్ పెంచే బాధ్యతను ముందుకొచ్చే కార్పొరేట్లకు అప్పజెప్పండి

"సర్క్యులర్ ఎకానమీ పాలసీలు చేపట్టాం. ఐదు జోన్లలో ఐదు సర్క్యులర్ ఎకానమీ పార్కులు ఏర్పాటు చేస్తాం. సాలిడ్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ అనేది సక్రమంగా జరగాలి. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాంగణాలు శుభ్రంగా ఉండేలా కలెక్టర్లు చూసుకోవాలి. నెట్ జీరో, వేస్ట్ టూ వెల్త్ కాన్సెప్టుతో పని చేయాలి. గ్రీన్ కవర్ పెంచడానికి కృషిచేయండి. 2029కి 39శాతానికి 2047కి 50శాతానికి గ్రీన్‌కవర్ చేరుకోవాలి. కార్పొరేట్ సెక్టార్‌ను కూడా గ్రీన్ కవర్ పెంచటంలో భాగస్వాములను చేయండి. 10-20మంది కార్పొరేట్లకు కొంత ప్రాంతమిస్తే ఫారెస్టు ఏరియాను అభివృద్ధి చేస్తారు. నగరవనాలు కూడా అభివృద్ధి చేయాలి. కార్తీక మాసాన్ని కూడా సెలెబ్రేట్ చేసుకుందాం. ఎకో టూరిజం మనకు అతిపెద్ద వనరు. విద్యార్థులకు ఇచ్చిన గ్రీన్ పాస్ పోర్టును ప్రమోట్ చేయండి. పట్టణాల్లో స్వచ్ఛత కోసం తీసుకునే చిన్నచిన్న మార్పులే మంచి ప్రభావం చూపిస్తాయి" అని సీఎం చెప్పారు. సమావేశంలో డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పలువురు మంత్రులు పాల్గొన్నారు.

# పెట్టుబడుల వేట..

## లండన్‌లో మంత్రి లోకేష్ రోడ్ షో

- నవంబర్‌లో విశాఖ పార్టనర్ షిప్ సమ్మిట్ విజయవంతమే లక్ష్యం
- గ్లోబల్ లీడర్లకు ఆహ్వానం
- ఏపీలో అమలవుతున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్, ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలపై ప్రెజెంటేషన్
- 15 నెలల్లో రూ.10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులకు అనుమతి
- మరో ఏడాదిలో రెట్టింపు చేయటమే టార్గెట్



అమరావతి (చైతన్యరథం): పెట్టుబడుల వేటలో భాగంగా రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ యూకే రాజధాని లండన్ వెళ్లారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా అంతర్జాతీయ దిగ్గజ సంస్థలను ఒప్పించటం ఆయన పర్యటన ప్రధాన లక్ష్యం. ఆయా సంస్థల అధినేతలతో సమావేశమై సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏపీలో అమలుచేస్తున్న పెట్టుబడుల, పారిశ్రామిక అనుకూల విధానాలను వివరించి సానుకూల స్పందనతో వారిని రాష్ట్రానికి రప్పించటమే ధ్యేయంగా మంత్రి లోకేష్ లండన్ చేరుకున్నారు. ఈ క్రమంలో.. విశాఖలో నవంబర్ 14, 15 తేదీల్లో ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న పార్టనర్ షిప్ సమ్మిట్ -2025లో పాల్గొనాల్సిందిగా గ్లోబల్ లీడర్లను ఆహ్వానిస్తూ మంత్రి లోకేష్ మంగళవారం రాత్రి లండన్‌లో హైప్రొఫైల్డ్ ఇన్వెస్టర్స్ రోడ్ షో నిర్వహించారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్, పాల్ మాల్ కన్వెన్షన్ వేదికగా మంగళవారం రాత్రి 7గంటలకు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11.30గంటలకు) ఈ రోడ్ షో ప్రారంభమయింది. ఇందులో యుకే డిప్యూటీ హై కమిషనర్ సుజిత్ ఘోష్, టెక్ మహీంద్రా యూరప్ విభాగం ప్రెసిడెంట్ హర్షుల్ అస్నానీ, ఐసిఐసిఐ బ్యాంకు యుకే విభాగం సిఇఓ రాఘవ్ సింఘాల్, ఎపిఐఐసి వైస్ చైర్మన్, ఎండి అభిషిక్త్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ ఫండ్, మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలు, సర్వీస్ ప్రొవైడర్ కంపెనీలకు చెందిన 150మంది సీఈఓలు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుచేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్, ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలు, గత 15నెలల కాలంలో రాష్ట్రానికి వచ్చిన భారీ పెట్టుబడులు, కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు గల అవకాశాలను ఈ సందర్భంగా మంత్రి లోకేష్ వివరించారు.

గత 15 నెలల కాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ. 10,06,799 కోట్ల విలువైన 122 భారీ ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే పరిశ్రమల కోసం లక్ష ఎకరాల భూమి కలిగిన పారిశ్రామిక క్లస్టర్లను ప్రభుత్వం సిద్ధం చేసింది. మరో ఏడాదిలో ఈ పెట్టుబడులను రెట్టింపు చేయాలన్నది ఏపీ ప్రభుత్వ లక్ష్యం. లండన్ రోడ్‌షోలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న సానుకూల అవకాశాలపై మంత్రి లోకేష్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. అలాగే ప్రఖ్యాత సంస్థలైన హిందుజా, రోల్స్ రాయిస్ వంటి గ్రూప్‌లతో ప్రత్యేక సమావేశాలు, గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పెట్టుబడిదారులతో ఫైర్‌సైడ్ చాట్ నిర్వహించారు. రోడ్‌షో సందర్భంగా ఏపీలో పోర్టు ఆధారిత పారిశ్రామికీకరణ, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ఇన్నోవేషన్, ఆధునిక తయారీరంగం వంటి అంశాలను మంత్రి లోకేష్ ప్రముఖంగా ప్రస్తావించారు. పెట్టుబడులతోపాటు శాశ్వత ఆర్థికావకాశాలను ఇన్వెస్టర్లకు వివరించారు. రోడ్ షోలో ఎరిక్సన్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, సియాంట్, ఇవాంటె గ్లోబల్, ఏఐ ఓపెన్‌సెక్, లండన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులతో పాటు ఇతర పరిశ్రమ ప్రముఖులు కూడా హాజరయ్యారు. నవంబర్ లో జరిగే పార్టనర్ షిప్ సమ్మిట్‌కు రావాల్సిందిగా గ్లోబల్ కంపెనీల సీఈఓలు, పాలసీ మేకర్లు, ఇండస్ట్రీ లీడర్లను మంత్రి లోకేష్ ఆహ్వానించారు. ట్రేడ్, టెక్నాలజీ, స్థిరమైన వృద్ధి అంశాలపై లండన్ రోడ్ షోలో కీలక చర్చలు జరిగాయి.

# ఏటా రూ.8వేల కోట్ల లబ్ధి

- జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు చేకూరే లబ్ధి ఇది
- యోగాంధ్ర తరహాలో పెద్దఎత్తున ప్రచారం చేయండి
- అభ్యంతరాల్లేని భూములను రెగ్యులరైజ్ చేయాలి
- పారదర్శకతకు అద్దంపట్టేలా ఎక్సైజ్ శాఖ పనితీరుండాలి
- ప్రజలకు మంచి చేస్తున్నాం... సంతృప్తస్థాయీ పెరగాలి
- రెండో రోజు కలెక్టర్ల కాన్ఫరెన్సులో సీఎం చంద్రబాబు




అమరావతి (చైతన్య రథం): అభ్యంతరాల్లేని భూములను రెగ్యులరైజ్ చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం ఐదో బ్లాకులో రెవెన్యూ, భూములు, ఆదాయార్జన శాఖలపై కలెక్టర్ల సదస్సులో సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "రెవెన్యూ విభాగానికి వచ్చే ఫిర్యాదుల్లో 70 శాతంమేర ఆర్ఓఆర్‌కు సంబంధించిన ఫిర్యాదులే ఉన్నాయి. గత పాలకుల తప్పులతో ఈ స్థాయిలో రెవెన్యూ, భూవివాదాల ఫిర్యాదులు వచ్చాయి. వివిధ ధృవీకరణ పత్రాలకు సంబంధించిన ఫిర్యాదులు, భూములు ఇలా వేర్వేరు అంశాలపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. 22ఏలో భూములు పెట్టేయటంలాంటి చర్యలవల్ల ఈ దుష్ఫలితాలు వచ్చాయి. గత ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి ఇష్టానుసారంగా వ్యవహరించింది. ఇప్పుడా చట్టాన్ని రద్దు చేసి ప్రజల ఆస్తుల రక్షణకు వీలుగా చట్టాన్ని తెచ్చాం. భూముల్ని కాజేయడానికి 22ఏలో పెట్టి బ్లాక్ మెయిల్ చేశారు. రీసర్వే చేసి ఈ రికార్డులను సరి చేయాలి. నిర్దేశిత గడువులోగా వీటిని ప్రక్షాళన చేయాలి. వివిధ ధృవీకరణ పత్రాలకు సంబంధించి ఆఫీసుల చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదు. కులం ఎవరిదీ మారిపోదు. దానిని శాశ్వత ప్రాతిపదికన ఇవ్వాలి. నివాస, వయో ధృవీకరణ కోసం ప్రతీ ఏటా జారీ చేయొచ్చు. 2027కంటే ముందే రీసర్వే ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రయత్నించండి. రికార్డులన్నీ ప్రక్షాళన చేయటమే లక్ష్యంగా పని చేయాలి. జియో ట్యాగింగ్, క్యూఆర్ కోడ్ కూడా పెట్టి రికార్డులు ఇస్తాం. గ్రామ కంఠంలోని ఆస్తులకు స్వమిత్వ పథకం కింద యాజమాన్య పత్రాలు ఇచ్చేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలి. సింహాచల భూముల పంచ గ్రామాల సమస్యను తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోండి. రెవెన్యూలో టెక్నాలజీ ఇంటిగ్రేషన్ త్వరితగతిన పూర్తి చేయాలి" అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

### ధరలు తగ్గిన విధానం ప్రజలకు తెలపండి

"జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల రాష్ట్ర ప్రజలకు రూ.8 వేల కోట్ల మేర ప్రయోజనం ప్రతీ ఏటా కలుగుతుంది. పన్నుల తగ్గింపుపై ఈనెల 19న నోటిఫికేషన్లను జారీ చేసేలా కార్యాచరణ. గ్రామస్థాయి వరకూ ఏ వస్తువుకు ఎంత పన్ను తగ్గిందన్న అంశాలను ప్రజలకు తెలిసేలా ప్రకటన జారీ చేయండి. జీవిత బీమా, ఆరోగ్య బీమాపై ఇప్పుడు జీఎస్టీ లేదు.

ఈ క్రమంలో యూనివర్సల్ హెల్త్ కార్డుపై ఏమేరకు ప్రయోజనం కలుగుతుందో అంచనా వేయండి. జీఎస్టీ పన్నుల తగ్గింపు ప్రయోజనాలపై నెల రోజులపాటు అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలి. యోగాంధ్ర విషయంలో ఎంత పెద్ద రికార్డు సృష్టించే దిశగా ఏస్థాయి ప్రచారం చేశామో... జీఎస్టీ సంస్కరణల విషయంలోనూ అదేస్థాయిలో ప్రచారం చేయాలి. సెప్టెంబరు 22నుంచి అక్టోబరు 22వరకూ ప్రజల్లో అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలి. కార్యక్రమంలో మంత్రులు, కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొనేలా కార్యాచరణ రూపొందించాలి. జిల్లాల నుంచి జీఎస్టీ, పన్ను ఆదాయాలు ఎలా ఉన్నాయన్న దానిపైనా పర్యవేక్షణ చేయండి" అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

### ప్రజల సంతృప్తే ముఖ్యం

"ఆదాయాలు తగ్గకుండా జిల్లా కలెక్టర్లు ఫోకస్ పెట్టాలి. ముఖ్యంగా మైనింగ్ ఆదాయంలో ఏ జిల్లాలు వెనుకంజలో ఉన్నాయో బేరీజు వేస్తాం. కొన్ని జిల్లాల్లో ఆదాయం గణనీయంగా పడిపోవటం వెనుక కారణమేమిటో విశ్లేషించాలి. జిల్లాలవారీగా మైనింగ్ ఆదాయం పెరగాలి. మైనింగ్ ఎక్కువ ఉన్నచోట వ్యాల్యూ అడిషన్‌కు వెళ్లాలి. ప్రతీ నెలా రెవెన్యూ రియలైజేషన్, జీఎస్డీపీపై సమీక్షించుకుంటున్నాం. ఉచిత ఇసుక విధానంలో ప్రజల్లో సంతృప్తిస్థాయి రావాలి. రూ.1000 కోట్ల రెవెన్యూను ప్రభుత్వం కోల్పోయి ప్రజలకు ఉచిత ఇసుక అందిస్తోంది. ఇలాంటి అంశాల్లో ప్రజలు సంతృప్తి పడేలా ఉండాలి. ఇసుక సరఫరాపై మేం ఎప్పటికప్పుడు సర్వేలు చేపడుతున్నాం. ఉచిత ఇసుక విధానంపై ప్రజల సంతృప్తస్థాయి మరింతగా పెరగాల్సి ఉంది. ప్రభుత్వం పైసా కూడా ఆశించకుండా ప్రజలకు ఉచిత ఇసుక ఇస్తోంది. కేవలం రవాణా ఖర్చులు మాత్రమే వారు భరించాలి. ఇసుక తీసుకెళ్లేందుకు ముందుకొచ్చిన ప్రజలను అడ్డుకోవద్దు" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

### బీపీఎస్-ఎల్ఆర్ఎస్ స్కీమ్‌పై కలెక్టర్లు ఫోకస్ పెట్టాలి

"తిరుపతి ఎర్రచందనం డిపో సీసీ టీవీలను ఏర్పాటుచేసి పర్యవేక్షించండి. ఎర్రచందనం దుంగలను వ్యాల్యూ అడిషన్ చేసి ఉత్పత్తులు తయారు చేయండి. అలాగే ఎర్రచందనం ఉత్పత్తులు, ఇతర అంశాలు తెలియచేసేలా డిపోవద్ద ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి. మోటారు వాహనాల పన్నులపై కలెక్టర్లు దృష్టి సారించాలి. మున్సిపల్ విభాగం శాటిలైట్ చిత్రాల ఆధారంగా అక్రమ కట్టడాలను గుర్తించేలా ప్రక్రియ చేపట్టండి. బీపీఎస్, ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను పూర్తి చేసేలా కలెక్టర్లు ఫోకస్ చేయాలి. కొత్త లే-అవుట్లల్లో డ్రెయిన్లకు స్థలం కేటాయించేలా అధికారులు దృష్టి సారించాలి. స్వర్ణ పంచాయత్ పోర్టల్‌ను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయండి. గత ప్రభుత్వంలో జరిగిన అతి పెద్ద కుంభకోణం లిక్కర్ స్కాం. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎక్సైజ్ శాఖను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. ప్రొక్యూర్‌మెంట్ మాన్యుఫాక్చరింగ్, విక్రయం వరకూ అంతా పారదర్శకంగా జరగాలి. ఆన్‌లైన్ పేమెంట్లు 100 శాతం జరగాల్సిందే. ప్రపంచ ప్రమాణాలతో రీహాబిలిటేషన్, డీఅడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయండి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.





## నేడు విశాఖకు సీఎం చంద్రబాబు

### స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్, జీసీసీ బిజినెస్ సమ్మిట్‌కు హాజరు

అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం విశాఖపట్టణంలో పర్యటించనున్నారు. ఉదయం 11.35 గంటలకు విశాఖ చేరుకుంటారు. మహిళారోగ్య పరిరక్షణకు సంబంధించి స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పేరుతో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు.

ఆంధ్రా యూనివర్శిటీలోని సాగరికా ఫంక్షన్ హాల్లో హెల్త్ క్యాంపులను సీఎం సందర్శించనున్నారు. తర్వాత 12 గంటలకు ఆంధ్రా యూనివర్శిటీ కన్వెన్షన్ సెంటర్లో ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించే స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ సభలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు రాడిసన్ బ్లూ హోటల్లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బిజినెస్ సమ్మిట్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతారు. అక్కడే నెదర్లాండ్స్, ఫ్రెంచ్ దేశాలకు చెందిన ప్రతినిధుల బృందంతో చంద్రబాబు విడివిడిగా సమావేశమవుతారు. రాత్రి 07.40 గంటలకు విశాఖ పర్యటన ముగించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతికి బయలుదేరతారు.



## కోడెలకు సీఎం నివాళి

అమరావతి (చైతన్య రథం): నవ్యాంధ్ర ప్రదేశ్ తొలి స్పీకర్ కోడెల శివప్రసాద్ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాళి అర్పించారు. ఈమేరకు మంగళవారం ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. 'నవ్యాంధ్రప్రదేశ్ తొలి స్పీకర్, ప్రజానేత డాక్టర్ కోడెల శివప్రసాదరావు 6వ వర్ధంతి సందర్భంగా నివాళి. ప్రజాసేవలో చిత్తశుద్ధి, పల్నాడు అభివృద్ధిపట్ల ఆయన అంకితభావం సదా స్ఫూర్తిదాయకం' అని పేర్కొన్నారు.




చైతన్యరథం




- 1984 ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో కీలక ఘట్టం
- సంక్షేమాన్ని పరిచయం చేసిన మహోన్నతుడు ఎన్టీఆర్
- తెలుగు వైభవం.. ఎన్టీఆర్
- ఎన్టీఆర్ స్ఫూర్తితో స్వర్ణాంధ్ర కల సాకారం చేస్తాం
- అమరావతిలో తెలుగు వైభవం పేరిట ఎన్టీఆర్ స్మృతివనం ఏర్పాటు
- సజీవ చరిత్ర 1984- ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం పుస్తకావిష్కరణలో సీఎం చంద్రబాబు
- ఎన్టీఆర్ మొబైల్ యాప్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి

# దేశ రాజకీయాల్లో.. ఎన్టీఆర్ పెను సంచలనం





విజయవాడ(చైతన్యరథం): తెలుగుదేశం ప్రభుత్వాలు తీసుకొచ్చిన ప్రతిపాలసీ దేశానికే ఆదర్శం గా నిలిచా యని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అమరావతిలో తెలుగువైభవం పేరిట ఎన్టీఆర్ స్మృతివనం ఏర్పాటుచేస్తామని, ఎన్టీఆర్ స్ఫూర్తితో స్వర్ణాంధ్ర కల సాకారం చేస్తామని, పేదరికంలేని సమాజం సాధిస్తామని స్పష్టం చేశారు. విజయవాడ పోరంకిలో నిర్వహించిన 'సజీవ చరిత్ర-1984 ప్రజా స్వామ్య పరిరక్షణ ఉద్యమం' పుస్తకావిష్కరణ కార్య క్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఈపుస్తకాన్ని రూపొందించింది. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "సజీవ చరిత్ర పుస్తకం 40ఏళ్లు వెనక్కి తీసు కెళ్లింది. ఆనాటి జ్ఞాపకాలన్నీ వరుసగా గుర్తుకొస్తున్నాయి. దేశ రాజ కీయాల్లో 1983 ఒక సంచలనం. ఒక ప్రాంతీయ పార్టీ పెట్టి దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన యుగపురుషుడు నందమూరి తారక రామారావు. 1984లో జరిగిన ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం కూడా ఎప్పటికీ సజీవంగానే ఉంటుంది. నాటి కాంగ్రెస్ నాయకులు, ఢిల్లీ పెద్దలు తెరవెనుక కుట్ర లకు తెరతీశారు.ప్రజాస్వామ్యయుతంగా ముఖ్యమంత్రి అయిన వ్యక్తిని 20నెలలకే ఇంటికి పంపించాలని చూశారు. గుండె ఆపరేషన్ కోసం ఎన్టీఆర్ అమెరికా వెళ్లి తిరిగి వచ్చిన రోజే కుట్రకు తెరలేపారు" అని సీఎం చంద్రబాబు అన్నారు.

## సమిష్టిగా పోరాడాం

"ఆ రోజు ఏదో కుట్ర జరుగుతోందని అర్థమైంది. దాన్ని తిప్పి కొట్టాలంటే మెజారిటీ ఎమ్మెల్యేలు ఉండా లని రాత్రికి రాత్రే 161 ఎమ్మెల్యేలను ముషీరాబాద్ లోని రామకృష్ణ స్టూడియోలో పెట్టాం. అదో గేమ్ ఛేంజర్. ఆనాడు ఎమ్మెల్యే క్వార్టర్స్‌కి ఎమ్మెల్యేలను తీసుకురావడంలో ఇంద్రసేనారెడ్డి ముఖ్య పాత్ర పోషిం చారు. వెంకయ్యనాయుడు ఎన్టీఆర్ వెనుకే ఉండి, దేశంలో ఉండే నేతలందరికి ఒకతాటిపైకి తీసుకొచ్చా రు. ఎన్టీఆర్‌కు వెంకయ్యనాయుడంటే ప్రత్యేకమైన అభిమానం ఉండేది. ఆనాడు అప్రజాస్వామికంగా నాటి రాష్ట్ర గవర్నర్ రామ్‌లాల్ ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేశారు. అసమ్మతి నాయకుడిని ముఖ్యమంత్రి సీట్లో కూర్చోబెట్టారు. ముఖ్యమంత్రిగా గవర్నరును కలవడానికి వెళ్లిన ఎన్టీఆర్‌ను తిరిగి పోలీస్ వ్యాన్‌లో కంట్రోల్ రూమ్‌కు తీసుకెళ్లిన ఘటన ఎప్పటికీ మర్చి పోలేను" అని సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం... ఓ చరిత్ర

"కాంగ్రెస్ పార్టీ కుట్ర రాజకీయాలకు మొత్తం దేశమంతా భగ్గుమంది. నాడు ఎన్టీఆర్ కాశ్మీర్‌నుంచి కన్యాకుమారి వరకు కాంగ్రెసేతర రాజకీయ పార్టీలను ఏకతాటిపైకి తెచ్చారు. తెలంగాణ, ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ... ఇలా ప్రాంతంతో సంబం ధం లేకుండా రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ పరిరక్షణ ఉద్యమంచేపట్టారు. ఓనాయకుడికి చరిత్రలో ఎప్పుడూ చూడని సంఘీభావం చూశాను. ఆనాడు ఎమ్మెల్యేలను కాపాడుకోవడమే మా ముందున్న అతిపెద్ద సవాల్. ఒక్కో ఎమ్మెల్యేకి మంత్రి పదవి,రూ.కోటి డబ్బు ఆఫర్ చేశారు. కానీ ఎందరో మాకు సహకరించారు. కర్ణాట కలో రామకృష్ణహెగ్డే ప్రభుత్వం మాకుషెల్టర్ ఇచ్చింది. నాటి మంత్రి రఘుపతి మాకు ఎంతో సాయం చేశారు" అని సీఎం చంద్రబాబు చరిత్ర జాడను గుర్తు చేశారు.

## మహా పోరాటంలో గెలిచిన ఎన్టీఆర్

"1947నుంచి 1984 వరకు 26 కాంగ్రెసేతర ప్రభుత్వాల్ని కూల్చేశారు. 18నెలలకు ఒక్కో ప్రభుత్వం పోయింది. కానీ మహా పోరాటంలో గెలిచిన ఒకే ఒక వ్యక్తి ఎన్టీఆర్. జాతీయస్థాయిలో 18 పార్టీలు జట్టు కట్టాయి. గవర్నర్ రామ్‌లాల్‌ను రీకాల్ చేయాలనే నినాదం హోరెత్తింది.కట్టుబట్టలతో వెళ్లి 30రోజులకు ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాకే తిరిగొచ్చాను. నాలాంటి లక్షలమంది త్యాగాలు చేసి పోరాడారు. చరణ్‌సింగ్, చంద్రశేఖర్, వాజపేయి, అద్వానీ, జార్జి ఫెర్నాండజ్, కరుణానిధి, చండ్ర రాజేశ్వరరావు, మాకినేని బసవపున్నయ్య... కేంద్రస్థాయి అఖిలపక్ష సారధ్య సంఘంలో ఉన్నారు. వెంకయ్యనాయుడు, ఇంద్రసేనారెడ్డి, బండారు దత్తాత్రేయ, సుందరయ్య పోరాడారు" అంటూ నాటి రోజులను ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు.

## చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన ఎన్టీఆర్

"సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్లు అని నమ్మిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్. తెలుగువారి గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారు. సజీవ చరిత్ర పేరుతో ఈ పుస్తకాన్ని భావితరాలకు అంద జేసిన టీడీ జనార్ధన్, విక్రమ్ పూలని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఎన్టీఆర్ ప్రారంభించిన సంక్షేమ కార్యక్రమాలను నేడు దేశమంతా అమలు చేస్తున్నారు. ఎన్టీఆర్ శ్రీకారం చుట్టిన నదుల అనుసంధానం దేశ మంతటా అమలవుతోంది.ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో హక్కు కల్పిస్తే మనం స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. ఎన్టీఆర్ మహిళలకు స్థానిక సంస్థల్లో 9శాతం రిజర్వేషన్లు పెడితే.. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో చట్టసభల్లో ఆడ బిడ్డలకు 33శాతం రిజర్వేషన్లు వస్తున్నాయి. ఆనాడు ఎన్టీఆర్ యాంటీ కాంగ్రెస్ ఉద్యమం ప్రారంభించారు. నేడు దేశంలో ఎన్డీఏ ప్రభుత్వం సుస్థిరంగా ఉంది. ప్రధాని మోదీ సారధ్యంలో భారత ఆర్థిక వ్యవస్థను 4వ స్థానంలోకి తెచ్చారు. భవిష్యత్‌లో ప్రపంచంలోనే మన దేశం అగ్రస్థానంలో నిలవబోతోంది" అని సీఎం చంద్రబాబు అన్నారు.

## తెలుగుజాతిని నెంబర్ వన్ చేస్తాం

"ఎన్టీఆర్ విగ్రహం చూసి సంకల్పం తీసుకుంటే ఏ పనైనా దిగ్విజయంగా పూర్తవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ తెలుగు వైభవం, తెలుగుదనానికి ప్రతిబింబం. తెలుగుజాతి ఆత్మగౌర వానికి ప్రతీక. ఆయన జీవితం వడ్డించిన విస్తరి కాదు. పట్టుదల, ఆత్మ విశ్వాసంతో ఒక్కో మెట్టు ఎదిగారు. మనకు దేవుడంటే ఎన్టీఆరే. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, కర్ణుడు అంటే ఎన్టీఆర్ రూపంలోనే చూశాం. ప్రజా స్వామ్యంలో నియంత పోకడలకు చోటులేదని 2024 ఎన్నికల్లో ప్రజలు నిరూపించారు. దేశానికి సంక్షేమం పరిచయంచేసిన ఎన్టీఆర్ స్ఫూర్తితో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం. అర్హులందరికీ సంక్షేమం అందిస్తాం. ప్రపంచంలోనే తెలుగుజాతిని నెంబర్ వన్ చేస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.







# సమాజంలో వైషమ్యాల సృష్టికి కుట్రలు

- పేట్రేగిపోతున్న అరాచక శక్తులు
- సామాజిక వర్గాల మధ్య అంతరాలు సృష్టించే యత్నాలు
- విద్రోహ శక్తుల పట్ల నిరంతర అప్రమత్తత అవసరం
- సోషల్ మీడియా పోస్టులు, ఫ్లెక్సీలపై నిఘా
- మహిళల భద్రతకు ప్రాధాన్యత, సుగాలి ప్రీతి కేసుపై ప్రత్యేక శ్రద్ధ
- డ్రగ్స్ వ్యాప్తిపై ఉక్కుపాదం మోపాలి
- కలెక్టర్ల సదస్సులో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



అమరావతి (చైతన్యరథం): సమాజంలో వైషమ్యాలు సృష్టించేలా, సామాజికవర్గాల మధ్య అంతరాలు పెంచేలా ఈ మధ్య కొన్ని శక్తులు పేట్రేగిపోతున్నాయి.. అలాంటి శక్తుల కదలికల పట్ల నిరంతరం నిఘా ఉంచాలని అధికారులకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచించారు. మంగళవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి నేతృత్వంలో జరిగిన కలెక్టర్ల సదస్సులో ఇతర మంత్రివర్గ సహచరులతో కలసి పవన్ కళ్యాణ్ గారు పాల్గొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతోపాటు పలు అంశాలపై అధికారులకు దిశానిర్ధేశం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు సమష్టిగా కష్టపడదామని పిలుపునిచ్చారు. సామాజిక వర్గాల మధ్య గొడవలుపెట్టేలా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు, సభలు సమావేశాలపై పోలీసులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి... అలాంటి శక్తులను ముందస్తుగా గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోకి పెట్టుబడులు రాకుండా, అభివృద్ధిని నిరోధించే విధంగా ప్రజల్లో వైషమ్యాలు సృష్టించేందుకు, రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుశాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలి. వారి రక్షణ విషయంలో ఖచ్చితమైన లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు వెళ్లాలి. సుగాలి ప్రీతి కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముందుకు తీసుకువెళ్లాలి. ఆ కుటుంబానికి త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలి. సాంఘిక సంక్షేమ హాస్టళ్ల వద్ద, ముఖ్యంగా బాలికల హాస్టళ్ల వద్ద సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలి. సంక్షేమ హాస్టళ్ల వద్ద జరుగుతున్న నేరాలు వెలుగులోకి రావడం లేదని పవన్ అన్నారు.

### పరిమితులు అవసరం

రాష్ట్రంలో గత ప్రభుత్వంలో జరిగిన సంఘటనల దృష్ట్యా ఆలయాలు, ప్రార్థనా మందిరాల వద్ద నిఘా విస్తృతం చేయండి. ఆలయాల ధ్వంసానికి పాల్పడే శక్తుల పట్ల అప్రమత్తత అవసరం. శబ్ద కాలుష్యానికి కారణం అవుతున్న డీజేలు, మైకుల అనుమతుల వ్యవహారంలో పరిమితులు పాటించాలి. ముఖ్యంగా మతపరమైన కార్యక్రమాలు, సినిమా ఫంక్షన్లలో డిసిబెల్ ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని పవన్ ఆదేశించారు.

### గంజాయిరహిత రాష్ట్రం సాకారం కావాలి

రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ వ్యాప్తిపై ఉక్కుపాదం మోపాలి. గంజాయి, డ్రగ్స్ రవాణా, మార్కెటింగ్ చేసే వారిపై దృష్టి పెట్టండి. ముఖ్యంగా కళాశాలలు, స్కూళ్ల వద్ద అమ్మకాలు సాగించే శక్తులపై నిఘా ఉంచితే అసలు నిందితులను పట్టుకోవచ్చు. డ్రగ్స్, గంజాయి సప్లయ్ చైన్‌ను బ్రేక్ చేస్తే సమాజంలో చాలా వరకు నేరాలు తగ్గుతాయి. దీనిపై అన్ని జిల్లాల ఎస్పీలు ప్రత్యేకంగా దృష్టి సారించాలి. డ్రగ్స్, గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ సాకారం కావాలన్నదే మనందరి లక్ష్యం కావాలని పవన్ పిలుపు ఇచ్చారు.

### తీవ్ర నేరాల సంఖ్య అదుపులోకి రావాలి

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ తదితర ప్రాంతాల్లో ఇటీవల కులాల మధ్య సమస్యలు తలెత్తాయి. సినిమా హీరోలు, నాయకులకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే సంద ర్భాల్లో కూడా కులాలను తీసుకువస్తున్నారు. అలాంటి ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేసే వారిని కట్టడి చేయాలి. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో కఠినంగా వ్యవహరించండి. అవసరం అయితే లా అండ్ ఆర్డర్ పరిరక్షణకు ప్రజల నుంచి సహకారం తీసుకోవాలి. ప్రజలతో స్నేహంగా మెలగండి. అదే సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించాల్సిన అవసరం లేదు. రాష్ట్రంలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గాలి. తీవ్రమైన నేరాల సంఖ్య అదుపులోకి రావాలి. వచ్చే ఏడాది కాలంలో 33 శాతం తగ్గుదల కనబడాలని వపన్ లక్ష్యం నిర్దేశించారు.

# రైతులపై జగన్ మొసలికన్నీరు

- వైసీపీ హయాంలో వారికి మిగిలింది కడగండ్లే
- నేడు అబద్ధాలతో సానుభూతి డ్రామాలు
- మద్దతు ధర విధానం అంటే జగన్‌కు తెలుసా
- ఉల్లి, టమోటా రైతులకు అండగా కూటమి ప్రభుత్వం
- వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి (చైతన్యరథం): ఉల్లి, టమోటా రైతుల దీనస్థితి అంటూ జగన్ రెడ్డి మొసలి కన్నీరు కారుస్తున్నాడని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా మండిపడ్డారు. రైతుల కష్టాలు నిజంగా పట్టించుకునే హృదయం జగన్‌కి ఉంటే తన పాలనలోనే రైతులను ఎందుకు దోపిడీకి గురి చేశాడని ప్రశ్నించారు.

రైతుల పట్ల కనీసం చిత్తశుద్ధి లేని జగన్ ఇప్పుడొచ్చి అబద్ధపు మాటలతో సానుభూతి డ్రామా ఆడుతున్నాడని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉల్లి, టమోటా రైతుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధర చెల్లించిందని గుర్తు చేశారు. మద్దతు ధరలు, రైతుల గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదన్నారు. రైతులకు అండగా నిలబడటం అంటే డ్రామాలు కాదు, క్షేత్ర స్థాయిలో ఫలితాలు చూపించడమేనని స్పష్టం చేశారు. జగన్ పాలనలో రైతులు అనేక కడగండ్లకు గురయ్యారు.. ఇప్పుడు ఆయన కార్చేది మొసలి కన్నీరు తప్ప మరొకటి కాదని మంత్రి అచ్చెన్నాయుడు కొట్టేశారు.

### రైతులకు అండగా..

ప్రస్తుతం ఉల్లి రైతులను ఆదుకోవడం లేదని జగన్ అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాడని, మార్కెట్‌లో ధరలు పెరగడం, తగ్గడం అనే విషయం మార్కెట్ డైనమిక్స్‌పై ఆధారపడి ఉంటుందన్నారు. ధరలు తగ్గినప్పుడు వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరను అందించి రైతులకు తమ ప్రభుత్వం న్యాయం చేస్తోందని, ధరలు పెరిగినప్పుడు సబ్సిడీ రూపంలో వినియోగదారులకు సరసమైన ధరలకు ఉత్పత్తులను అందచేస్తోందని తెలిపారు. ఈ ఏడాది ఉల్లి ధరలు పతనమవుతున్నాయని ముందస్తు అంచనా వేసి క్వాలిటీతో సంబంధం లేకుండా రూ.1200 మద్దతు ధరను ప్రకటించామని తెలిపారు. తొలుత మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే ప్రత్యక్షంగా రైతులకు ఉల్లి క్వింటాకు రూ.1200 చెల్లించి కొనుగోలుచేసి రైతు బజార్ల ద్వారా అమ్మకాలు జరిపిందన్నారు. డిమాండ్ ను మించి ఒకేసారి రైతులు పంటనుమార్కెట్‌కు తీసు కురావడంతో మార్కెట్ వ్యత్యాసపు ధరను ప్రకటించా మన్నారు. వ్యాపారులు క్వింటా రూ.1200 ధరకు తక్కువగా కొనుగోలు చేస్తే..వ్యత్యాసం నగదును ప్రభుత్వమే రైతులకు చెల్లిస్తోందన్నారు. గతంలో 2016లో ఉల్లి ధరలు పడిపోతే 7723మంది రైతుల నుండి 2.77 లక్షల క్వింటాళ్ళు కొనుగోలు చేసి రూ.7 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించామని, 2018లో మరోసారి 9740మంది రైతుల నుండి 3.48లక్షల క్వింటాళ్ళ ఉల్లి కొనుగోలుచేసి రూ.6.45 కోట్లు చెల్లించామని తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ 15వ తేదీ వరకు రైతు బజార్లకోసం 9014 క్వింటాళ్ల ఉల్లిని కొనుగోలుచేశాం.మార్క్ ఫెడ్ ద్వారా 53, 239 క్వింటాళ్లను సేకరించాం. వ్యాపారులు 15292 క్వింటాల ఉల్లిని కోనుగోలు చేశారు. రైతుల నుండి 5.97 కోట్ల విలువైన ఉల్లి కొనుగోళ్లు జరిగాయి. అందులో ధర వ్యత్యాసం కింద 752మంది రైతులకు రూ.4.25 కోట్లు ప్రభుత్వం చెల్లిస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.



### వైసీపీ హయాంలో కంటితుడుపు చర్యలు

జగన్ హయాంలో 2020 సంవత్సరంలో వైసీపీ ప్రభుత్వంలో ఉల్లి ధరలు పడిపోతే, నామ మాత్రంగా క్వింటాకి రూ.770 మద్దతు ధర ప్రకటించి, ఏ ఒక్కరి దగ్గరా ఉల్లి కొనుగోలు చేయకుండా, రైతులను మోసం చేశారు. రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా కూడా జగన్ గుండె కరగలేదు. కేవలం 250 మంది రైతుల దగ్గర కంటితుడుపుగా రూ.75 లక్షల విలువైన మాత్రమే ఉల్లిని కొన్న జగన్ నేడు రైతుల గురించి మాట్లాడుతుడన్నాడని మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. ప్రస్తుతం రైతు బజార్లలో ఉల్లి కిలో రూ.12 నుంచి రూ.15 వరకు అమ్ముతుంటే దానిని వదిలేసి.. ప్రైవేట్ సంస్థ బిగ్ బాస్కెట్‌లో రూ.34కు అమ్ముతున్నారంటూ రైతులను మరింత క్షోభపెట్టేలా మాజీ సీఎం మాట్లాడటం దౌర్భాగ్యం. 2020లో మీ ప్రభుత్వ హయాంలో ఉల్లి ధరలు పడిపోయినప్పుడు ఎంత మంది దగ్గర కొన్నారు, ఎన్ని కోట్లు రైతులకు అందచేశారు అనే విషయంపై వివరాలు చెప్పగలరా... బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ సవాలు విసిరారు. మార్కెట్ ధరల వ్యత్యాసాల సమయంలో రైతుల పట్ల ఎలా వ్యవహరించాం అనేది ముఖ్యం.. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి మధ్య తేడాను ఉదాహరణలతో సహా వెల్లడించామని, ఇలా బహిరంగంగా తెలిపే దమ్ము, ధైర్యం జగన్‌కు ఉందా అని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నించారు.

### టమోటా రైతులకు అండగా..

టమోటా మార్కెట్‌లో ధరలు పడిపోకముందే ధర తగ్గింది, విపరీతంగా సరుకు మార్కెట్‌కు వస్తోంది అనే తప్పుడు సమాచారాన్ని జగన్, ఆయన బ్యాచ్ వ్యాప్తి చేస్తున్నారని, ఇందులో రైతులకు రావలసిన గిట్టుబాటు ధర రాకుండా చేయాలనే కుట్రకోణం దాగి ఉందనే అనుమానం వస్తోందని మంత్రి అచ్చెన్న అన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ధరలు తక్కువగా ఉండటం వల్ల రాయలసీమ ప్రాంత రైతుల నుండి రూ. 2 కోట్ల విలువైన 1677.50 మెట్రిక్ టన్నుల టమోటాను సేకరించి, డిసెంబర్-2024 నుండి మార్చి-2025 వరకు లాభనష్టాలు లేకుండా రాష్ట్రంలోని రైతు బజార్ల ద్వారా విక్రయించాం. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, మే నెలల్లో ధరలు తక్కువగా ఉండటంతో రైతుల నుండి రూ.1.25 కోట్ల విలువైన 1141 మెట్రిక్ టన్నుల టమోటాను కొనుగోలు చేసి రాష్ట్రంలోని రైతు బజార్లకు లాభనష్టం లేకుండా సరఫరా చేసాం. వైసీపీ హయాంలో మొత్తం 3780 మెట్రిక్ టన్నుల టమోటా పంటను సేకరించగా.. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పడి నుండి ఇప్పటి వరకు వరకు 4672 మెట్రిక్ టన్నుల టమోటా పంటను సేకరించామని తెలిపారు. రైతుల పట్ల కనీస చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తూ తప్పుడు కథనాలను సృష్టించి రైతులను మోసం చేస్తున్నాడని, దీని వలన మార్కెట్ మరింత పడిపోతుందన్నారు. రైతుల దగ్గర మద్దతు ధరకు టమోటా కోనుగోలు చేసి రైతు బజార్లులలో అమ్మేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులను ఆదుకునే విషయంలో మీ చేత చెప్పించుకునే స్థితికి మేము దిగజారబోమనే విషయాన్ని జగన్ గుర్తుంచుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# వైశాలికి సీఎం అభినందనలు



అమరావతి (చైతన్య రథం): 'ప్రపంచ చెస్‌బోర్డుపై మనల్ని గర్వపడేలా చేసింది మరో భారత పుత్రిక' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు వైశాలిని అభినందించారు. వరుసగా రెండోసారి ఫైడ్ ఉమెన్స్ గ్రాండ్ స్విస్ 2025 గెలిచి, ఉమెన్స్ క్యాండిడేట్స్ 2026లో తన స్థానాన్ని సంపాదించుకున్నందుకు వైశాలి రమేష్‌బాబుకు సీఎం చంద్రబాబు ఎక్స్ ట్వీట్‌లో అభినందనలు తెలిపారు. ఆమె అంకితభావం, ప్రతిభ నిజంగా స్ఫూర్తిదాయకమని చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు.

# ఏలేశ్వరం - అడ్డతీగల రోడ్డుకు తక్షణ మరమ్మతులు

**- సోషల్ మీడియాలో పోస్టుకి స్పందించిన ఉప ముఖ్యమంత్రి**

అమరావతి (చైతన్యరథం): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏలేశ్వరం - అడ్డతీగల మధ్య రహదారి గుంతలమయంగా మారడంతో ప్రయాణానికి ప్రజలు నానాఇబ్బందులు పడుతున్నారు. చైతన్య రాజు అనే వ్యక్తి ఆ రోడ్డు దుస్థితిని తెలియపరిచే విధంగా ఓ ఫోటోని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఆ పోస్టుని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి ట్యాగ్ చేస్తూ ఈ రోడ్డుని బాగుచేయాలని విజ్ఞప్తి చేశారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన పోస్టుకు పవన్ కళ్యాణ్ తక్షణం స్పందించారు. యుద్ధ ప్రాతిపదికన ఆ రహదారికి మరమ్మతులు చేపట్టి గుంతలు పూడ్చాలని కాకినాడ జిల్లా అధికారులు, ఆర్ అండ్ బీ ఇంజినీర్లను ఆదేశించారు. 10.541 కిలోమీటర్ల ఏలేశ్వరం - అడ్డతీగల రహదారి నిర్మాణంపై చర్చించారు. ఎన్.డి.బి. నిధులతో ఈ రహదారి నిర్మించబోతున్నామని తెలిపారు. రహదారుల నిర్వహణ, మరమ్మతులపై పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గుంతలు లేని రహదారులు ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు.

# కోడెల శివప్రసాద్‌కు ఘన నివాళి

**టీడీపీ కార్యాలయంలో 6వ వర్ధంతి**

**ఆయన సేవలను గుర్తుచేసుకున్న నాయకులు**



మంగళగిరి(చైతన్యరథం): తెలుగుదేశం కేంద్రకార్యాలయంలో నేడు మాజీ స్పీకర్ దివంగత కోడెల శివప్రసాద్ 6వ వర్ధంతిని నిర్వహించారు. ఏపీ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎం.ఏ షరీఫ్, ఏపీ అగ్రికల్చరల్ మిషన్ వైస్ ఛైర్మన్ మారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఏపీ హజ్ కమిటీ ఛైర్మన్ షేక్ హసన్‌బాషా, నేతలు బొద్దులూరి వెంకటేశ్వరరావు, ఏవీ రమణ, పర్చూరి కృష్ణ, సునీల్, మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు తదితరులు పాల్గొని నివాళులర్పించారు. ఏపీ మైనార్టీ వ్యవహారాల సలహాదారు షరీఫ్ మాట్లాడుతూ కోడెల శివప్రసాద్ పల్నాడులో అణచివేతకువ్యతిరేకంగా పోరాడి, ఆ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో తెలుగుదేశంపార్టీకి ఆయనచేసిన సేవలు మర్చిపోలేనివని అన్నారు. కోడెల మరణానికి వైసీపీ నాయకులే కారణమని ఆరోపించారు. అనేక అవమానాలకు గురి చేయడంతో మరణించారని చెప్పారు. మైనార్టీల సమస్యలను కూడా కోడెల పరిష్కరించారని, ఆయన నాయకత్వంలో శ్మశాన వాటికలు అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. అగ్రికల్చరల్ మిషన్ వైస్ ఛైర్మన్ మారెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కోడెల శివప్రసాద్‌ను 'రూపాయి డాక్టర్' అని ప్రజలు పిలుచుకునేవారని చెప్పారు. కోడెల పార్టీలో ఎన్నో మంచి విధానాలను అమలు చేశారని, నరసరావుపేట ప్రాంతానికి గొప్ప పేరు తెచ్చారని అన్నారు. ఎన్టీఆర్ ప్రోత్సాహంతో కోడెల రాజకీయాల్లోకి వచ్చి నీటిపారుదల, హోం శాఖ వంటి అనేక శాఖలకు మంత్రిగా పనిచేశారని తెలిపారు. కోడెల కృషివల్ల కోటప్ప కొండకు రోడ్డునిర్మించారని,అది ఆయన పరమశివుడి భక్తుడనడానికి నిదర్శనమని చెప్పారు. కోటప్పకొండ ఆయన హయాంలోనే అభివృద్ధి చెందిందని తెలిపారు.

# కబ్జాకోరులు, భూ బకాసురులనే బాయ్‌కాట్ చేయాలి

**- ప్రజలకు ఎంపీ కేశినేని శివనాథ్ పిలుపు**

**- విజయవాడ ఉత్సవ్‌పై వైసీపీ నేతల అసత్య ఆరోపణలపై ఆగ్రహం**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ ఉత్సవ్ పై అవాస్తవ ఆరోపణలు చేస్తూ..అడ్డుకోవాలని చూస్తున్న ఉమ్మడి కృష్ణా జిలాకు చెందిన ముగ్గురు వైసీపీ నేతలు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ ఉత్సవ్‌ను బహిష్కరించాలంటున్న కబ్జా కోరులను, దేవాలయ అస్తులు దోచుకున్నవాళ్లను, వీధి రౌడీలు, గూండాయిజం చేసిన వాళ్లందర్నీ సమాజం నుంచి బహిష్కరించాలని ప్రజలకు ఎంపీ శివనాథ్ పిలుపు ఇచ్చారు. ప్రజలు స్వాగతిస్తున్న ఉత్సవాలను వ్యతిరేకిస్తున్న భూ కబ్జా దారులు, భూ బకాసురులకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని ఫార్చ్యూన్ మురళి హోటల్లో మంగళవారం విజయవాడ ఉత్సవ్ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎంపీ శివనాథ్ మీడియాతో మాట్లాడారు. అధ్యాత్మికంగా చేయాలని తలపెట్టిన విజయవాడ ఉత్సవ్ పై, తనపై వైసీపీకి చెందిన ముగ్గురు నాయకుడు అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఓ ప్రశ్నకు సమాధానం తెలిపారు. ఆ ముగ్గురిలో ఒక వ్యక్తి వల్ల 130 దేవాలయాలు ధ్వంసం కావటంతో పాటు, అమ్మవారి విగ్రహాలు చోరీకి గురయ్యాయని గుర్తు చేశారు. దేవాలయాల ఆస్తులు కబ్జా అయ్యాయని, అలాంటి చరిత్ర హీనుడికి విజయవాడ ఉత్సవ్‌పై మాట్లాడే అర్హత లేదన్నారు. ఇక రెండో వ్యక్తి వాళ్ల కుటుంబం విజయవాడలో కబ్జా చేయని వీధి లేదన్నారు. ఉంటున్న ఇంటితో పాటు పక్కన వున్న స్కూల్ ను ఆక్రమించుకున్నాడన్నారు. కబ్జాలు, రౌడీయిజం చేసే ఆ వ్యక్తికి రాజకీయ పరిజ్ఞానం ఏ మాత్రం లేదని, అవాస్తవాలు మాట్లాడటమే పనిగా పెట్టుకున్నాడన్నారు.

అలాగే మూడో వ్యక్తి మచిలీపట్నంలో ఉంటాడు. 2007 లో దేవాలయల భూములు కొట్టేసిన ఘన చరిత్ర అతడిది. వీళ్లు చేసే అవాస్తవ ఆరోపణలకు తాము కాదు, ప్రజలే సమాధానం ఇస్తారన్నారు. తాము విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాన్ని ప్రజా ఆకాంక్షల మేరకు, ప్రజా అవసరాలకోసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దసరా సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం విచ్చేసే భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ ఈ ఉత్సవ్ చేస్తున్నట్లు చెప్పారు. కబ్జాకోరులు, ఖూనీ కోరులు మాట్లాడే మాటలు, అవాస్తవ ఆరోపణలు పట్టించుకోనక్కర్లేదన్నారు. బ్లూ మీడియా పత్రిక మా పేర్లు ప్రస్తావించకుండా వార్తలు ప్రచురిస్తోంది. గతంలో అవాస్తవాలు రాసినందుకు ఆ పత్రిక పై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరువు నష్టం దావా వేశారు. తన పేరు రాస్తే పరువు నష్టం దావా వేయటానికి సిద్ధంగా ఉన్నామని ఎంపీ శివనాథ్ స్పష్టం చేశారు.

దసరా సందర్భంగా విజయవాడకి లక్షలాది మంది ప్రజలు, భక్తులు, పర్యాటకులు వస్తారని ఈ సమయంలో నిర్వహించే విజయవాడ ఉత్సవ్ వల్ల వేలాది మంది చిరు వ్యాపారులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాలు తమ్మలపల్లి కళాక్షేత్రం, పున్నమి ఘాట్, ఘంటసాల సంగీత కళాశాలలో మాత్రమే జరుగుతాయని, గొల్లపూడి లో జరిగే విజయవాడ ఎక్స్-పో వేరన్నారు. విజయవాడ ఉత్సవాలు సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు జరుగుతాయని, గొల్లపూడిలో ఏర్పాటు చేసే విజయవాడ ఎక్స్-పో తర్వాత కూడా కొనసాగుతుందన్నారు. విజయవాడ ఉత్సవ్‌లో ఎక్కడా సినిమా పాటలు ఉండబోవని ఎంపీ శివనాథ్ స్పష్టం చేశారు.

# విజయవాడ ఉత్సవ్ సమావేశంలో మంత్రి సత్యకుమార్ జన్మదిన వేడుకలు

**- శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు, నేతలు**



విజయవాడ (చైతన్యరథం): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు విజయ వాడ ఉత్సవ్ సమావేశంలో ఘనంగా జరిగాయి. సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని ఫార్చ్యూన్ మురళి హోటల్లో మంగళవారం విజయ వాడ ఉత్సవ్ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిధిగా హాజరైన మంత్రి సత్యకుమార్ జన్మదిన వేడుకలను మంత్రులు పార్ధసారథి, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, ఉమ్మడి కష్ణాజిల్లా ప్రజా ప్రతినిధులు, టీడీపీ రాష్ట్ర నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసిన సత్యకుమార్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సత్యకుమార్‌ను శాలువాతో సత్కరించిన ఎంపీ కేశినేని శివనాథ్ కొండపల్లి బొమ్మ బహూకరించారు.

ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్‌కు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, తంగిరాల సౌమ్య, శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), వసంత వెంకట కృష్ణప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, కామినేని శ్రీనివాస్, బోడే ప్రసాద్, వర్ల కుమార్ రాజా, యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, వెస్ట్ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తనయుడు బొండా సిద్దార్థ, మాజీ ఎమెల్సీ బుద్దా వెంకన్న, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ, ఎన్‌టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురామ్, రాష్ట్ర నాగవంశం సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ఎరుబోతు రమణ, సామాజిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ పోతిన బాల కోటయ్య, నగరాల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ మరుపిళ్ల తిరుమలరావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్, ఏపీ బిల్డింగ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, శాలివాహన సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ పేరేపి ఈశ్వర్, గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి, నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయ భాను, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, జనసేన రాష్ట్ర నాయకుడు అమ్మిశెట్టి వాసు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు ఎమ్ఎస్‌బేగ్, బొప్పన భవకుమార్, ముమ్మనేని ప్రసాద్‌లతో పాటు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు, నగర ప్రముఖులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# పారదర్శకంగా భూ సేవలు, రికార్డులు

- వేగంగా రీసర్వే 2.0 పూర్తికి చర్యలు
- డిజిటలైజేషన్‌తో సులభంగా రిజిస్ట్రేషన్ సేవలు
- సీసీఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి
- కలెక్టర్లతో రెవెన్యూ, ఆదాయార్జనపై సమీక్ష

అమరావతి(చైతన్యరథం): రాష్ట్ర రెవెన్యూ అనుబంధ శాఖల నోడల్ సెక్రటరీ, సీసీఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో పారదర్శకమైన భూసేవలు, డిజిటల్ రికార్డులు, చట్టబద్ధమైన పట్టాల పంపిణీ, వేగవంతమైన మ్యూటేషన్, భూ వివాదాల పరిష్కారం వంటి అంశాలపై రెవెన్యూ శాఖ దృష్టి సారించినట్లు తెలిపారు. వీటి ద్వారా ప్రజల విశ్వాసం పెరగడంతో పాటు, వ్యవసాయానికి, పెట్టుబడులకు అనుకూల మైన భూముల పరిపాలన వ్యవస్థ ఏర్పడుతోందన్నారు. పట్టాల పంపిణీ రాష్ట్రంలో ముఖ్యమైన కార్యక్రమంగా కొనసాగుతోంది. భూస్వామ్య హక్కులు స్పష్టంగా తెలియజేసే పట్టాలను గ్రామ స్థాయిలో పంపిణీ చేస్తున్నారు. దీనిద్వారా భూస్వాములకు చట్ట పరమైన రక్షణ లభిస్తుందని తెలిపారు. అలాగే భూమి రికార్డులు స్పష్టతతో ఉండటం వల్ల భవిష్యత్తులో వివాదాలు తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు.

### గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల పరిష్కారం

ప్రజల నుంచి పబ్లిక్‌గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం ద్వారా వచ్చే ఫిర్యాదుల్లో 70 శాతం వరకూ ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఉండేవని వాటి సంఖ్యను తగ్గించేందుకు జిల్లాలవారీగా వర్క్ షాపులను నిర్వహించామని చెప్పారు. 2.5లక్షల ఫిర్యాదులకు గాను 2.15 లక్షల ఫిర్యాదులను అనగా (84.5 శాతం) పరిష్కరించగా 39,712 ఫిర్యాదులు (15.58 శాతం) ప్రోగ్రెస్‌లో ఉన్నట్లు తెలిపారు. అన్ని ఫిర్యాదులను జిల్లాల్లో నూరు శాతం ఆడిట్ చేయించడం జరుగుతోందన్నారు. మేనిఫెస్టో అంశా లైన అందరికీ ఇళ్ల కార్యక్రమానికి సంబంధించి 1.75లక్షల దరఖాస్తు చేయగా ఇప్పటివరకు 20, 674 ఆమోదించగా, మరో లక్షా 2 వేల దరఖాస్తులు పరిశీలనలో ఉండగా 52,501 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరిం చడం జరిగిందన్నారు.

### రికార్డుల డిజిటలైజేషన్‌తో వేగవంతంగా మ్యూటేషన్

రెగ్యులరైజేషన్ స్కీములు కూడా అమలవుతున్నాయి. అనధికార ప్లాట్లకు చట్టబద్ధత కల్పించేందుకు ఈ విధానం ఉపయోగ పడుతోంది. దీని ద్వారా ప్రజలు తమ స్థలాలపై చట్టబద్ధ హక్కులు పొందుతారు. వెబ్‌ల్యాండ్ సిస్టమ్ ద్వారా భూమి రికార్డులను పూర్తిగా డిజిటల్ రూపంలో మార్చారు. ఆటోమేటెడ్ టెంప్లేట్లు వినియోగించడం వల్ల భూమి మ్యూటేషన్ ప్రక్రియ వేగవంతమ వుతోంది. రైతులు, పౌరులు సులభంగా తమ భూమి వివరాలను ఆన్‌లైన్‌లో చూసుకునే సౌకర్యం కలుగుతోంది. మ్యూటేషన్ రిఫార్మ్స్ ద్వారా భూమి లావాదేవీల్లో పారదర్శకత పెరుగుతోంది. రిజిస్ట్రేషన్ తర్వాత భూమి యజమాని పేరులో ఆటోమేటిక్‌గా మార్పులు జరిగే విధానాన్ని ప్రవేశపెట్టారు. దీనివల్ల అవినీతి అవకాశాలు తగ్గి, ప్రజలకు న్యాయం జరుగుతోంది. భూ వివాదాల పరిష్కారం కోసం ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతున్నారు. కలెక్టర్లు, తహసీల్దార్ల ఆధ్వ ర్యంలో పెండింగ్‌లో ఉన్న వివాదాస్పద కేసులను సమీక్షించి



తక్షణ పరిష్కారం చూపిస్తున్నారు. దీని ద్వారా రైతులకు, పేదలకు త్వరిత గతిన న్యాయం అందుతోందని ఆమె తెలిపారు. ఆన్‌లైన్ రెవెన్యూ కోర్టు మేనేజిమెంట్ సిస్టమ్ కింద 10,142 కేసులు నమోదయ్యాయని, వాటి సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సీసీఎల్ఏ జయలక్ష్మి పేర్కొన్నారు.

### వేగంగా భూరీసర్వే 2.0 పూర్తికి చర్యలు

భూముల రీసర్వే 2.0కు సంబంధించి మొత్తం 16,816 గ్రామాలకు గాను ఇప్పటివరకు 6,860 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని అన్నారు. మిగతా గ్రామాల్లో ఈ ప్రక్రియను వేగ వంతంగా పూర్తి చేసేందుకు ఆరు మాసాలకు 2 వేల గ్రామాల్లో రీసర్వేను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదే విధంగా రాష్ట్రంలో స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ రాష్ట్రానికి ఆదా యాన్ని పెంచడమే కాకుండా పౌరులకు ఆధునిక సాంకేతికతతో సులభమైన, వేగవంతమైన, పారదర్శకమైన సేవలను అందించే దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. రిజిస్ట్రేషన్ కార్యా లయాల్లో డిజిటలైజేషన్ చేపట్టి ప్రజలకు ఆన్‌లైన్ సర్వీసులు అంది స్తున్నారు. రిజిస్ట్రేషన్ తర్వాత వెంటనే డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో చూడగల సదుపాయం కల్పించబడింది. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా మార్చేలా సాఫ్ట్‌వేర్ ఆధారిత వ్యవస్థ ప్రవేశపెట్టబడింది. ముందుగా క్యూలైన్‌లో ఎక్కువ సమ యం వెచ్చించాల్సి వచ్చినా, ఇప్పుడు అపాయింట్‌మెంట్ స్లాట్ బుకింగ్ ద్వారా సౌకర్యం కల్పించారు. మ్యూటేషన్ లింకేజీ-రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే భూమి యజమాని పేరు ఆటోమేటిక్‌గా రెవెన్యూ రికార్డుల్లో అప్డేట్ అయ్యే విధానం అమలు చేస్తున్నారు. దీనివల్ల ఒకే సమయంలో రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఆదాయం పెంపు చర్యలలో భాగంగా డిమాండ్ రిజిస్ట్రేషన్లు పెంచడం, అండర్ వాల్యుయేషన్ నియంత్రణ, పెండింగ్ రికవరీలు వసూలు చేయడం వంటి చర్యలు చేపడుతున్నారు. ఈ-స్టాంపింగ్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నారు. పాత పేపర్ స్టాంపుల బదులు ఎలక్ట్రానిక్ స్టాంపులు వినియో గించడం వల్ల అవినీతి తగ్గి భద్రత పెరుగుతోంది. ప్రజలకు సౌకర్యంగా సింగిల్ విండో సిస్టమ్ ద్వారా ఒకే ప్లాట్ ఫారమ్‌లో రిజిస్ట్రేషన్, స్టాంపులు, మ్యూటేషన్, ఎన్‌కంబ్రెన్స్ సర్టిఫికేట్ వంటి సేవలను అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు.

# వ్యర్థాల నిర్వహణకు సమగ్ర కార్యాచరణ

- అక్టోబరు 2 నాటికి చెత్తను తొలగిస్తాం
- రాష్ట్రంలో వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టులు
- సింగిల్-యూజ్ ప్లాస్టిక్ ఫ్రీగా కార్యాలయాలు
- ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్
- రెండో రోజు జిల్లా కలెక్టర్ల సమావేశం
- స్వచ్ఛ భారత్-సర్క్యులర్ ఎకానమీపై చర్చ

అమరావతి(చైతన్యరథం): రెండో రోజు జిల్లా కలెక్టర్ల సమా వేశం ప్రారంభంలో "స్వచ్ఛ భారత్-సర్క్యులర్ ఎకానమీపై చర్చ జరిగింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలక. పట్టణాభివృద్ధి, కాలుష్య నియంత్రణ మండలి, అటవీ శాఖ ప్రగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పట్టణాభివృద్ధి, వ్యర్థాల నిర్వహణ రంగంలో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రానికి స్వచ్ఛ సర్వేక్షణ్ 2024లో కేంద్ర ప్రభు త్వం ప్రకటించిన పురస్కారాలు లభించాయని, ఇది రాష్ట్రం పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణలో తీసుకుంటున్న చర్యలకు గుర్తింపు అని వివరించారు. రాష్ట్రంలో 85.90 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను అక్టోబరు 2 నాటికి తొలగించేందుకు ప్రణాళికలు రూపొందించి నట్లు చెప్పారు. అదనంగా 30 లక్షల మెట్రిక్ టన్నులు డిసెంబర్ 2025 నాటికి శుద్ధి చేయనున్నామన్నారు. వ్యర్థాలను విద్యుత్‌గా మార్చే వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టులు రాష్ట్రంలో ఇప్పటికే విశాఖ పట్నం, గుంటూరు నగరాల్లో అమలు అవుతున్నాయన్నారు. భవిష్యత్తులో నెల్లూరు, రాజమండ్రి, కర్నూలు, కడప, విజయవాడ, తిరుపతి నగరాల్లో కూడా కొత్త ప్రాజెక్టులు ప్రారంభమవుతాయని తెలిపారు. 2027 నాటికి మొత్తం 6 ప్లాంట్లు పూర్తవుతాయని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులు రాష్ట్రంలో 72 క్లస్టర్ల రూపంలో అమలు చేస్తున్నారన్నారు. వీటితో పాటు 417 మెటీరియల్ రికవరీ ఫెసిలిటీస్ గ్రామీణ ప్రాంతాల్లో, 108 ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులు పట్టణాల్లో అభివృద్ధి చేస్తున్నారన్నారు.



ఆర్‌డీఎఫ్(రెఫ్యూజ్ డెరివేడ్ ఫ్యూయల్) ను సిమెంట్ పరిశ్రమల్లో ఉపయోగించనున్నారన్నారు. ముఖ్యంగా కన్‌స్ట్రక్షన్, డీమాలిషన్ వేస్ట్ ప్రాజెక్టులను విశాఖ, విజయవాడ, తిరుపతి నగరాల్లో పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు. కోడి వ్యర్థాల నిర్వహణ కోసం కొత్త ప్లాంట్లు ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు.

### ఎస్‌టీపీఎస్ ప్రాజెక్టులకు భూసేకరణ

గ్రే వాటర్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌టీపీ ఎస్(సెవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్) స్థాపనకు భూసేకరణ జరుగు తోందని తెలిపారు. 142 ఎస్‌టీపీఎస్ కోసం 199 ఎకరాల భూమి అవసరమవుతుందని, అందులో కొంత భాగం ప్రభుత్వ భూమి, కొంత భాగం ప్రైవేట్ భూమిని గుర్తిస్తున్నామని వివరిం చారు. ఉపయోగించిన నీటిని తిరిగి శుద్ధి చేసి పర్యావరణానికి అనుకూలంగా వాడటం దీని లక్ష్యమని తెలిపారు. సర్క్యులర్ ఎకానమీ అమలు వల్ల పర్యావరణ పరిరక్షణ, భూమి వినియోగం, నీటి చక్ర ప్రక్రియ, వనరుల సమర్థ వినియోగం సాధ్యమవు తాయని వివరించారు. వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా ఉపాధి అవకాశాల కల్పన, పర్యావరణం పరిరక్షించ బడుతుందని తెలిపారు. ఏపీ సచివాలయం 15 ఆగస్టు నాటికి సింగిల్-యూజ్ ప్లాస్టిక్ ఫ్రీగా మార్చబడిందన్నారు. ఇది రాష్ట్రం లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఆదర్శంగా నిలుస్తుందని, ఇకపై కలెక్టరేట్లు, ఇతర కార్యాలయాలు కూడా డిసెంబర్ 2025 నాటికి సింగిల్-యూజ్ ప్లాస్టిక్ ఫ్రీగా మార్చాలని కోరారు.

### వ్యర్థాల నిర్వహణలో కొత్త పద్ధతులు

పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్, సర్క్యులర్ ఎకానమీపై ప్రత్యేక దృష్టి సారించిందని, వ్యర్థాల నిర్వహణలో కొత్త పద్ధతులు అవలంబిస్తున్నారన్నారు. గ్రే వాటర్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా కమ్యూనిటీ సోక్ పిట్స్, మ్యాజిక్ డ్రైన్స్, కిచెన్ గార్డెన్స్ వంటి పద్ధతులను ఉపయోగిస్తున్నారు. ఈ చర్యలు జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్‌కు తోడ్పడుతున్నాయని వివరించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ప్రతి ఇంటి వద్ద వ్యర్థాల సేకరణకు 12,000 ట్రైసైకిళ్లు, 5,000 పుష్ కార్టులు, 200 ఈ-ఆటోలు కొనుగోలు చేసి గ్రామపంచాయతీలకు అందజేస్తున్నట్లు చెప్పారు. తడి వ్యర్థాలను రోజుకు 1,096 టన్నులు, పొడి వ్యర్థాలను రోజు కు 333 టన్నులు శుద్ధి చేసే సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హౌస్‌హోల్డ్ కంపోస్ట్ పిట్స్ నిర్మాణం 2026 మార్చి 31 నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా ఉపాధి హామీ కూలీలను వినియోగించనున్నట్లు తెలిపారు. గోవర్ధన్ ప్రాజెక్టులు-రాష్ట్రంలోని 21 గోశాలలో బయోగ్యాస్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో 6 యూనిట్లు అక్టోబర్ 2025 నాటికి, మిగతావి మార్చి 2026 నాటికి పూర్తవుతాయని తెలిపారు. డ్రై వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో కొత్త ఆవిష్కరణగా "స్వచ్ఛ రథం" అనే మొబైల్ వాహనాలను ప్రవేశపెట్టారు. ఇవి గ్రామాలలో పొడి వ్యర్థాలను సేకరించి ఎంఆ ర్ఎఫ్ తరహాలో పనిచేస్తాయి. గుంటూరు, ఎన్టీఆర్, తిరుపతి జిల్లాలలో ఇప్పటికే ప్రయోగాత్మకంగా ప్రారంభమయ్యాయి.

### లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్

లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా కిచెన్ గార్డెన్స్ ద్వారా గ్రే వాటర్ వినియోగం ప్రోత్సహిస్తున్నారు. రాష్ట్రంలో లక్ష్యంగా పెట్టు కున్న 9.38 లక్షల కిచెన్ గార్డెన్స్‌లో 8.15 లక్షలు ఇప్పటికే పూర్త య్యాయి. ముఖ్యంగా కృష్ణా, కాకినాడ, శ్రీ సత్యసాయి, తూర్పు గోదావరి జిల్లాలు 100 శాతం లక్ష్యం సాధించాయి. అ మ్యాజిక్ డ్రైన్స్ నిర్మాణం కోసం 106 గ్రామ పంచాయతీలను ఎంచుకోగా 42 పనులు పూర్తి కాగా, మిగతా వాటిని అక్టోబర్ 2025 నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణానికి రాష్ట్రంలో 77 ప్రాజెక్టులు ప్రతిపా దించినట్లు తెలిపారు. ప్రతి డివిజన్‌కు కనీసం ఒక ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. భూసేకరణలో ఇంకా అనేక జిల్లా లు వెనుకబడి ఉన్నందున కలెక్టర్లు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో మొత్తం 15,995 గ్రామాలు ఓడీఎఫ్ ప్లస్ మోడల్‌గా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా ఇప్పటివరకు 52 శాతం మాత్రమే పూర్తయ్యాయని, 2026 మార్చి నాటికి మిగిలినవి పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ల ను కోరారు.

### 2047 నాటికి 50 శాతం పచ్చదనం

స్వచ్ఛ భారత్-సర్క్యులర్ ఎకానమీపై జరిగిన చర్చలో భాగంగా పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం 30.05 శాతం గ్రీన్ కవర్ ఉన్నదని, 2029 నాటికి 37 శాతం, 2034 నాటికి 42 శాతం, 2039 నాటికి 47 శాతం, 2047 నాటికి 50 శాతం సాధించాలనే లక్ష్యంతో ప్రణాళికలను రూపొందించుకుని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో అటవీ పునరుద్ధరణ, ట్రీ ప్లాంటేషన్లు, మంగ్రూవ్ అడవులు, తీరప్రాంత రక్షణ, అగ్రో ఫారెస్ట్రీ, అర్బన్ మియావాకి గ్రీనింగ్ ప్రాజెక్టులు అమలు చేస్తున్నామన్నారు. ఉపాధి హామీ, సీఎస్ఆర్, ఎన్జీవోలు, టీటీడీ వంటి సంస్థల సహకారంతో విస్తృతంగా మొక్కల నాటకం జరుగుతోందని, ఎకో టూరిజంలో భాగంగా నగర వనాలు, సఫారీలు, ట్రెక్కింగ్ మార్గాలు, నైట్ స్టే సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. కమ్యూనిటీ ఆధారిత ఎకో టూరిజం ప్రాజెక్టులను ప్రోత్సహిం చేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.

# మనమిత్ర నుంచే సర్టిఫికెట్ల డౌన్ లోడ్

- ప్రజల్ని కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దు
- అన్ని సర్టిఫికెట్లు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఇచ్చేలా ఏర్పాట్లు
- డిజి లాకర్, బ్లాక్ చైన్ టెక్నాలజీ ఉపయోగిస్తున్నాం
- ప్రజల్లో అవగాహన కల్పించే బాధ్యత కలెక్టర్లదే
- కలెక్టర్ల సదస్సులో ఐటీ, ఆర్టీజీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంనేని



అమరావతి (చైతన్యరథం): ప్రజలెవ్వరూ కూడా సర్టిఫికెట్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా అన్ని సర్టిఫికెట్లు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే డౌన్ లోడ్ చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్లకు ఐటీ, ఆర్టీజీ శాఖల కార్యదర్శి భాస్కర్ కాటంనేని సూచించారు. సచివాలయంలో జరుగుతున్న జిల్లా కలెక్టర్ల సదస్సులో భాగంగా రెండోరోజు మంగళవారం మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ అమలుపై భాస్కర్ ప్రజంటేషన్ ఇచ్చారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ అద్భుతమైన సాధనమని, దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చేయడంలో జిల్లా కలెక్టర్లే కీలకపాత్ర పోషించాలన్నారు. కుల, నేటివిటీ, జనన, మరణ ధృవీకరణ పత్రాలు ఇతరత్రా సర్టిఫికెట్ల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, సర్టిఫికెట్ల జారీ కోసం ప్రజలను ప్రభుత్వ కార్యాలయాలకు పిలిపించుకోవద్దని సూచించారు. ఇప్పటికీ కూడా చాలా మంది అధికారులు సర్టిఫికెట్ల జారీ కోసం ప్రజలను కార్యాలయాలకు పిలిపించుకుంటున్నారని, ఇది సరికాదన్నారు. కింది స్థాయి కార్యాలయాల్లో, అధికారులు, సిబ్బందికి జిల్లా స్థాయిలో కలెక్టర్లు ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పాలన్నారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్‌లోని మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ యాప్‌లోనే ఎలాంటి ఇబ్బందులు లేకుండా సర్టిఫికెట్ డౌన్ లోడ్ చేసుకోవచ్చన్నారు. వాట్సాప్ ద్వారా డౌన్‌లోడు చేసుకునే డిజిటల్ సర్టిఫికెట్లు సురక్షితమైనవని, అన్ని సర్టిఫికెట్లను డిజి లాకర్లో ఉంటాయని, అలాగే బ్లాక్ చైన్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నామని, కాబట్టి ఈ సర్టిఫికెట్లను ఎవ్వరూ కూడా ట్యాంపర్ చేయలేరని తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ ఉపయోగించుకుంటే ప్రజలకు ఎలాంటి ప్రయోజనాలుంటాయో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ప్రతి శుక్రవారం గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని ప్రతి ఇంటికి పంపి, అక్కడ ప్రజలతో మమేకమై వారికి మనమిత్ర యాప్ ఎలా ఉపయోగించుకోవచ్చో వివరంగా తెలియజెప్పి అవగాహన కల్పించాలన్నారు. దీనిని పూర్తిగా విజయవంతం చేయాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లదేనన్నారు. అధికారులకు సైతం వాట్సాప్ గవర్నెన్స్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలు ఆయా జిల్లాలు, మండలాల్లో అమలు ఏ స్థాయిలో ఉంది, ప్రజల సంతృప్తి ఎలా ఉందనేది మనమిత్రలోనే తెలుసుకోవచ్చన్నారు. ఇప్పటికీ రెవెన్యూ శాఖలో పనులు సంక్లిష్టంగా ఉన్నాయని మెజార్టీ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం 738 రకాల సేవలు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందజేస్తున్నామని తెలిపారు. తదుపరి కూడా మరిన్ని సేవలను ఇందులో జోడిస్తామన్నారు.

# అసెంబ్లీకి రాకుండా ఏం చేస్తారు?

- గెలిపించిన ప్రజలను గాలికొదిలేస్తారా?
- దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



ఆత్మకూరు(చైతన్యరథం): జగన్‌రెడ్డిపై, వైసీపీపై దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నిప్పులు చెరిగారు. జగన్‌రెడ్డి కి ప్రతిపక్ష హెూదా ఎవరిస్తారు? ప్రతిపక్ష హెూదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తా అనడం హాస్యాస్పదం. 11 మంది వైసీపీ సభ్యు లు అసెంబ్లీకి రాకుండా ఏం చేయదలచుకున్నారు..వారికి సమ స్యలు పట్టవా? అని ప్రశ్నించారు. అసెంబ్లీకి వచ్చినా, రాకున్నా ఆ 11 నియోజక వర్గాల ప్రజల భవిష్యత్తుకు చంద్రబాబు ఒక పెద్ద దిక్కుగా భరోసా ఇస్తున్నారు. నువ్వు ఉంటే ఎంత.. లేకుం టే ఎంత? సూపర్‌సిక్స్ పథకాలు రాష్ట్ర వ్యాప్తంగా విజయ వంతంగా అమలు చేస్తున్నాం. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను వైసీపీ గెలిచిన 11 నియోజకవర్గాలలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇస్తు న్నాం. దీపం 2 పథకం కింద సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రతి అక్కచెల్లెళ్లకు ప్రతి ఇంటికి మూడు సిలిండర్లు ఇస్తున్నాం. రైతుల భూములు కొల్లగొట్టాలని, వారి ఆస్తులు దోచేయాలని మీరు అనుకుంటే వారికి ఒక భరోసా ఇచ్చి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేశాం. అన్నదాత సుఖీభవలో భాగంగా మొదటి విడతలో 20 వేల రూపాయలు విడుదల చేశాం. అర్హత గల ప్రతి ఒక్కరికి అన్ని పథకాలు అందిస్తాం. ప్రజ ల సమస్యలు మీకు అవసరం లేదు. మహాశక్తి పథకం తల్లికి వందనం పేరు తో ప్రతి తల్లికి 15 వేలు ఇస్తున్నాం. చదువుకునే బిడ్డలు ఎంత మంది ఉంటే అంతమందికి తల్లికి వందనం అమలు చేస్తున్నాం. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఇస్తున్నాం. ప్రజాస్వామ్యవాది వైతే, భారత రాజ్యాం గానికి కట్టుబడిన వ్యక్తి అయితే అసెంబ్లీకి రావాలని హితవు పలికారు. ప్రజలను గాలికి వదిలేసి నీకు ఓట్లేసిన వారికి న్యాయం చేయలేని మీకు విచక్షణ లేదు. మీ పార్టీలో మరొకరికి బాధ్యతలు అప్పచెప్పి గెలిచిన 11 మీ చేత రాజీనామా చేయించు.. ఎన్నిక లకు వెళదాం.. గెలిపించి వాళ్లను అసెంబ్లీకి పంపించాలని సూచించారు. రాజకీయ అవినీతిలో కూరుకుపోయిన వ్యక్తి జగన్‌రెడ్డి. ఆత్మకూరులో ఐదేళ్లలో మీరు వెలగబెట్టింది ఏమిటో చెప్పా లని ప్రశ్నించారు. మెదడు లేని వ్యక్తితో ఏం మాట్లాడతాం. మతిస్థిమితం లేని రాజకీయ నాయకుల చేతిలో ఈ రోజు రాష్ట్ర ప్రతిపక్ష పార్టీ ఉండటం దురదృష్టకరమన్నారు.

# టీటీడీపై అసత్యప్రచారాలు హేయం

- భూమనపై కేసు నమోదు చేయాలి
- మెడికల్ కాలేజీలపై వైసీపీ నేతల అడ్డగోలు మాటలు
- ఆ పేరుతో జగన్ తీసుకున్న రూ.4500 కోట్ల రుణం ఎటు మళ్లించారు
- ఎన్ని కుట్రలు చేసినా సమర్థవంతంగా మెగా డీఎస్సీ
- శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు




తిరుపతి (చైతన్యరథం): తిరుమల తిరుపతి దేవస్థానం విషయంలో వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలు అత్యంత హేయమని, అసత్య ఆరోపణలు చేసిన భూమన కరుణాకర్ రెడ్డిపై కేసు నమోదు చేయాలని శాప్ ఛైర్మన్ రవినాయుడు ధ్వజమెత్తారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా టీటీడీ, మెడికల్ కాలేజీలపై వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలు, మెగా డీఎస్సీకి సంబంధించిన అంశాలపై ఆయన మాట్లాడారు.

డీఎస్సీని ప్రకటించాలని వేలాదిమంది నిరుద్యోగు లు ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత సీఎం చంద్రబాబు, యువనేత నారా లోకేష్‌లకు మొరపెట్టు కోగా కూటమి ప్రభుత్వం ఏర్పడినరోజునే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేస్తామని,ఏడాదిలోపే డీఎస్సీ ప్రక్రియను చేపడతామని, విద్యాసంవత్సరం ప్రారం భంలోనే ఉద్యోగ నియామకాలు చేపడతామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి రాగానే మొదటి సంతకం పెట్టి 150రోజుల్లోనే ప్రక్రియను పూర్తి చేసి ఈనెల 19వ తేదీన అర్హులందరికీ అమరావతి వేదిక గా నియామకపత్రాలు అందజేస్తున్నారన్నారు. డీఎస్సీ ప్రక్రియ మొదలవగానే వైసీపీ నేత సజ్జల రామకృష్ణా రెడ్డి కుమారుడి ప్రోత్సాహంతో సుప్రీం కోర్టు, హై కోర్టుల్లో 104కేసులు వేసి డీఎస్సీని అడ్డుకునేందుకు ఆ పార్టీ నాయకులు కుట్రలు చేశారన్నారు. వైసీపీ నాయకుల కుట్రలన్నింటిపైనా యువనేత, మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారించి, వాటిని అధిగమించి ఇచ్చినమాట ప్రకారం డీఎస్సీని సమర్ధ వంతంగా పూర్తిచేశారన్నారు. డీఎస్సీలో భాగంగా రాతపరీక్ష లేకుండా 3శాతం క్రీడా కోటా కింద 421 పోస్టులను కేటాయించారన్నారు. అందులో 81మంది జాతీయ క్రీడాకారులు పీఈటీలుగా అర్హత సాధించార న్నారు. స్కూల్‌స్థాయిలో క్రీడారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు నియామకాలు దోహదపడ తాయన్నారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ తరుపున సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖామంత్రి నారా లోకేష్, అలాగే మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

## భూమన దుష్ప్రచారం

మహావిష్ణువు విగ్రహానికి శనీశ్వరుని విగ్రహానికి తేడా తెలియని టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తిరుమలపై చేస్తున్న విషప్రచారాలు చేయడం అత్యంత హేయమన్నారు. 22ఏళ్ల నుంచి శిలా శాల ఉద్ద ఉన్న శనీశ్వరుని విగ్రహాన్ని చూపించి మహావిష్ణువు విగ్రహానికి అపచారం జరిగిందనడం విడ్డూరమన్నారు. శిల్పాన్ని తయారు చేసిన శిల్పి అది శనీశ్వరస్వామి విగ్రహమని, బెంగళూరుకు చెందిన భక్తుడు చేయించగా అతను మరణించడంతో ఇక్కడే ఉండిపోయిందన్నారు. రెండుసార్లు టీటీడీ ఛైర్మన్‌గా చేసిన భూమనకు 22ఏళ్ల నుంచి అక్కడే ఉన్న విగ్రహం కనిపించలేదా అని ధ్వజమెత్తారు. తిరుమల ప్రతిష్టను దెబ్బతీసేందుకు కరుణాకర్ రెడ్డి కుట్రలు చేస్తున్నారన్నారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుతోపాటు పాలకమండలిపై అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. రాజకీయ స్వార్థం కోసం కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరస్వామిని అడ్డుపెట్టుకుని భక్తుల మనోభావాలతో అటలాడుకోవడం సరికాదన్నారు. దీనిపై ముఖ్యమంత్రి, డీజీపీ చర్యలు తీసుకోవాని రవినాయుడు విజ్ఞప్తి చేశారు.

## మెడికల్ కాలేజీలపై పిచ్చి ప్రేలాపనలు

మెడికల్ కాలేజీల విషయంలో గత పదిరోజులుగా పిచ్చికుక్కల మాదిరిగా వైసీపీ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడుతున్నారంటూ, వైసీపీ ప్రభుత్వంలో మెడికల్ కాలేజీలను నిర్మించేస్తే వాటిని చంద్రబాబు ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని విషప్రచారాలు చేస్తే ఊరుకోబోమన్నారు. వైసీపీ ప్రభుత్వ హయంలో ఎన్ని మెడికల్ కాలేజీలను నిర్మించారు, ఎన్ని పూర్తి చేశారో బహిరంగంగా తెలియజేసేందుకు ముందుకురావాలని సవాల్ విసిరారు. పీపీపీ విధానం అంటే ప్రైవేటుపరం చేయడం కాదనేది తెలుసుకోవాలన్నారు. మెరుగైన వైద్య వసతులు, సదుపాయాలు కల్పనలో ప్రైవేటు వ్యక్తులను భాగస్వామ్యం చేసేందుకే పీపీపీ విధానాన్ని తీసుకొచ్చామన్నారు. మెడికల్ కాలేజీల పేరుతో రూ.4500 కోట్లు రుణాలు తీసుకొచ్చింది మీరు కాదా అంటూ వైసీపీ నాయకులను ప్రశ్నించారు. తీసుకున్న రుణం ఎక్కడ వినియోగించారో, ఏం చేశారో అడిగితే సమాధానం లేకుండా దాటివేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రారంభించిన నిర్మాణాలు ఎందుకు పునాదుల దగ్గర ఆగిపోయాయో తెలియజేయాలని రవినాయుడు డిమాండ్ చేశారు. మీకు నిజంగానే చిత్తశుద్ధి ఉంటే విశాఖలోని రుషికొండను తవ్వి రెండేళ్లలోనే ప్యాలెస్ నిర్మించుకున్నప్పుడు ఐదేళ్లలో మెడికల్ కాలేజీల నిర్మాణాలను ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. రూ. 3వేల కోట్లు రంగులకు ఖర్చుపెట్టి ప్రజాధనాన్ని బూడిదలో పోశారన్నారు. రూ.800 కోట్లతో సర్వే రాళ్లపై జగన్ ముఖాన్ని వేసే బదులు మెడికల్ కాలేజీలకు ఖర్చుపెట్టొచ్చు కదా అని ప్రశ్నించారు. సాక్షికి రూ.600 కోట్ల విలువైన ప్రకటనలు ఏ ప్రాతిపదికన ఇచ్చారన్నారు. ఆ డబ్బులను మెడికల్ కాలేజీల నిర్మాణానికి వినియోగించుకోవచ్చు కదా అన్నారు. రేషన్ పంపిణీ ప్రకటనలో జగన్ ఫొటో కోసం రూ.800 కోట్లు ఖర్చుపెట్టే బదులు మెడికల్ కాలేజీ భవనాలకు వినయోగించవచ్చు కదా అన్నారు. రూ.500 కోట్లు ఉంటే భవనాలన్నీ పూర్తవుతాయని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అంటున్నాడని, మరీ మీ ప్రభుత్వ హయంలో నిధులన్నీ దుర్వినియోగమైన ప్పుడు గాడిదలు కాస్తున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంపై ఏదో రకంగా బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. వైసీపీ హయాంలో ప్రతీ పథకానికి జగనన్న అని పేరుపెట్టిన ప్పుడు మీ జేబులో డబ్బు ఇస్తున్నావా జగనన్నా.. అంటూ నిలదీయలేని బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కూడా కూటమి నేతలపై వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్ని నాటకాలు వేసినా ఇక ప్రజలు మిమ్మల్ని నమ్మే పరిస్థితి రాదని రవినాయుడు స్పష్టం చేశారు.

# టీటీడీపై తప్పుడు ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు

- మొదటి విడతలో దళితవాడల్లో 1000 ఆలయాల నిర్మాణం
- శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు
- టీటీడీ బోర్డు నిర్ణయాలను వెల్లడించిన చైర్మన్ బీఆర్ నాయుడు



తిరుమల (చైతన్యరథం): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో మంగళవారం చైర్మన్ అధ్యక్షతన టీటీడీ పాలక మండలి సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మొదటి దశలో రాష్ట్రంలోని దళిత వాడల్లో 1000 ఆలయాలను నిర్మించేందుకు టీటీడీ పాలకమండలి నిర్ణయం తీసుకుంది. టీటీడీపై దుష్ప్రచారం చేసేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని నిర్ణయించింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తో కలిసి మీడియాకు చైర్మన్ వివరించారు. తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 24 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు జరుగనున్నాయి. భక్తుల సౌకర్యార్థం విస్తృతంగా ఏర్పాట్లు చేపడుతున్నాం. ఈ నెల 23వ తేదీ సాయంత్రం 7 గంటలకు అంకురార్పణతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. సెప్టెంబర్ 24వ తేదీ సాయంత్రం 5.43 - 6.15 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా 24వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేపడుతున్నాం. అదే రోజు రాత్రి 9 గంటలకు శ్రీవారు పెద్దశేష వాహన సేవలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. 25వ తేదీన పిఏసి- 5 శ్రీ వెంకటాద్రి నిలయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభిస్తారు. అదేవిధంగా 2026వ సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్లు, డైరీలను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు ఇస్రో సహకారంతో శాటిలైట్ ఆధారంగా భక్తుల సంఖ్యను గణన చేసేందుకు చర్యలు చేపట్టాం. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులను విశేషంగా ఆకట్టుకునేలా పుష్పాలంకరణలు, వివిధ దేవతామూర్తుల ఆర్చిలు, ఎల్ఇడి తోరణాలతో పాటు అన్ని ప్రధాన కూడళ్ళలో పెద్ద ఎల్ఇడి స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నాం. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 23వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు దివ్యాంగులు, వయోవృద్ధులు, ఎన్.ఆర్.ఐ, చిన్నపిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనాలను రద్దు చేశాం. బ్రేక్ దర్శనాలు కేవలం ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే పరిమితం చేశాం. ప్రతి రోజు 8 లక్షల లడ్డూలను అందుబాటులో ఉంచుతున్నాం. ఈ నెల 28న గరుడ సేవ సందర్భంగా 27వ తేదీ రాత్రి 9 గంటల నుండి 29వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు తిరుమలకు ద్విచక్ర వాహనాల రాకపోకలను రద్దు చేస్తున్నాం. అదేవిధంగా, అలిపిరి, శ్రీవారి మెట్టు నడక దారులు 28వ తేదీన 24 గంటల పాటు తెరిచే ఉంటాయి. తిరుమలలోని రద్దీ ప్రాంతాల్లో అదనపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. బ్రహ్మోత్సవాలలో చిన్న పిల్లలు తప్పిపోకుండా జియో ట్యాగింగ్ ఏర్పాటు చేస్తున్నాం. బ్రహ్మోత్సవాలలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు స్వామివారి వాహనసేవలను వీక్షించేలా హెచ్‌డి క్యాలిటీతో నాణ్యంగా ప్రత్యక్ష ప్రసారం చేస్తాం. గరుడసేవనాడు 4 లక్షల మజ్జిగ ప్యాకెట్లు భక్తులకు అందించేందుకు చర్యలు ఏర్పాట్లు చేస్తున్నాం. తిరుమలలో భక్తులను విశేషంగా ఆకట్టుకునేలా ఫల పుష్ప ప్రదర్శన, ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నామని టీటీడీ చైర్మన్ తెలిపారు.

### అనంతవరం ఆలయంలో రూ.7.20 కోట్లతో అభివృద్ధి పనులు

కర్ణాటక రాష్ట్రం బెలగావిలోని కొలికోప్ప గ్రామంలో టీటీడీ శ్రీవాణి ట్రస్టు నిధులతో 7 ఎకరాలలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయాన్ని నిర్మించేందుకు ఆమోదించాం. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం అనంతవరం గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో రూ. 7.20 కోట్లతో రాజగోపురం, ముఖ మండపం, శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారికి ఆభరణాలు, అదేవిధంగా ఆలయంలో తాగునీటి సౌకర్యం, ఆర్చి, మరుగుదొడ్లు, తదితర అభివృద్ధి కార్యక్రమాలు దశలవారీగా చేపట్టేందుకు నిర్ణయం. అన్నమయ్య జిల్లా వాల్మీకిపురంలోని శ్రీ పట్టాభిరామస్వామివారి ఆలయ పుష్కరిణి, కల్యాణ వేదిక మండపం, రాజగోపురం, ఆర్చి, కల్యాణ మండపం తదితర అభివృద్ధి పనులకు రూ. 5.73 కోట్లు, తరిగొండలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి పుష్కరిణి పునః నిర్మాణానికి రూ. 1.50 కోట్లతో పనులు చేపట్టేందుకు నిర్ణయం. హైదరాబాద్‌కు చెందిన బద్రి వెంకటరెడ్డి, బద్రి విష్ణువర్ధన్ రెడ్డిలు గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం కాజా గ్రామంలో సర్వే నంబరు 141-2లో రూ. 89.54 లక్షల విలువ చేసే 0.74 సెంట్ల స్థలాన్ని టీటీడీకి విరాళంగా అందించారు. సదరు భూమిని స్వీకరించేందుకు టీటీడీ పాలక మండలి ఆమోదం తెలిపిందని చైర్మన్ వివరించారు.

ఈ సమావేశంలో టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ఎం.ఎస్.రాజు, పనబాక లక్ష్మి, నర్సిరెడ్డి, సదాశివరావు, జానకి దేవి, జంగా కృష్ణమూర్తి, శాంతా రామ్, సుచిత్ర ఎల్లా, రంగశ్రీ, ఇతర బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

# అది శ్రీమహా విష్ణువు విగ్రహం కాదు

- భూమనది అసత్య ప్రచారం
- ఫ్యాక్ట్‌చెక్ విభాగం స్పష్టీకరణ

అమరావతి (చైతన్యరథం): తిరుపతిలో అలిపిరి వద్ద శ్రీమహా విష్ణువు విగ్రహాన్ని నిర్లక్ష్యంగా పడేశా రని, ఘోర అపచారం జరిగిపోయిందంటూ కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం ఖండించింది. దీని వెనుక ఉన్న అసలు నిజాన్ని వెల్లడిస్తూనే.. ఫేక్ ప్రచారాలతో భక్తుల మనోభావాల్ని దెబ్బతీసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవంటూ గట్టి హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు ఈ అంశంపై 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. తిరుపతిలోని అలిపిరి ఓల్డ్ చెక్ పాయింట్ కారు పార్కింగ్ వద్ద శ్రీ మహావిష్ణువు విగ్రహం పడి ఉందని.. ఆ ప్రదేశమంతా అశు ద్ధం, అపవిత్రంగా ఉందంటూ వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారంటూ ఓ వీడియోను కొందరు ప్రచారం చేస్తున్నారు. అంతేకాదు..హిందుత్వ సంఘా లు, మఠాధిపతులు మేల్కొనాలి.. అంటూ భక్తుల మనోభావాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇది పూర్తిగా ఉద్దేశపూర్వకంగా చేస్తున్న అసత్య ప్రచారం అని స్పష్టం చేసింది.

తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను దెబ్బ తీయడానికి భూమన కరుణాకర్‌రెడ్డి, వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తాజాగా అలిపిరి దగ్గరమూసేసిన శిల్పశాలవద్ద పడేసిఉన్న ఓశనీశ్వరుడి విగ్రహంతో భూమన రాజకీయాలు ప్రారంభించారు. చాలా ఏళ్లుగా అక్కడే ఉన్న విగ్రహాన్ని వీడియో చిత్రీ కరించిన భూమన కరుణాకర్‌రెడ్డి.. విష్ణుమూర్తి విగ్ర హాన్ని టీటీడీ అక్కడ పడేసిందని ఆరోపించారు. అలిపిరి దగ్గర గతంలో పట్టు కన్నయ్య అనే శిల్పికి చెందిన ప్రైవేటు శిల్పకళా క్వార్టర్ ఉండేది. బెంగళూ రుకి చెందిన ఓ భక్తుడు శనీశ్వరుడు విగ్రహం ఆర్డర్ ఇచ్చాడు. శిల్పం తయారీలో లోపం రావడంతో.. ఆ రాతి విగ్రహాన్ని అక్కడే పడేశారు. గత పదేళ్లుగా ఆ విగ్రహం ఆ ప్రాంతంలోనే ఉంది. ఈ విషయం అంద రికీ తెలుసు. భూమనకూ తెలుసు. తిరుపతిలో ఉన్న ప్రతి ఒక్కరికీ తెలుసు. అయితే దీనిని విష్టుమూర్తి విగ్రహం అంటూ టీటీడీపై భూమనతప్పుడు ప్రచారం ప్రారంభించారు. దీనిపై ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పందించి వాస్తవాలు వెల్లడించింది.

### అబద్ధాలకోరు భూమన

వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ అని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి విమర్శించారు. అసత్య ప్రచారాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ.. తిరుమల పవిత్రత, టీటీడీ ప్రతిష్ఠ దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. టీటీడీ చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో బోర్డు సభ్యులు మంగళవారం మీడియాతో మాట్లాడారు. గత పదేళ్లుగా అక్కడే పడిఉన్న ఓ విగ్రహాన్ని చూపించి నేడు కరుణాకర్ రెడ్డి మహావిష్ణువు విగ్రహమని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని భానుప్రకాష్ రెడ్డి మండిపడ్డారు. వైసీపీ హయాంలో శ్రీవారి ఆలయంలోని రాములవారి ఉత్సవ విగ్రహానికి వేలు విరిగిపోయింది. మూడున్నర సంవత్సరాలు పట్టించుకున్న పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాములవారి విగ్రహానికి ఆగమశాస్త్రం ప్రకారం మరమ్మతు చేశామని భానుప్రకాష్ రెడ్డి తెలిపారు.

అసత్య ప్రచారాలు మానుకోకపోతే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే, బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజు హెచ్చరించారు. కరుణాకర్ రెడ్డి మాటలను, ఆరోపణలను నమ్మవద్దని భక్తులను కోరారు. రాజకీయ ఉనికి కోసం, మీడియాలో కనిపించాలనే ఉద్దేశంతో.. భూమన కరుణాకర్ రెడ్డి దిగజారిపోయారని మరో బోర్డు సభ్యుడు దివాకర్ రెడ్డి మండిపడ్డారు. మహావిష్ణువు విగ్రహానికి.. అసంపూర్ణమైన శని భగవానుడి విగ్రహానికి తేడా తెలియదా..అని టీడీడీ సభ్యురాలు పనబాక లక్ష్మి విమర్శించారు. ఇలాగే ఉంటే.. కరుణాకర్ రెడ్డిని ప్రజలు తరమికొట్టడం ఖాయమన్నారు.



## భూమనపై కేసు నమోదు

అలిపిరి (చైతన్యరథం): టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిపై అలిపిరి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదయింది. అసత్యాలు ప్రచారం చేశారనే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అలిపిరి సమీపంలో పదేళ్లుగా పడిఉన్న అసంపూర్తి శనీశ్వరుడి విగ్రహాన్ని విష్ణుమూర్తి విగ్రహంగా పేర్కొంటూ భూమన అసత్య ప్రచారం చేశారు. విష్ణుమూర్తి విగ్రహానికి అపచారం జరిగిందంటూ వీడియోలు ప్రచారం చేశారు. శ్రీవారి భక్తుల మనో భావాలు దెబ్బతీశారని డిప్యూటీ ఈవో గోవింద రాజు ఫిర్యాదుతో భూమనపై అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

# నేటి నుంచి దేశవ్యాప్తంగా మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాలు

- రాష్ట్రంలో కోటి మందికి పైగా ఆరోగ్య పరీక్షలు లక్ష్యం
- అన్ని స్థాయిల్లోని ప్రభుత్వాసుపత్రుల్లో భారీగా ఏర్పాట్లు

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ సహా దేశ వ్యాప్తంగా బుధవారం నుంచి వచ్చే నెల 2వరకు "స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్" కార్యక్రమం కింద మహిళల ఆరోగ్య పరీక్షల నిమిత్తం ప్రత్యేక వైద్య శిబిరాలు జరుగనున్నాయి. ఇండోర్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభిస్తారు. విశాఖపట్నంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తో కలిసి ప్రారంభిస్తారు. ఇదే సమయంలో విజయవాడలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొంటారు. మొత్తమ్మీద రాష్ట్రవ్యాప్తంగా 14,500 వైద్య శిబిరాలు జరుగుతాయి. ఉప ఆరోగ్య కేంద్రాలు మొదలుకొని బోధనాసుపత్రుల ప్రాంగణాల్లో ఈ వైద్య శిబిరాలు జరుగుతాయి. 8,181 స్పెషలిస్టు వైద్యులు పాల్గొని మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేయనున్నారు. ఈ శిబిరాల ద్వారా చిన్నారులు, బాలబాలికలకు కలిపి కోటి మందికి పైగా ఆరోగ్య పరీక్షలు చేయాలని వైద్యఆరోగ్య శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. మెప్మా, గ్రామ వార్డు సచివాలయాలు, అంగన్వాడీలు , వైద్య ఆరోగ్య శాఖకు చెందిన వారితో కలిపి 4,000 సిబ్బంది వైద్య శిబిరాల నిర్వహణ విధుల్లో పాల్గొనన్నారు. మహిళా శిశు సంక్షేమశాఖ, పంచాయతీరాజ్, మునిసిపల్, విద్యాశాఖాధికారులతో పాటు ఐఎంఎ, రెడ్ క్రాస్ సొసైటీలు కూడా ఈ శిబిరాల నిర్వహణలో భాగస్వామ్యం కానున్నాయి. అలాగే అన్ని స్థాయిల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర స్థాయిలలో ఉన్న ప్రజాప్రతి నిధులు కలిపి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15,524 మంది పాల్గొంటారు.

మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, ఇతర పరీక్షలు చేస్తారు శిశువులు, చిన్నారులకు టీకాలు వేస్తారని వైద్యారోగ్య శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

# ఇల్లు, స్థలం ఆక్రమించిన అక్రమ రిజిస్ట్రేషన్

- కాకినాడలో వైసీపీ కార్పొరేటర్, మరో నేత దందా
- జార్జియా వీసా పేరుతో రూ.60 లక్షలకు టోకరా
- ప్రజావినతుల కార్యక్రమంలో బాధితుల ఫిర్యాదు





మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ప్రజావినతుల కార్యక్రమంలో ఏపీ మైనార్టీ వ్యవ హారాల సలహాదారు ఎం.ఏ షరీఫ్, ఏపీ అగ్రికల్చరల్ మిషన్ వైస్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాసరెడ్డి అర్జీలు స్వీకరించారు. వైసీపీ కార్పొరేటర్ విజయలక్ష్మి, ఎన్.ఎన్.కె.రెడ్డి తమ కుటుంబాన్ని నాశనం చేసేందుకు కుట్ర పన్నారని కాకినాడకు చెందిన ఎం.దు ర్గాదేవి ఫిర్యాదు చేశారు. సుపారీ ఇచ్చి ఇంటి వద్ద హింసకు పాల్పడటమే కాకుండా బీరువా లాకర్‌లో ఉన్న ఆస్తి పత్రాలను అక్రమంగా తీసుకుని సుమారు 1200 గజాల స్థలాలు, 60 గజాల ఇల్లు ఆక్రమించుకుని వాటికి సంబం ధించిన పత్రాలను దొంగిలించి తమ పేర్లపై తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని వివరించింది. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.

### వీసాలు ఇప్పిస్తామని మోసగించారు

వర్క్ వీసాలు ఇప్పిస్తామని మోసగించారని ప్రకాశం జిల్లా దొనకొండ మండలం పడమటి వెంకటాపురం గ్రామానికి చెందిన పెమ్మసాని చంద్రశేఖర్ ఫిర్యాదు చేశారు. ఎం.ఎస్.అభినయ్ నాయక్, డోర్ నెంబర్ 27066, వట్టి రాజశేఖర్ హౌస్, కొత్తపేట, ధర్మవరం చెందిన వ్యక్తికి సంబంధించిన అభి ఫ్యూచర్ ఓపీసీ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ద్వారా జార్జియాలో వర్క్ వీసాలు ఇప్పిస్తామని చెప్పారని వివరించారు. తన దగ్గరే కాకుండా తమ స్నేహితులు వేముల సురేష్, షేక్ మస్తాన్ ద్వారా సుమారు 20 మంది దగ్గర రూ.60 లక్షల వరకు 2025 జనవరి నుంచి 2025 జూన్ వరకు చెల్లించినట్లు తెలిపారు. అందులో రూ.28 లక్షలు అభినయ్ నాయక్‌కి, రూ.32 లక్షలు అతని తల్లికి వివిధ లావాదేవీ ల ద్వారా ఇచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతం సుమారు 20 మంది విద్యార్థుల పాస్‌పోర్టులు కూడా వారి వద్దే ఉన్నాయని, డబ్బులు.. పాస్‌పోర్టులు ఇవ్వాలని అడుగుతుంటే వారి కుటుంబసభ్యుల నుంచి బెదిరింపులు వస్తున్నాయని తెలిపారు. దీనిపై దొనకొండ పోలీసుస్టేషన్‌తో పాటు పలు చోట్ల ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

### ఇంటిని ఆక్రమించుకున్నారు

25 ఏళ్లుగా కువైట్‌లో కష్టపడి సంపాదించిన డబ్బుతో తన భార్య పగడాల శ్రీదేవి పేరుతో తిరుపతిలో ఇల్లు కొనుగోలు చేసినట్లు అన్నమయ్య జిల్లా టి.సుండుపల్లి మండలం జీరెడ్డివా రిపల్లి గ్రామానికి చెందిన కందుల ఆంజనేయులు వివరించారు. అయితే తన కేవీపల్లి పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న సుభాష్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుని ఆ ఇంటిని తమ ఆధీనంలోకి తీసుకోవడానికి కుట్ర చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. తనను తన కుమారుడు సంతోష్‌ను చంపుతామని బెదిరించారని, రాత్రిపూట కడపలో తలదాచుకున్న సమయంలో రౌడీ మూకలతో దాడి చేయించారని తెలిపారు. తిరుపతిలోని తమ ఇంటికి వెళితే తనను, తన కొడుకును చంపేస్తామని సుభాష్, శ్రీదేవి బహిరంగంగా బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

### గేదెల లోన్ ఇప్పిస్తామని మోసం

మనుకొండ జానిన్ఫిహా అనే వ్యక్తి గేదెల లోన్ రూ.2 కోట్లు ఇప్పిస్తానని చెప్పి ముందుగా రూ.25 లక్షలు ఇవ్వాలని అడిగాడని పల్నాడు జిల్లా మాచర్ల మండలం జమ్మలమడక గ్రామానికి చెందిన గుండెబోయిన రమణ తెలిపారు. ఆమెను నమ్మి అప్పు చేసి డబ్బులు ఇవ్వగా కనిపించకుండా.. ఫోన్ ఎత్తకుండా మోసం చేశారని వివరించారు. ఇందులో దుర్గాప్రసాద్ అనే వ్యక్తి పాత్ర కూడా ఉందని..వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇచ్చారు.

# శృతిమించితే.. మొదటికే మోసం!

మోతాదుకు మించిన ఎరువుల వినియోగం.. భూమికి చేటు.. రైతుకు భారం.. ఆరోగ్యానికి హాని. సేద్యం నిపుణులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు అదేపనిగా చెప్తోన్న జాగ్రత్త ఇది. ప్రభుత్వాలు సైతం పదేపదే ఇదేమాటను చెప్తున్నా.. ఇప్పుడు రైతులను చేయిపట్టి ఆ దిశగా నడిపించాల్సిన తరుణం ఆసన్నమైంది. మోతాదుకుమించి ఎరువులు వినియోగంవల్ల భూసారం తగ్గుతుంది. రైతుపై అదనపు పెట్టుబడి భారం పడుతుంది. పరిమితికి మించి రసాయనిక ఎరువులు తగదంటూ శాస్త్రవేత్తలు, అధికారులు హెచ్చరిస్తున్నా.. రైతులు అధిక దిగుబడులకు ఎడాపెడా రసాయన ఎరువులు వినియోగిస్తున్నారు. సమతుల్యత విస్మరించి.. విచక్షణారహితంగా నత్రజని సంబంధిత యూరియా వాడటంవల్ల పైర్లలో మెత్తదనం, సున్నితత్వం పెరిగి తెగుళ్లు, పురుగులు ఎక్కువగా ఆశించి పంటలను దెబ్బతీస్తున్నాయి. శాస్త్రవేత్తల సూచనల మేరకు హెక్టారుకు 140 కిలోల ఎరువులను వినియోగించాలని చెబుతున్నా, రైతులు మాత్రం 155 కిలోల ఎరువులను వినియోగిస్తున్నట్టు సమాచారం. ఇలా మోతాదుకుమించి ఎరువుల వినియోగం పంటకు, భూమికీ మంచిది కాదంటున్నారు. ఎరువుల వాడకం తగ్గించే దిశగా రైతులలో చైతన్యం తేవాలన్నది కూటమి ప్రభుత్వం ప్రయత్నం. వ్యవసాయ శాఖపై కలెక్టర్లతో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు యూరియా వాడకం తగ్గించడంపై కీలక ప్రకటన చేశారు. యూరియా వాడకం తగ్గిస్తే.. ఆ మేరకు ప్రోత్సాహకంగా బస్తాకు రూ.800 వంతున రైతుకు చెల్లించే యోచన చేస్తోంది. ఎరువుల అధిక వినియోగం కారణంగా మిరపను చైనానుంచి తిప్పిపంపారని, కొన్ని ఐరోపా దేశాలు మన ఉత్పత్తుల ధరలు తగ్గిస్తున్నాయన్న అంశాన్నీ ప్రస్తావించారు. జీవనశైలి మార్పులో భాగంగా ఆహారపు అలవాట్లు మారిపోతున్నాయన్న అంశాన్నీ చర్చించారు. పంటలు త్వరగా ఎదగాలని, దిగుబడులు బాగా రావాలన్న ఆశతో రైతులు యూరియాను విచ్చలవిడిగా వాడే పరిస్థితులు నెలకొన్నాయి. గతంలోకన్నా ప్రస్తుత సాగు విధానంలో రెట్టింపుస్థాయిలో రైతులు యూరియా వినియోగిస్తున్నారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. యూరియా అతి వినియోగంవల్ల అన్నీ అనర్థాలేనని పర్యావరణ శాస్త్రవేతలు హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా భూసారం దెబ్బతిని, నేలలు సహజత్వాన్ని కోల్పోయే ప్రమాదముందని, దీంతోపాటు రైతుకు ఎరువుల భారం పెరిగిపోతోందని, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే, భూమి దెబ్బతినకుండా ఉండటంతోపాటు, రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నది నిపుణుల మాట.

బస్తాలు బస్తాలు యూరియా గుమ్మరించినంత మాత్రాన రెట్టింపు దిగుబడులు రావు. రసాయన ఎరువులను అధిక మోతాదులో వినియోగించడంవల్ల నేలలో పోషకాలు తగ్గి.. పంట భూమి నిస్సారమవుతుంది. వంద కిలోల నత్రజని ఎరువును పొలానికి వేస్తే నలభై కిలోలే పైరుకు అందుతుంది. మిగిలిన 60 కిలోలు వివిధమార్గాల్లో వ్యర్థమవుతోందని నిపుణులు చెబుతున్నారు. రైతులు సాగు వ్యయంలో దాదాపు 25శాతం రసాయన ఎరువుల కోసమే ఖర్చు పెడుతున్నారు. దీనిని సరైన విధానంలో వాడితే రైతులకు ఖర్చు తగ్గనుంది. కేంద్ర ప్రభుత్వంహెక్టారుకు జాతీయ సరాసరి రసాయన ఎరువుల వాడకం 140 కిలోలు కాగా, ఏపీలో అది 278 కిలోలు, తెలంగాణాలో 283, కర్ణాటక 160 కిలోలు, కేరళలో 77.8 కిలోలు, తమిళనాడులో 188 కిలోలు, పంజాబ్‌లో 246, హరియాణాలో 221 కిలోలు, గుజరాత్‌లో 160, మహారాష్ట్ర 178, ఛత్తీస్‌ఘడ్ 152 కిలోలు, ఉత్తరప్రదేశ్ 209 కిలోలు రసాయన ఎరువులు వాడుతున్నట్టు సమాచారం. సమతుల ఎరువుల వినియోగానికి నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను 4.2:1 నిష్పత్తిలో వినియోగించాలన్నది వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన. ఉదాహరణకు ఏపీలోని గుంటూరు జిల్లాలో నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువుల వాడకం 13:7:1గా, తిరుపతి జిల్లాలో 12:6:1, చిత్తూరులో 11:3:1, శ్రీకాకుళంలో 10.3.1గా ఉన్నట్టు సమాచారం. శాస్త్రీయపద్ధతిలో రసాయన ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించలేకపోవడంతో విచ్చల విడితనం పెరిగిపోతుంది. జాతీయ సగటుతో పోలిస్తే ఏపీ, తెలంగాణాలలో రసాయన ఎరువుల వాడకం 82 శాతం అధికంగా ఉన్నట్టు సమాచారం. రాష్ట్రంలో సగటున 36.5 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను వినియోగిస్తున్నారని అంచనా. వాటి వినియోగంలో 4 లక్షల మెట్రిక్ టన్నులు అంటే 11శాతం మేర తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించుకుంది. ఇందుకోసం ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా లక్ష మెట్రిక్ టన్నులు, సేంద్రియ ఎరువులైన వర్మి కంపోస్ట్, పశువుల ఎరువు, పచ్చిరొట్ట ఎరువులు తదితరవాటిని నేలకు అందించడంతో మరొక లక్షన్నర టన్నులు, జీవన ఎరువులైన నైట్రో బాక్టీరియా, ఫాసో బాక్టీరియా, వేపపిండి, నానో యూరియా, నానో డీఏపీ ద్వారా మరో లక్ష టన్నుల వరకు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

ఎరువులు అధికంగా వాడకం రైతులకు, నేలకి, ఆరోగ్యానికి కలిగే అనర్థాలు ఎన్నో. రైతులు పంట దిగుబడి అధికంగా రావాలనే ఆశతో ఎరువులు అధికంగా వాడటం వలన రైతులకు, నేలకి, పర్యావరణానికి.. ప్రజల ఆరోగ్యానికి కలిగే నష్టాలు చాలా ఉన్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో ఆరోగ్యంపై అవగాహన, శ్రద్ధ పెరిగి రసాయనరహిత వ్యవసాయం, పాడి, ఆరోగ్యకరమైన ఆహార పంటల ఉత్పత్తివైపు మొగ్గు చూపుతున్నారు. ఎన్నో దేశాలు పలు రకాల సింథటిక్ పురుగు మందుల్ని నిషేధించినా.. ఇండియాలో యథేచ్ఛగా వినియోగిస్తూనే వున్నారు. ఆహారోత్పత్తుల ద్వారా మానవ శరీరంలోకి ప్రవేశించే పురుగుమందులు నాడీ మండలాన్ని, జీర్ణ వ్యవస్థను దెబ్బ తీస్తున్నాయి. క్యాన్సర్, మూత్రపిండాల వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నట్టు పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. వేలంవెర్రి సాగు విధానాలవల్ల పెట్టుబడుల వ్యయం తడిసి మోపెడు కావడంతోపాటు ప్రజారోగ్యానికి పెనుముప్పుగా పరిణమించింది. అమెరికా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, చైనావంటి దేశాల్లో నేలలో పంట వెయ్యాలంటే ముందు ఆ భూమిని కచ్చితంగా పరీక్షిస్తాయి. భూసార ఫలితాలనుబట్టే ఎరువులు, నీటిని అందిస్తాయి. వేయనున్న పంటలను నిర్ణయిస్తారు. అందుకే ఆ దేశాల్లో అతి తక్కువ ఖర్చులతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించగలుగుతున్నారు. అట్లాగే చైనా 5నుంచి 30శాతం నత్రజని వాడకాన్ని తగ్గించి 15శాతం అధిక దిగుబడులు సాధిస్తోంది. సేంద్రియ సేద్యంలో సిక్కిం ఆదర్శంగా నిలుస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో రైతులు పోటీపడి ఎక్కువ దిగుబడులు సాధించేందుకు రసాయన ఎరువులను విచక్షణారహితంగా వాడుతున్నారు. మితిమీరిన ఎరువుల వాడకం ఎన్నో అనర్థాలకు హేతువు. సాగుభూములు కాపాడుకోవాలంటే అవసరానికి తగిన పరిమాణంలోనే ఎరువులు వేసేలా రైతులకు అవగాహన కల్పించాలి. మన నేలకీ, ఆరోగ్యానికీ, భవిష్యత్తుకీ నష్టం వాటిల్లకుండా.. రసాయన ఎరువులను అవసరమైనంత మాత్రమే వాడుతూ సేంద్రియ ఎరువులు, పచ్చి ఎరువులు, జీవామృతంవంటి సహజ పద్ధతులను రైతులు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- నీరుకొండ ప్రసాద్

## మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది

- మహిళల పక్షపాతి మన తెలుగుదేశం ప్రభుత్వం
- స్త్రీ శక్తి పథకం విజయవంతమైంది
- బహిరంగ సభలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర



పార్వతీపురం (చైతన్యరథం): ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, మహిళల పక్షపాతి మన తెలుగుదేశం ప్రభుత్వమని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు సర్వీసు స్త్రీ శక్తి పథకం విజయవంతమైన సందర్భంగా విజయోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా పాత బస్టాండ్‌లో గల ఎన్టీఆర్ విగ్రహం నుంచి వేలాదిమంది మహిళలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బంధంవారివీధిలో నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ పూర్తిస్థాయిలో అమలు చేయడం జరుగుతుందన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన ప్రభుత్వం ఏదైనైతే ఉందో అదే మన కూటమి ప్రభుత్వం అని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేస్తున్నారని అన్నారు. మహిళా పక్షపాతి ప్రభుత్వం అనడానికి నిదర్శనం ఈ ఉచిత బస్సు పథకమే అన్నారు. నెలరోజుల వ్యవధిలో ఆరు కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు సదుపాయాన్ని వినియోగించుకున్నారని అన్నారు. పథకాలు అమలులో పక్క రాష్ట్రాలకు ఆదర్శంగా మన రాష్ట్ర ప్రభుత్వం నిలిచిందని అన్నారు. మీ పిల్లలకు మేము అండగా ఉంటాం అనే నినాదంతో తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడం జరిగిందన్నారు. ప్రతి బిడ్డకు ఈ పథకం వర్తించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యుగపురుషుడని, ఆయన ప్రపంచానికే మన రాష్ట్రాన్ని పరిచయం చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేమని వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేశారని, ఇప్పుడు ఈ పథకాలు అమలు చేయడాన్ని చూసి ఓర్వలేకపోతున్నారని అన్నారు. గత వైసిపి పాలనలో అప్పటి ముఖ్యమంత్రి రాష్ట్ర దోచుకుని దాచుకున్నాడని ఆరోపించారు. మహిళా సంక్షేమాన్ని పక్కన పెట్టారన్నారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు కూడా నెరవేర్చిన ప్రభుత్వం మన కూటమి పర్వతం అని అన్నారు. ఇందులో భాగంగానే ఆటో డ్రైవర్లకి ప్రతి ఒక్కరికి 15000 రూపాయలు అందించడం జరుగుతుందని అన్నారు. గత ప్రభుత్వం ప్రజా సమస్యలను, వారి అవసరాలను గాలికి వదిలేసిందని, అవన్నీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం తీరుస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఒక మంచి ప్రభుత్వమని, మహిళా ప్రభుత్వమని, పేదల ప్రభుత్వమని, ఇటువంటి మంచి ప్రభుత్వాన్ని మీరంతా ఎన్నుకోవడం ఆనందంగా ఉందన్నారు. పేటీఎం గాళ్ళ, వైసిపి మూకల ఫేక్ ప్రచారాలను మీరంతా నమ్మొద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళలు,కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నర్సీపట్నం అభివృద్ధి అయ్యన్నతోనే సాధ్యం

- మెడికల్ కాలేజీలపై జగన్ ఫేక్ ప్రచారం... అనకాపల్లిలో ఉత్తిత్తి శంకుస్థాపనలు చేసిన వైసీపీ ప్రభుత్వం
- మండిపడ్డ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్



నర్సీపట్నం (చైతన్యరథం): నర్సీపట్నంకు వైసీపీ హయాంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఉత్తిత్తి మెడికల్ కాలేజీలు తీసుకొచ్చారని, మెడికల్ కాలేజీల ఏర్పాటుపై వైసీపీ నాయకుడు జగన్ ఫేక్ ప్రచారాన్ని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఎండగట్టారు. నర్సీపట్నం అభివృద్ధి స్పీకర్ అయ్యన్నపాత్రుడుతోనే సాధ్యమన్నారు. మంగళవారం నర్సీపట్నంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విజయ్ మాట్లాడుతూ... "అయ్యన్న అంటే అభివృద్ధి - అభివృద్ధి అంటే అయ్యన్న" అని వ్యాఖ్యానించారు. వైసీపీ నాయకులు మెడికల్ కళాశాలను నర్సీపట్నంకు తీసుకొచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటున్నారు. అనకాపల్లిలో మెడికల్ కాలేజ్ శంకుస్థాపన 2021 మే 31న అవంతి శ్రీనివాసరావు, అమర్నాథ్, అనకాపల్లి ఎంపీ సమక్షంలో జరిగిందని, అప్పటి ఎమ్మెల్యే గణేష్ కూడా అక్కడే ఉన్నారని గుర్తు చేశారు. దీనికి సంబంధించిన వీడియోను కూడా సమావేశంలో చూపించారు. అయినా కూడా నర్సీపట్నంలో సుమారు 20 లక్షల రూపాయలు మున్సిపాలిటీ నిధులు ఖర్చు చేసి మరోసారి ఉత్తిత్తి మెడికల్ కాలేజ్ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారని తెలిపారు. "ఉత్తిత్తి మెడికల్ కాలేజ్" అని పిలవడానికి కారణం వివరించారు. నర్సీపట్నం జిల్లా అవుతుందన్న సమయంలో చేతకాని ఎమ్మెల్యే కారణంగా అనకాపల్లి జిల్లాగా ప్రకటించడంతో ప్రజలను మభ్యపెట్టడం కోసం నర్సీపట్నంలో శంకుస్థాపన చేసి, మాకవరపాలెంలో పనులు ప్రారంభించారని అన్నారు. ఆ పనులకు కాంట్రాక్టర్ 28 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే, అప్పటి ప్రభుత్వం 11 కోట్లు 30 లక్షల రూపాయలు చెల్లించిందని, కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక 2025 మార్చిలో 14 కోట్ల రూపాయలు బిల్లులు విడుదల చేయడం జరిగిందన్నారు. సెంట్రల్ గవర్నమెంట్ జీవో లేకుండా స్టేట్ గవర్నమెంట్ అబద్ధపు జీవో చూపిస్తోందని, మెడికల్ కాలేజీపై ఆర్‌టీఐలో వచ్చిన సమాధానంలో నర్సీపట్నం మెడికల్ కాలేజ్ అన్న ప్రస్తావనే లేదన్నారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కూడా "అనకాపల్లి మెడికల్ కాలేజ్" అని మాత్రమే చెప్పారని గుర్తు చేశారు. ఐదు సంవత్సరాలుగా నేషనల్ మెడికల్ కౌన్సిల్ వారు ఈ కాలేజీపై ఎప్పుడైనా రికార్డులు చూసారా అని ప్రశ్నించారు. పీ.పీ.పీ విధానంలో మెడికల్ కాలేజీలను పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం చూస్తుంటే అడ్డుపడతారా అని ప్రశ్నించారు. మెడికల్ కాలేజీ నిర్మాణంలో అవినీతి జరిగి ఉంటుందని, దీనిపై సీఐడీ విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

**మెడికల్ కళాశాల ఏర్పాటుపై వైసీపీ బహిరంగ చర్చకు రావాలి**

తాండవ గేట్లకు 7 లక్షల రూపాయలు ఖర్చు చేయలేని వైసీపీ ప్రభుత్వం, మెడికల్ కాలేజీ ఎలా కడతారని ప్రశ్నించారు. అయితే, తాండవ అభివృద్ధికి ఒక్క సంవత్సరంలోనే 8 కోట్లు 9 లక్షల రూపాయలు తీసుకువచ్చి, చివరి పంట పొలం వరకు నీరు అందేలా అయ్యన్న చర్యలు తీసుకున్నారని వివరించారు. నర్సీపట్నం రోడ్డు వెడల్పుకు ఆర్ అండ్ బీ నుంచి నిధులు తీసుకురాలేక మున్సిపాలిటీ నిధులు ఖర్చు చేశారని, ప్రభుత్వ ఆసుపత్రిలో లిఫ్ట్ పాడయినా బాగు చేయించలేకపోయారని, డీజిల్ లేక జనరేటర్ ఆగిపోవడంతో చీకటిలో డెలివరీలు జరిగిన సందర్భాలను గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెలలోనే పింఛనుదారులకు పెంచిన పింఛన్ 4,000 రూపాయలతో పాటు అదనంగా 3,000 రూపాయలు కలిపి 7000 రూపాయలు అందజేసిందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు, తల్లికి వందనం వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. వైసిపి ప్రభుత్వం సమయంలో స్పీకర్ అయ్యన్న గొంతు నొక్కడం కోసం అధికారులు ఇంటిని కూల్చడానికి ప్రయత్నించారని, హైదరాబాదులో ఉన్న తన ఇంటికి వెళ్లి కూతురిని కూడా ఇబ్బంది పెట్టారని అన్నారు. కేవలం 18 నెలల్లోనే నర్సీపట్నం నియోజకవర్గానికి సుమారు 311 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన ఘనత అయ్యన్న గారికే దక్కుతుందని, ఆ వివరాలన్నిటినీ ఒక వెబ్‌సైట్‌లో పెట్టామని చెప్పారు. వైసిపి ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో ఏమి సాధించిందని ప్రశ్నించారు. నర్సీపట్నం మున్సిపాలిటీకి అయ్యన్న గారు 22 కోట్లు తీసుకువచ్చారని, కానీ గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల్లో కేవలం 5 లక్షల 20 వేల రూపాయలే తీసుకువచ్చిందని అన్నారు. 311 కోట్ల రూపాయల అభివృద్ధి పనులన్నీ డాక్యుమెంట్లతో సహా వెబ్‌సైట్‌లో ఉంచామని, దానిపై చర్చించగలరా అని సవాలు విసిరారు. నర్సీపట్నం అభివృద్ధి అయ్యన్నతోనే సాధ్యమని విజయ్ స్పష్టం చేశారు. అబద్ధపు మెడికల్ కాలేజీని నిజమైన మెడికల్ కాలేజ్‌గా చేసే సత్తా అయ్యన్నకే ఉందని పేర్కొన్నారు.

# ఉల్లి బస్తాలను ఎత్తుకెళ్లిన ప్రజలు... ఆలస్యంగా స్పందించిన అధికారులు

- కర్నూలు ఉల్లి మార్కెట్‌లో అరుదైన ఘటన... పట్టపగలే మార్కెట్‌పై పడి దోచుకోవడంపై విస్మయం వ్యక్తం చేస్తున్న రైతులు



కర్నూలు ఉల్లిమార్కెట్‌లో అరుదైన ఘటన చోటు చేసుకుంది. పట్టపగలే ప్రజలు మార్కెట్‌పై పడి బస్తాలను ఎవరికి తోచినంతగా వారు ఎత్తుకెళ్లిపోయారు. ఎవరో ఒకరు ముందుగా ఉల్లి బస్తాలను తీసుకెళ్తుండటాన్ని చూసి, మరికొందరు అదే దారిని అనుసరించారు. కొందరు బస్తాలను భుజాలపై మోసుకుని ఇంటికి తరలించగా, మరికొందరు ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో వేసుకుని వెళ్లిపోయారు. ఈ ఘటనలో అధికారులు, పోలీసులు మేల్కొనేలోగా ఎక్కువ శాతం ఉల్లి బస్తాలు కనుమరుగయ్యాయి.

**తక్కువ ధరలతో రైతుల నిరాశ:** ఇటీవల కర్నూలు మార్కెట్‌కు పెద్ద ఎత్తున ఉల్లి దిగుబడులు చేరుతున్నాయి. కానీ ధరలు గణనీయంగా పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌లో వ్యాపారులు తక్కువ ధరకు మాత్రమే కొనుగోలు చేయటంతో, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుల ఆందోళనను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం క్వింటా ఉల్లికి రూ.1,200 మద్దతు ధరను ప్రకటించింది. వ్యాపారులు కొనుగోలు చేయని ఉల్లిని నేరుగా ప్రభుత్వం కొనుగోలు చేస్తూ రైతులను ఆదుకుంటోంది.

**ఉల్లి బస్తాలను ఎత్తుకెళ్లిన ప్రజలు - ఆలస్యంగా మేల్కొన్న అధికారులు**



రైతు బజార్లకు సరఫరా – మిగిలిన ఉల్లి వేలం: ప్రభుత్వం కొనుగోలు చేసిన ఉల్లిని రైతు బజార్లకు తరలిస్తుండగా, మిగిలిన సరకును బహిరంగ వేలంలో విక్రయిస్తున్నారు. అయితే రెండ్రోజుల క్రితం జరిగిన వేలంలో క్వింటా ఉల్లిని వ్యాపారులు కేవలం రూ.50కే కొనుగోలు చేశారు. అంత తక్కువ ధర వచ్చినా కూడా కొంత ఉల్లి మార్కెట్‌లో మిగిలిపోయింది. అధికారులు దానిని డంపింగ్ యార్డుకు తరలించి పారబోసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**రోజువారీగా వెయ్యి టన్నుల ఉల్లి:** ప్రతిరోజూ సగటున వెయ్యి టన్నుల ఉల్లి కర్నూలు మార్కెట్‌కు వస్తోంది. మార్కెట్‌లో మిగిలిపోయిన ఉల్లిని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారని తెలిసిన స్థానికులు ఉల్లి మార్కెట్‌కు చేరుకున్నారు. అక్కడ ఉన్న బస్తాలను చూసి ఎవరి చేతికి దొరికితే వారు తీసుకెళ్లారు. మొదట కొందరే తీసుకెళ్లినా, విషయం వ్యాప్తి చెందటంతో ఆటోలు, బైకులు మీద మరికొందరు వచ్చి పెద్ద ఎత్తున ఉల్లిని తరలించారు.

**అధికారులు ఆలస్యంగా స్పందన:** ఇంత జరుగుతున్నా అధికారులు తక్షణ చర్యలు తీసుకోలేకపోయారు. పోలీసులు వచ్చేసరికి ఎక్కువ శాతం ఉల్లి బస్తాలు అప్పటికే తీసుకునిపోయారు. ఇదే సమయంలో రైతులు మరో సమస్యను తెరపైకి తెచ్చారు. రాత్రిపూట కూడా మార్కెట్‌లో దొంగలు ఉల్లిగడ్డలు దొంగలిస్తున్నారని వారు చెబుతున్నారు. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ మార్కెట్‌లో పోలీసులతో భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

**రైతుల ఆవేదన:** తక్కువ ధరలతో ఇప్పటికే నష్టపోతున్న రైతులకు, ఇప్పుడు దొంగతనాలు, లూటీలు కొత్త ఇబ్బందిగా మారాయి. పంట పండించి మార్కెట్‌కు తెచ్చిన తర్వాత కూడా రక్షణ లేకపోవడం రైతులలో తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. ఒకవైపు మద్దతు ధర సరిగా అమలు కావడం లేదని, మరోవైపు తమ ఉత్పత్తిని రక్షించుకునే గ్యారంటీ లేదని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌లో నిరంతర భద్రతా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

# వైసీపీ నాయకులు పచ్చి మోసగాళ్లు : బుద్దా వెంకన్న


**●అమరావతిపై ప్రేలాపనలు ఆపాలి : టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న హెచ్చరిక**



విజయవాడ (చైతన్యరథం): వైసీపీ నేతలు పచ్చి మోసగాళ్ళు కాబట్టే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. దసరా ఉత్సవాలపై వైసీపీ నాయకులు చేస్తున్న కుట్రలను ఆయన బహిర్గతం చేశారు. అలాగే రాజధాని అమరావతి విషయంలో ప్రేలాపనలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వర్యంలో నగరంలోని ఫార్చ్యూన్ మురళి హోటల్‌లో విజయవాడ ఉత్సవ్ సన్నాహక సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న వైసీపీ నాయకులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మీడియాతో మాట్లాడుతూ ఆయన, “పేర్ని నాని తన భార్య పేరు మీద బియ్యం నొక్కేసుకున్నారు. సీఎంగా రాజశేఖర్ రెడ్డి ఉన్నప్పుడు దేవాలయాల భూములను ఆక్రమించుకుని దోపిడీ చేశారు. ఆ విషయాలపై పేర్ని నాని ఒక్కమాట కూడా మాట్లాడటం లేదు” అని ఆరోపించారు. విజయవాడ ఉత్సవాలను అడ్డుకోవడానికే వైసీపీ నేతలు కుట్రలు పన్నుతున్నారని బుద్దా వెంకన్న మండిపడ్డారు. “ఉత్సవాల కోసం గొల్లపూడిలో లీజుకు స్థలాన్ని తీసుకున్నాం. కానీ ఈ విషయాన్ని కూడా వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. వెల్లంపల్లి శీను మూడు సింహాలు ఎక్కడున్నాయో చెప్పాలి. నీ జాతకం రెడ్‌బుక్‌లో ఉంది. అవినాష్ నీ కబ్జాల జాతకం అంతా ప్రజలకు బహిర్గతం అయింది” అని దుయ్యబట్టారు. రాజధాని అంశంపై వైసిపి నాయకులు రోజుకో మాట మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. “ప్రజలు మోసగాళ్లని గుర్తించి వైసిపికి కేవలం 11 సీట్లు మాత్రమే ఇచ్చారు. ఇకపై 30 ఏళ్లపాటు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంటుంది. అమరావతి, గుంటూరు, విజయవాడ కలిపే రాజధానిగా వుంటుంది. ఈ అంశంపై పిచ్చి ప్రేలాపనలు చేస్తే ప్రజలు ఊరుకోరు” అని హెచ్చరించారు. వైసిపి నాయకులు రాజకీయాలను అడ్డంపెట్టుకుని ప్రజా ఆస్తులను దోచుకున్నారని బుద్దా వెంకన్న ధ్వజమెత్తారు. “పేర్ని నాని సహా ఆ పార్టీ నాయకులు ఒక పథకం ప్రకారం ఉత్సవాలను అడ్డుకోవాలని కుట్ర చేస్తున్నారు. కానీ ప్రజల ఆశీర్వాదం, కనకదుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులతో విజయవాడ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయని బుద్దా వెంకన్న స్పష్టం చేశారు.

## 17న స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్‌ను ప్రారంభించనున్న మంత్రి పెమ్మసాని

గుంటూరు (చైతన్యరథం): జిల్లాలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని 17వ తేదీన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. 17వ తేదీ ఉదయం 11 గంటలకు గుంటూరు సర్వజన ఆసుపత్రిలో ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 2వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగానే జిల్లాలో 301 వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైద్య. అవగాహన శిబిరాలలో రక్త హీనత, క్షయ గుర్తింపు పరీక్షలు, బీపీ, మధుమేహం, క్యాన్సర్ వంటి పరీక్షలు కూడా నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. గర్భిణీలకు వైద్య పరీక్షలు






నిర్వహిస్తారని తెలిపారు. అక్టోబర్ 1వ తేదీన రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# పల్నాడు ప్రాంతంపై చెరగని సంతకం కోడెల ప్రస్థానం

**●కోడెల కాంస్య విగ్రహావిష్కరణలో ఎంపీ లావు, చీఫ్ విప్ జీవీ**

**●వినుకొండలో ఘనంగా డాక్టర్ కోడెల శివప్రసాదరావు కాంస్య విగ్రహావిష్కరణ**



వినుకొండ (చైతన్యరథం): పల్నాడు ప్రాంతంపై చెరగని సంతకంగా కోడెలం ప్రస్థానమని కొనియాడారు ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు, వినుకొండ ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు. రూపాయికే వైద్యం చేసిన పేదల డాక్టర్‌గా, రాజకీయాల్లో తిరుగులేని పల్నాటి పులిగా ఆయన ప్రయాణం అనితర సాధ్యమంటూ ఘన నివాళులు అర్పించారు. వినుకొండ నరసరావుపేట రోడ్డులోని ఎన్నెస్పీ మైదానం వద్ద ఏర్పాటు చేసిన మాజీ సభాపతి కోడెల శివప్రసాదరావు వర్ధంతి సందర్భంగా ఆయన కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారు మహమ్మద్ షరీఫ్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోడెల శివరామ్‌తో కలిసి ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఎన్టీఆర్, చంద్రబాబు మంత్రివర్గాల్లో వివిధ శాఖల బాధ్యతలు, స్పీకర్‌గా కూడా పనిచేసిన కోడెల ఏ పదవి ఇచ్చినా ఆ పదవికే వన్నె తెచ్చారన్నారు. రాజకీయాల్లో విలువలకు ప్రాధాన్యం ఇచ్చారని, అను నిత్యం అభివృద్ధి కోసం ఆలోచించేవారని అన్నారు. చంద్రబాబు యువపారిశ్రామిక వేత్తలు రాజకీయాల్లోకి రావాలన్న ఆ పిలుపు మేరకు తెలుగుదేశంలో అడుగు పెట్టిన తనకు తొలినాళ్లలో గురువుగా అనేక సలహాలు ఇచ్చారని తెలిపారు. అలానే పల్నాడు, ఉమ్మడి గుంటూరు జిల్లాను అభివృద్ధిలో ముందు నిలిపారని, తాగునీటి పథకం, కోటప్పకొండ త్రికూటేశ్వర దేవాలయం, కోడెల స్టేడియం సహా చరిత్రలో నిలిచిపోయే ఎన్నో పనులు చేశారన్నారు. పల్నాడు పులిగా ఏదైనా ధైర్యంగా ముక్కుసూటిగామాట్లాడే వారన్నారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు చేట్టిన స్వచ్ఛంధ్రప్రదేశ్‌లో సత్తెనపల్లిని అగ్రస్థానంలో నిలిపారని, మరుగుదొడ్ల నిర్మాణంలో నియోజక వర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. అలానే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోరాట సింహంగా నిలిచారని, వైకాపా వేధింపులకు ఎదురొడ్డి పోరాడారన్నారు. ఆ క్రమంలోనే వైకాపా దుర్మార్గపు పాలనలో తప్పుడు కేసులు పెట్టి బలవన్మరణానికి కారణమయ్యారని, ప్రతిగా ప్రజలు వైకాపాను చిత్తుగా ఓడించి కోడెల ఆత్మకు శాంతి కలిగేలా చేశారన్నారు. అనంతరం నరసరావు పేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ... కోడెల పేద ప్రజల పెన్నిధిగా, అభివృద్ధికి చిరునామాగా నిలిచారన్నారు. అత్యంత క్లిష్టమైన నరసరావుపేటను ఎంచుకొని ఆ గడ్డమీద గెలిచి తన పోరాటం పటిమని నిరూపించారని, ప్రజా పోరాటాలు, కోడెల కవలల్లా అనిపించే వారని కొనియాడారు. వారి స్ఫూర్తితోనే నడుచుకుంటూ అభివృద్ధికి పెద్ద పేట వేస్తున్నామని తెలిపారు. వరికెపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల కేంద్రమంత్రి ఆమోదం తెలిపిన వినుకొండ నుంచి గుంటూరు వరకు జాతీయ రహదారి పూర్తి, ప్రతి ఇంటికి నీటిని అందించే విధంగా కృషి చేస్తున్నామని ప్రకటించారు.

# భూ కబ్జా దారులు, భూ బకాసురులను బాయ్ కాట్ చేయాలి : ఎంపీ కేశినేని శివనాథ్

**●విజయవాడ ఉత్సవ్‌పై ఆరోపణలు చేసే వైసీపీ నేతలపై ఆగ్రహం**




విజయవాడ (చైతన్యరథం): విజయవాడ ఉత్సవ్‌పై అవాస్తవ ఆరోపణలు చేస్తూ.. అడ్డుకోవాలని చూస్తున్న ఉమ్మడి కృష్ణ జిల్లాలో వైసిపికి చెందిన ఆ ముగ్గురు నేతలు చరిత్ర హీనులుగా మిగిలిపోతారు. కబ్జా కోరులను బాయ్ కాట్ చేయాలి... దేవాలయ ఆస్తులు ధ్వంసం చేసినోళ్లని బాయ్ కాట్ చేయాలి. వీది రౌడీలు, గూండాయిజం చేసిన వాళ్లందర్నీ బాయ్ చేయాలని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ప్రజలు స్వాగతిస్తున్న విజయవాడ ఉత్సవ్‌ను బాయ్ కాట్ చేయాలంటున్న ఆ భూ కబ్జా దారులు, భూ బకాసురులకు ప్రజలే బుద్ది చెబుతారన్నారు. సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని ఫార్చ్యూన్ మురళి హోటల్లో మంగళవారం విజయవాడ ఉత్సవ్ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్ మీడియాతో మాట్లాడారు. ఆధ్యాత్మికంగా చేయాలని తలపెట్టిన విజయవాడ ఉత్సవ్‌పై, తనపై వైసిపికి చెందిన ముగ్గురు వ్యక్తులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఓ ప్రశ్నకు సమాధానం తెలిపారు. ఆ ముగ్గురిలో ఒక వ్యక్తి వల్ల 130 దేవాలయాలు ధ్వంసం జరిగటంతోపాటు, అమ్మవారి విగ్రహాలు చోరీ గురి కావటం జరిగిందని గుర్తు చేశారు. దేవాలయాల ఆస్తులు కబ్జా అయ్యాయని, అలాంటి చరిత్ర హీనుడికి విజయవాడ ఉత్సవ్‌పై మాట్లాడే అర్హత లేదన్నారు. ఇక రెండో వ్యక్తి వాళ్ల కుటుంబం విజయవాడలో కబ్జా చేయని వీధి లేదన్నారు. వుంటున్న ఇంటితో పాటు పక్కన వున్న స్కూల్‌ను ఆక్రమించుకున్నాడన్నారు. కబ్జాలు, రౌడీయిజం చేసే ఆ రెండో వ్యక్తి అవాస్తవాలు మాట్లాడటం తప్ప రాజకీయ పరిజ్ఞానం ఏ మాత్రం లేదన్నారు. అలాగే మూడో వ్యక్తి బందర్‌లో వుంటాడు. ఈ వ్యక్తికి 2007లో దేవాలయల భూములు కొట్టేసిన ఘన చరిత్ర వుంది. వీళ్లు మాట్లాడే అవాస్తవ ఆరోపణలకు తాము కాదు, ప్రజలే సమాధానం ఇస్తారన్నారు. తాము విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాన్ని ప్రజా ఆకాంక్షల మేరకు, ప్రజా అవసరాలకోసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దసరా సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం విచ్చేసే భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ ఈ ఉత్సవ్ చేస్తున్నట్లు చెప్పారు. కబ్జాలు, ఖూనీ కోరులు మాట్లాడే మాటలు, అవాస్తవ ఆరోపణలు పట్టించుకోనక్కర్లేదన్నారు. బ్లూ మీడియా పత్రిక తమ పేర్లు ప్రస్తావించకుండా వార్తలు ప్రచురిస్తుంది. గతంలో అవాస్తవాలు రాసినందుకు ఆ పత్రికపై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరువు నష్టం దావా వేయటం జరిగిందని. తన పేరు రాస్తే పరువు నష్టం దావా వేయటానికి సిద్దంగా వున్నట్లు స్పష్టం చేశారు. దసరా సందర్భంగా విజయవాడకి లక్షలాది మంది ప్రజలు, భక్తులు, పర్యాటకులు వస్తారని ఈ సమయంలో నిర్వహించే విజయవాడ ఉత్సవ్ వల్ల వేలాది మంది చిరువ్యాపారులు ఎంతో ఉపయోగం వుంటుందన్నారు. విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాలు తుమ్మలపల్లి కళాక్షేత్రం, పున్నమి ఘాట్, ఘంటసాల సంగీత కాళాశాలలో మాత్రమే జరుగుతాయని, గొల్లపూడిలో విజయవాడ ఎక్స్-పో అది వేరన్నారు. విజయవాడ ఉత్సవ్ సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు జరుగుతాయని, గొల్లపూడిలో ఏర్పాటు చేసే విజయవాడ ఎక్స్-పో తర్వాత కూడా వుంటుందన్నారు.

# సింగపూర్‌లో పర్యటిస్తున్న ఎంపీ శ్రీ భరత్



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ సింగపూర్లో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా సెంటోసా ఐలాండ్ను ఎంపీ సందర్శించారు. అక్కడి బీచ్లు, మౌలిక సదుపాయాలను పరిశీలించి విశాఖలో పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఉన్న అవకాశాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. లక్షలాది మంది పర్యాటకులను ఆకర్షించే సెంటోసా అభివృద్ధి ప్రయాణం, అమలు చేసిన వ్యూహాల గురించి మేనేజ్మెంట్ టీమ్ శ్రీభరత్‌కి వివరంగా అవగాహన కల్పించింది. స్థిరమైన అభివృద్ధి, ప్రపంచస్థాయి ఉత్తమ పద్ధతులు, ఆధునాతన సౌకర్యాలతో పర్యాటకులకు మెరుగైన అనుభవం కల్పించే మార్గాలపై దృష్టిపెడుతున్నట్లు ఎంపీ చెప్పారు. టూరిజం, భద్రత నిర్వహణలో ఏఐ వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా పలు అంశాలపై వారితో ఆయన చర్చించారు. విశాఖకు సముద్ర తీరం, సాంస్కృతిక వారసత్వం, అంతర్జాతీయ స్థాయి ఈవెంట్లకు వేదిక కావడానికి ఉన్న అవకాశాలను శ్రీభరత్ వివరించారు.

## ఫేక్ ప్రచారం... భూమన కరుణాకరరెడ్డిపై కేసు నమోదు

తిరుమల (చైతన్యరథం): తితిదే మాజీ చైర్మన్, వైకాపా మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిపై అలిపిరి పోలీస్టేషన్లో కేసు నమోదైంది. తితిదేపై అసత్యాలు ప్రచారం చేసిన నేపథ్యంలో అతడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలిపిరి సమీపంలోని ఓ విగ్రహంపై భూమన అసత్యాలు చెప్పారు. దేవుడి విగ్రహానికి అపచారం జరిగిందంటూ అసత్య ప్రకటన చేశారు. భూమన తన వ్యాఖ్యలతో శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని డిప్యూటీ ఈవో గోవిందరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు అలిపిరి పోలీసులు తెలిపారు.

# కోడెలకు నివాళులర్పించిన ఎమ్మెల్యే కన్నా

● సత్తెనపల్లిలో 6వ వర్ధంతిని పురస్కరించుకోని పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ



సత్తెనపల్లి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ తొలి శాసనసభాపతి కోడెల శివప్రసాదరావు ఆరవ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని తాలూకా సెంటర్ నందు ఏర్పాటు చేసిన కోడెల శివప్రసాదరావు విగ్రహానికి పూలమాలలు వేసి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. కోడెల లాంటి నాయకుడు స్వార్థ రాజకీయాలకు బలిపోయారని, పల్నాడు ప్రాంతాన్ని ఫ్యాక్షన్ భూతాన్ని తరిమేసేందుకు కోడెల శివప్రసాదరావు ఎనలేని కృషి చేశారని కన్నా లక్ష్మీనారాయణ కొనియాడారు. పల్నాడులో రూపాయి డాక్టర్‌గా కోడెల పేదలకు వైద్యాన్ని అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లోని రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల విక్రయాలను ఉక్కుపాదంతో అణిచివేస్తాం : యార్లగడ్డ



గన్నవరం (చైతన్యరథం): రాష్ట్రంలో గంజాయి, నల్లమందు, కోకైన్ వంటి మత్తు పదార్థాల విక్రయాలను ఉక్కు పాదం అణచి వేసి యువత బంగారు భవిష్యత్తును కాపాడతామని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు భరోసా ఇచ్చారు. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలోని ఇండ్లాస్ శాంతివనం రిహాబిలేషన్ కేంద్రాన్ని మంగళవారం ఉదయం త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డితో కలసి సందర్శించారు. ఈ సందర్బంగా జరిగిన సభలో ఎమ్మెల్యే వెంకట్రావ్ మాట్లాడుతూ... గత ఐదేళ్లు రాష్ట్రంలో మత్తుపదార్థాల వినియోగం విచ్చలవిడిగా పెరగటంతో దానికి బానిసలైన యువత తమ బంగారు భవిష్యత్తు నాశనం చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో మత్తుపదార్థాల విక్రయాలు, రవాణాను సమర్థవంతంగా అడ్డుకున్నామన్నారు. ప్రభుత్వం ఎంత కఠినంగా వ్యవహరించినా దొంగచాటుగా అడపా దడపా విక్రయాలు కొనసాగుతున్నాయని వాటిని పూర్తిగా నిర్మూలించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృతనిశ్చయంతో ఉన్నారని పేర్కొన్నారు. గన్నవరం నియోజకవర్గంలోని నున్న గ్రామంలో డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి 11 సంవత్సరాల క్రితం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఇప్పటివరకు డ్రగ్స్‌కి బానిసలుగా మారిన వాళ్ళు, మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఐదువేల మంది చికిత్స చేసి వారిని సాధారణ మనుషులుగా మార్చి జనజీవనస్రవంతిలోకి తీసుకురావటం అభినందనీయమన్నారు. ఈ శాంతి వనానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరారని ఆర్టీసీ చైర్మన్, అధికారులతో మాట్లాడి సత్వరమే బస్సు ఏర్పాటు చేస్తామని యార్లగడ్డ హామీ ఇచ్చారు. రాజకీయాల్లో చేరిన నాటి నుండి బీజేపీలోనే ఉంటూ 1983లో ఎన్టీఆర్‌కి ద్రోహం జరిగిన సమయంలో ఎన్టీఆర్ అండగా నిలిచిన వ్యక్తి ఇంద్రసేనారెడ్డి అని గుర్తు చేశారు. ఆ సమయంలో ఆయన తన ఎమ్మెల్యే పదవిని త్యజించి రోడ్డెక్కి పోరాడారని, అటువంటి కమిట్మెంట్ ఉన్న నాయకులను నేటితరం యువత స్ఫూర్తిగా తీసుకోవాలని యార్లగడ్డ పిలుపునిచ్చారు. ఆనాడు ధర్మ పరిరక్షణకు కృషి చేసిన ఇంద్రసేనారెడ్డి నేడు గవర్నర్గా త్రిపుర ప్రజలకు అమూల్యమైన సేవలు అందిస్తున్నారని కితాబిచ్చారు.

# పల్నాడు అభివృద్ధి స్ఫూర్తి ప్రదాత కోడెల శివప్రసాదరావు



నరసరావుపేట (చైతన్యరథం): పల్నాడు జిల్లా టీడీపీ కార్యాలయంలో తొలి శాసన సభాపతి కోడెల శివప్రసాదరావు 6వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ఈ సందర్బంగా మాట్లాడుతూ... సామాన్య కుటుంబం నుంచి స్వయంకృషితో శిఖరంలా ఎదిగారని, రూపాయి డాక్టర్‌గా పేరుపొందారని, అరాచకాలు, దౌర్జన్యాలకు అడ్డుగా నిలిచి పోరాడారని కొనియాడారు. అన్న ఎన్టీఆర్ పిలుపుతో రాజకీయాల్లోకి వచ్చి, ఆయన చేసిన పదవులకే వన్నె తెచ్చిన నేత డాక్టర్ కోడెలదేనని గుర్తు చేసుకున్నారు. సత్తెనపల్లి నరసరావుపేటలో కోటప్పకొండ, స్టేడియం, టౌన్ హాల్, పట్టణమంతా రోడ్లు, పచ్చదనం ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి, పల్నాడు జిల్లాలోని ఫ్యాక్షన్‌కి చరమగీతం పాడారన్నారు.

# మంగళగిరి పట్టణంలో పీ-4 పథకం కింద విద్యార్థికి ఆర్థిక సహాయం

●సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థి



మంగళగిరి (చైతన్యరథం): ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న విద్యార్థికి పీ-4 బంగారు కుటుంబంలో భాగంగా టీడీపీ నాయకులు మంగళవారం రూ.20 వేలు ఆర్థిక సహాయం చేశారు. మంగళగిరి 19వ వార్డుకు చెందిన అందే నాగసాయి స్రవంతి ఆర్థిక స్థోమతతో ఇబ్బంది పడుతున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ- 4 పథకం కింద, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ 19వ వార్డు కమిటీ సభ్యుల యొక్క సహకారంతో విద్యార్థికి రూ.20 వేలు ఆర్థిక సహకారం అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ కె. శకుంతల, పట్టణ అధ్యక్షులు పడవల మహేష్ మాట్లాడుతూ పీ-4 పథకం కింద ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ మంచి కార్యక్రమానికి అందరూ ముందుకు రావాలని కోరారు. అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు బంగారు కుటుంబాలకు అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి తిరువీధుల సతీష్, పట్టణ తెలుగుయువత అధ్యక్షులు వంగర హనుమాన్, శివాలయం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు జంజనం వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ ఫేక్ ప్రచారానికి కూటమి ప్రభుత్వం ఫ్యాక్ట్స్‌తో చెక్ పెడుతుంది

●అసెంబ్లీకి వచ్చి తాను పేపర్ పులిని...సోషల్ మీడియాకే పరిమితం కాదని జగన్ నిరూపించుకోవాలి : ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): "ప్రజలచే ఎన్నుకోబడిన వారు, ప్రజాసమస్యలపై చట్టసభల్లో గళం విప్పాలి. అది వారి బాధ్యత. జగన్ సహా ఆయన పార్టీ ఎమ్మెల్యేలు సభలకు రాకుండా బయట ఉపన్యాసాలిస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలకు 11 మంది వైసీపీ సభ్యులు హాజరై, రాష్ట్రంలోని సమస్యలపై తమకున్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. శాసనసభలో జగన్ లేవనెత్తే ఏ అంశంపైన అయినా చర్చించడానికి, వాస్తవాలు తెలియచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. వివేకాహత్య... మద్యం కుంభకోణం.. మెడికల్ కాలేజీలు.. సూపర్-6 సహా అన్ని అంశాలపై స్పష్టతనివ్వడమేగాక, 15 నెలల సుపరిపాలనపై జగన్.. వైసీపీ చేస్తున్న ఫేక్ ప్రచారానికి, కూటమి ప్రభుత్వం ఫ్యాక్ట్స్‌తో చెక్ పెడుతుంది. తనను గెలిపించిన పులివెందుల ప్రజలకు న్యాయం చేయడానికైనా జగన్ సభకు రావాలి. లేదా వారికి బహిరంగ క్షమాపణ చెప్పాలి. తనకు 40 శాతం ఓటర్ల మద్దతు ఉందనే జగన్.. అసెంబ్లీకి దుమ్మా కొడుతూ కావాలనే వారిని అవమానిస్తున్నాడు. సభలో అడుగుపెట్టి తాను పేపర్ పులిని కాదని.. సోషల్ మీడియాకు పరిమితం కాబోనని జగన్ ప్రజలకు తెలియచేయాలి.

**గెలిపించిన వారి తరుపున ప్రశ్నించము అనడం న్యాయమేనా?**

ప్రజలచేత, ప్రజల కొరకు, ప్రజల వలన పటిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టసభల్లో గొంతెత్తకుండా, మీడియా సమావేశాలకు మాత్రమే పరిమితమై, ఉపన్యాసాలివ్వడాన్ని ప్రజలు ఎప్పటికీ హర్షించరనే నిజాన్ని జగన్ ..వైసీపీ ఎమ్మెల్యేలు గ్రహించాలి. ప్రజలపక్షాన అసెంబ్లీలో మాట్లాడని వారు.. ఆ ప్రజల సొమ్మును జీతంగా తీసుకోవడానికి ముమ్మాటికీ అనర్హులే. ప్రజలిచ్చిన గెలుపు కావాలి.. ఆ గెలుపుతో వచ్చే సకల సౌకర్యాలు అనుభవించాలి.. కానీ గెలుపుకు కారకులైన వారికోసం మాత్రం తాము పనిచేయము.. ప్రశ్నించము అనడం ఎంతవరకు న్యాయమో వారే ఆలోచించుకోవాలి. ప్రజలు ఇవ్వని ప్రతిపక్షహోదా ప్రభుత్వం ఎలా ఇస్తుందనే ఆలోచన లేకుండా, దానికోసమే పట్టుబట్టడం జగన్ అజ్ఞానమనుకోవాలి. గతంలో తాను తలుచుకుంటే చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా లేకుండా చేస్తానన్నారు." అని ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో మండిపడ్డారు.

# రోడ్ల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

●నియోజకవర్గంలో బీ.టి రోడ్ల అభివృద్ధిపై... ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్ష



గుడివాడ (చైతన్యరథం): నియోజకవర్గంలో బీటీ రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పది ప్రాంతాల్లో బీ.టీ రోడ్ల అభివృద్ధికి రూ.4.5 కోట్లతో అంచనాలు రూపొందించినట్లు ఆయన తెలిపారు. గుడివాడ నియోజకవర్గంలోని బి.టి రోడ్ల అభివృద్ధిపై రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహంలో ఆర్అండ్‌బీ శాఖ అధికారులతో ఎమ్మెల్యే రాము సమీక్షించారు. గుడివాడ రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో రోడ్ల అభివృద్ధికి రూపొందించిన అంచనాల నివేదికలను అధికారులు ఎమ్మెల్యే రాముకు వివరించారు. పక్కా ప్రణాళికలతో అంచనాల రూపొందించాలని సమావేశంలో అధికారులకు ఎమ్మెల్యే రాము సూచించారు. పలుచోట్ల రహదారుల నిర్మాణ పనులు అలసత్వాన్ని... అర్అండ్‌బీ శాఖ సి.ఈ విజయశ్రీ దృష్టికి ఎమ్మెల్యే రాము తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ.... గుడివాడ నియోజకవర్గంలోని ప్రజల రోడ్ల సమస్యలు పరిష్కరించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా కోట్లాది రూపాయలతో రోడ్ల నిర్మాణ పనులు పూర్తి అయ్యాయన్నారు. బీటి రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టామన్నారు. రోడ్ల సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో మరమ్మత్తులు చేస్తామన్నారు. రానున్న రోజుల్లో రోడ్ల అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు రానున్నట్లు చెప్పారు.

# విజయవాడ ఉత్సవ్ సన్నాహక సమావేశం

విజయవాడ (చైతన్యరథం): : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని ఫార్ట్యూన్ మురళి హోటల్లో మంగళవారం విజయవాడ ఉత్సవ్ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరయ్యారు. సత్యకుమార్ యాదవ్కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో మంత్రులు పార్థసారథి, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, ఉమ్మడి కష్ణాజిల్లా ప్రజా ప్రతినిధులు, టీడీపీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.



# సరస్వతీ నిలయాలకు కేంద్రంగా ఆత్మకూరు నియోజకవర్గం

- పెద్దఎత్తున ప్రభుత్వ విద్యాలయాలను నెలకొల్పాం
- గురుకుల పాఠశాలలో విద్యార్థులందరూ ఆరోగ్యంగా ఉన్నారు
- విద్యార్థుల ఆరోగ్యభద్రతకు మెరుగైన చర్యలు తీసుకున్నాం
- రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



నెల్లూరు (చైతన్యరథం): ఆత్మకూరు నియోజకవర్గంలో పెద్దఎత్తున విద్యాలయాలను నెలకొల్పి సరస్వతీ నిలయాలకు కేంద్రంగా తీర్చిదిద్దామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. మంగళవారం ఉదయం ఆత్మకూరు ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను మంత్రి సందర్శించారు. గురుకుల పాఠశాలలోని హాస్టల్ గదులు, భోజనశాలలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్‌లో వసతి, భోజనం, పరిశుభ్రత మొదలైన అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య సమాచారాన్ని మంత్రికి వైద్యులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మీడియాతో మాట్లాడుతూ... గతవారం రోజుల క్రితం గురుకుల పాఠశాలలో జ్వరాలు ప్రబలిన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమై విద్యార్థులకు వైద్యసేవలు అందించి పరిస్థితిని చక్కదిద్దినట్లు చెప్పారు. ప్రస్తుతం విద్యార్థులందరూ ఆరోగ్యంగా ఉన్నారని, తిరిగి పాఠశాలకు వస్తున్నారన్నారు. ఆత్మకూరు జిల్లా ఆసుపత్రిలో నిరంతరం వైద్యులు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వైద్య చికిత్స అందించారన్నారు. కొంతమంది విద్యార్థులకు భరోసా కల్పించేందుకు అన్ని రకాల మందులు ఇచ్చి తమ తల్లిదండ్రుల వద్దకు పంపించినట్లు చెప్పారు. గురుకుల పాఠశాలలో ఏ ఒక్క విద్యార్థికి కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వపరంగా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు మంత్రి వివరించారు. వైద్యుల సూచనల మేరకు తాజా కూరగాయాలు, ఆకుకూరలతో వండిన ఆహార పదార్థాలను, పాలను కూడా ప్రతిరోజూ అందిస్తున్నట్లు చెప్పారు. ఎక్కడా రాజీ పడకుండా విద్యార్థుల ఆరోగ్యభద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటుచేసి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ వున్న డంపింగ్ యార్డును ఊరికి దూరంగా ఏర్పాటుచేసిన డంపింగ్‌యార్డుకు తరలించేలా అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ప్రహరీగోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. సోలార్‌హీటర్లు కూడా ఏర్పాటుచేసే ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు.

**ఆత్మకూరు నియోజకవర్గం సరస్వతి నిలయం**

బాలికల విద్యాభివృద్ధికి కృషి చేస్తూ పెద్దఎత్తున ప్రభుత్వ విద్యాలయాలను నెలకొల్పి ఆత్మకూరు నియోజకవర్గాన్ని సరస్వతీ నిలయంగా మార్చినట్లు చెప్పారు. బీసీ, ఎస్సీ, ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలు, కళాశాలలను తమ హయాంలోనే ఏర్పాటు చేసినట్లు మంత్రి గుర్తుచేశారు. 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఆత్మకూరు నియోజకవర్గంలో 31 వేల మందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుకుంటున్నారన్నారు. 408 అంగన్వాడి కేంద్రాలు పని చేస్తున్నాయన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో రెండు మోడల్ స్కూల్స్, గురుకుల రెసిడెన్షియల్ విద్యాలయం, బాలికల రెసిడెన్షియల్ విద్యాలయాలు-2, బిసి రెసిడెన్షియల్-1, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ -1, గవర్నమెంట్ ట్రైబల్ డిపార్ట్మెంట్ ప్రైమరీ స్కూల్ - 1, కెజిబివి- 2, మండల పరిషత్, జిల్లాపరిషత్ పాఠశాలలు-391, నవోదయ విద్యాలయం, ప్రైవేట్ (అన్‌ఎయిడెడ్) - 44, స్టేట్ గవర్నమెంట్ పాఠశాలలు-3 ఉన్నాయని, మోడల్ స్కూల్, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లు, పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాలలు ఉన్నాయని మంత్రి వివరించారు. సీఎం హామీ మేరకు స్కిల్ డెవలప్మెంట్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఆనం పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని విప్లవాత్మక సంస్కరణలతో ముందుకు తీసుకెళ్తూ, ప్రతి విద్యార్థికి కూడా నాణ్యమైన విద్య, భోజనం, విద్యాసామగ్రి అందించడమే ప్రధాన లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు, ఆర్డీవో పావని, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ శేషారత్నం, తహశీల్దార్ పద్మజ, గురుకులపాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.ఒ.కె.రూత్ తదితరులు పాల్గొన్నారు.

# కక్షసాధింపులకు దూరంగా కూటమి ప్రభుత్వం

- రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు
- తెలుగుదేశం పార్టీకి రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ
- టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలోకి చేరికలు



నెల్లూరు (చైతన్యరథం): కక్షసాధింపులకు కూటమి ప్రభుత్వం దూరంగా ఉంటుందని, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయని, టీడీపీ నాయకత్వం పట్ల ప్రజల్లో రోజు రోజుకు ఆదరణ పెరుగుతోందని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం మనుబోలు మండలం అక్కంపేట పంచాయతీ నుంచి షేక్ అమీర్ బాషా ఆధ్వర్యంలో 36 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. నెల్లూరు వేదాయపాళెం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొని పార్టీలోకి ఆహ్వానించారు. పాత, కొత్త నాయకులందరూ సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ... అక్కంపేట పంచాయతీ నుంచి 36 కుటుంబాలు తెలుగుదేశంపార్టీలో చేరడం సంతోషదాయకం.. అందరికీ ఆత్మీయ ఆహ్వానం పలుకుతున్నాం. ప్రత్యర్థి పార్టీల కార్యకర్తలు, నాయకులపై కక్షసాధింపులకు పాల్పడటం, రాజకీయ వేధింపులకు గురిచేయడం మాకు అలవాటు లేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు నరకం అనుభవించారు. అక్రమ కేసులతో జైళ్లు పాలయ్యారు... నెలల తరబడి కుటుంబాలకు దూరమయ్యారు. ఆస్తులు పోగొట్టుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు అనే తేడా లేకుండా కొందరు తహసీల్దార్లను చేతుల్లో పెట్టుకుని భూముల రికార్డులను ఇష్టారాజ్యంగా మార్చేశారు. ఆ ప్రభుత్వంలో వైసీపీ నాయకులు చెప్పిందల్లా చేసిన ముగ్గురు తహసీల్దార్లు, ఒక డీటీ సస్పెన్షన్‌కు గురయ్యారు. రెవెన్యూ శాఖలో పలువురు సిబ్బందితో పాటు ఎక్సైజ్ శాఖలోనూ కొందరు ఉద్యోగాలు కోల్పోయారు. మా రాజకీయ జీవితంలో మా కారణంగా ఇబ్బంది పడిన అధికారి ఒక్కరు లేరు. ఇకపైనా ఉండబోరు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పాలన సాగుతోంది. ఏ ఒక్క భూరికార్డును అక్రమంగా మార్చిన దాఖలాలు లేవు. వైసీపీ ప్రభుత్వంలో యథేచ్ఛగా జరిగిన అక్రమాలను సరిదిద్ది రికార్డులను గాడిలో పెట్టడమే ప్రస్తుతం అధికారులకు పెద్దసమస్యగా మారింది. ఫ్రీహోల్డ్ పేరుతో పేదల భూములను అన్యాక్రాంతం చేశారు. ప్రభుత్వ భూములను ఆదాయపు పన్ను చెల్లించే వారి పేర్లతో మార్చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్వేపల్లి ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, అమీర్ బాషా, కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు బుచ్చిరెడ్డిపాళెం పట్టణ అభివృద్ధికి పునాదులు

**•ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కృషి ఫలితంగానే గ్రేడ్ - 2 మున్సిపాలిటీ హోదా**



నెల్లూరు (చైతన్యరథం): 2020లో గ్రామ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా అప్ గ్రేడ్ అయిన బుచ్చిరెడ్డి పాళెం పట్టణానికి కేవలం అయిదేళ్ల వ్యవధిలో గ్రేడ్ - 2 మున్సిపాలిటీ హోదా దక్కడం చాలా సంతోషంగా వుందన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. బుచ్చిరెడ్డి పాళెం పట్టణం గ్రేడ్ - 2 మున్సిపాలిటీగా అప్ గ్రేడ్‌అయిన సందర్భాన్ని పురస్కరించుకొని నెల్లూరు నగరం మాగుంట లేఅవుట్ లోని విపిఆర్ నివాసంలో బుచ్చి పట్టణ మున్సిపల్ ఛైర్మెన్ మరియు కౌన్సిలర్లు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారిని ఘనంగా సన్మానించి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కృషి ఫలితంగానే బుచ్చిరెడ్డి పాళెం పట్టణానికి గ్రేడ్ - 2 మున్సిపాలిటీ హోదా దక్కిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ సాధారణంగా నగర పంచాయతీలు గ్రేడ్ 3 మున్సిపాలిటీలుగా అప్ గ్రేడ్ అయ్యాక మాత్రమే గ్రేడ్ 2 హోదా వస్తుందని కూటమి ప్రభుత్వం అధికారం లోనికి వచ్చిన 14 నెలల కాలంలో బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలో తాగునీరు, రోడ్లు, డ్రైన్లు లాంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఎక్కువ నిధుల కేటాయింపు గ్రేడ్ 2 అప్ గ్రేడేషన్ కు దోహద పడిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణకు ఈ సందర్భంగా ఆమె ధన్యవాదాలు తెలిపారు. త్వరలో కోవూరు గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేయనున్నట్టు ఆమె వెల్లడించారు. గ్రేడ్-2 మున్సిపాలిటీలకు కేంద్ర, రాష్ట ప్రభుత్వాల నుంచి నిధుల కేటాయింపు పెరుగుతుందని తద్వారా రోడ్లు తాగు నీటి సరఫరా, పార్కులు, మెరుగైన డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటుకు వీలవుతుందన్నారు. స్మార్ట్ సిటీ, అమృత్ లాంటి సెంట్రల్ అర్బన్ డెవలెప్మెంట్ స్కీమ్స్ ద్వారా పట్టణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయన్నారు. గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ అయిన సందర్భంగా పట్టణ జనాభా అవసరాలకు అనుగుణంగా ప్రతి విభాగంలో కేడర్ స్టైంత్ కూడా పెంచుకునే అవకాశం వుందని సౌకర్యాలతో పాటు పట్టణ ప్రజలకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగవుతాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద జలాలతో సోమశిల జలాశయంలో పూర్తి స్థాయి నీటి మట్టం 74 టీఎంసీలకు చేరుకుందని సోమశిల డ్యాం భద్రతను దృష్టిలో ఉంచుకొని జలాశయ అధికారులు 10 వేల క్యూసెక్కుల నీళ్లు దిగువన వున్న పెన్నా నదిలోకి వదిలారన్నారు. కోవూరు నియోజకవర్గంలోని పెన్నా నది పరివాహక గ్రామాల పశువుల కాపర్లు మరియు జాలర్లు నదిలోనికి వెళ్లకుండా అప్రమత్తంగా వుండాలని ఆమె హెచ్చరించారు. అప్రమత్తంగా వుంటూ ఎటువంటి ఆస్థి మరియు ప్రాణ నష్టం జరగకుకుండా చూడాల్సిందిగా అధికారులను ఆదేశించారు. బుచ్చిరెడ్డి పాళెం పట్టణ మున్సిపల్ ఛైర్మెన్ మోర్ల సుప్రజ మరియు కమీషనర్ బాలకృష్ణ బుచ్చి పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు చేస్తున్న కృషిని అభినందించారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రత్యేక చొరవ కారణంగానే బుచ్చి నగర పంచాయతీ గ్రేడ్ 2 మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ అయిందన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చి పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు మరియు టిడిపి ముఖ్య నాయకులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని అభినందించారు.

# సమన్వయంతో అభివృద్ధికి అడుగులు

**• ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా... నియోజకవర్గంలో పర్యటించిన ఎమ్మెల్యే నసీర్**



గుంటూరు (చైతన్యరథం): నగరంలో అందరూ సమన్వయంతో పని చేస్తే సమస్యలు దూరమవుతాయని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. భారీ వర్షాలకు గుంటూరు తూర్పు నియోజకర్గంలో నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో మంగళవారం ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతవాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. భారీ వర్షాలకు నీట మునిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రధానంగా అమరావతి రోడ్డు వైపు నుంచి శారదాకాలనీ, బుచ్చయ్య తోట మీదుగా బొంగరాల బీడు ప్రాంతానికి వర్షపు నీరు వస్తోందని, దీంతో ఈ ప్రాంతం మునిగిపోతుందని చెప్పారు. ఈ సమస్య పరిష్కారం కోసం రైల్వే, మునిసిపల్ అధికారులతో చర్చలు నిర్వహించామని తెలిపారు. రెండు రోజుల్లో రైల్వే అధికారుల బృందం పర్యటిస్తుందన్నారు. వెంట్ ను అభివృద్ధి చేయడం ద్వారా ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపబోతున్నామని వెల్లడించారు. మునిసిపల్ అధికారులు ప్రతి ప్రాంతాన్ని పరిశీలించి మురుగు నిల్వలు లేకుండా చూడాలన్నారు. సిల్ట్ నిల్వలు ఉన్న చోట వెంటనే తీయించే ఏర్పాటు చేయాలని సూచించారు. నగరంలో ప్రతి ప్రాంతం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి నిమిషం ప్రజలతోనే ఉంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో దాసరి రాజా మాస్టర్, ఎర్రగోపు నాగేశ్వరావు, గోళ్ళ ప్రభాకర్, బత్తిని శంకర్, మహంకాళి నరసింహారావు, కాలే దేవదాస్, బత్తిని దినేష్, కొడిదేటి కిషోర్, పులిగడ్డ నాగేశ్వరావు,ఆనంద్ సాగర్, వంగర ఏడుకొండలు, సౌపాటి రత్నం, వేములకొండ శ్రీనివాస్, సముద్రాల గణేష్, సోమశేఖర్, వినోద్, ఆదం షఫీ, గొడుగు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# 16 వేల మంది విదేశీయుల బహిష్కరణకు చర్యలు

**కొత్త వలస చట్టాల ప్రకారం నిర్ణయం**



దేశం నుంచి 16 వేల మంది విదేశీయులను బహిష్కరించడానికి కేంద్రం చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. భారత్లో ఇటీవల అమల్లోకి వచ్చిన కొత్త వలస చట్టాల ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నార్కోటిక్స్ రవాణా, ఇతర నేరాలతో సంబంధమున్న దాదాపు 16 వేల మంది విదేశీయులను దేశంలోని పలు ప్రాంతాల్లో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అదుపులోకి తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం నిర్బంధ కేంద్రాల్లో ఉన్నవారందరినీ దేశం నుంచి బహిష్కరించడానికి హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పలు జాతీయ మీడియాల్లో వార్తలు వస్తున్నాయి. ఫోర్జరీ పత్రాలతో దేశంలో అక్రమంగా నివాసముంటున్న విదేశీయులకు కఠిన శిక్షలు విధించే కొత్త చట్టం సెప్టెంబర్ 2న అమల్లోకి వచ్చింది. వలసలు, విదేశీయుల చట్టం-2025 వ్యవహరిస్తున్న దీనిని బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంటు ఆమోదించగా.. ఏప్రిల్ 4న రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. నాలుగు పాత చట్టాల స్థానంలో ఇది అమల్లోకి వచ్చింది. ఇందులో భాగంగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో దేశంలోకి ప్రవేశించిన విదేశీయులకు కనిష్టంగా రెండేళ్లు, గరిష్టంగా ఏడేళ్ల వరకు జైలు శిక్ష.. రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది.

నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినా.. భారత్లో పేదరికంలో మగ్గుతున్న వారు కోట్లాది మంది ఉన్నారు. పేదరికాన్ని అంతం చేయడానికి ప్రభుత్వాలు రూ.కోట్ల నిధులతో సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నా పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. అయితే ఈ సమస్య పరిష్కారంలో అక్రమ వలసలు ప్రధాన అడ్డుగోడగా నిలుస్తున్నాయి. సరిహద్దు దేశాల నుంచి అక్రమంగా ప్రవేశించిన విదేశీయులు చట్టవిరుద్ధంగా ఉండడమే కాకుండా అసలైన లబ్ధిదారులకు అందాల్సిన సంక్షేమఫలాలను వీరు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం అమల్లోకి తీసుకువచ్చిన వలసలు, విదేశీయుల చట్టం ద్వారా వారిని దేశం నుంచి బహిష్కరించడానికి చర్యలు తీసుకుంటోంది.

## మలూర్ ఎమ్మెల్యే ఎన్నిక చెల్లదు..

### కర్ణాటక హైకోర్టు సంచలన తీర్పు

బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే కేవై నంజేగౌడకు హైకోర్టులో చుక్కెదురైంది. మలూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన ఎన్నిక చెల్లదని కర్ణాటక హైకోర్టు మంగళవారంనాడు సంచలన తీర్పునిచ్చింది. తిరిగి ఓట్లు లెక్కించి నాలుగు వారాల్లోగా ఫలితం ప్రకటించాలని భారత ఎన్నికల కమిషన్ను ఆదేశించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో నంజేగౌడ గెలుపును బీజేపీ అభ్యర్థి కేఎస్ మంజునాథ్ గౌడ హైకోర్టులో సవాలు చేశారు. కౌంటింగ్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని, ఫలితాన్ని రద్దు చేయాలని ఆయన కోర్టును కోరారు. జస్టిస్ ఆర్.దేవాదాస్ దీనిపై విచారణ జరిపి తాజా తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా వీడియో ఫుటేజ్ను జాగ్రత్త చేశారా లేదా అనే విషయాన్ని ధ్రువీకరించాలని కోలార్ జిల్లా మాజీ ఎన్నికల అధికారి వెంకటరాజును కోర్టు ఆదేశించింది. ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్ను కోర్టుకు తప్పనిసరిగా సమర్పించాలని పేర్కొంది. కాగా, సుప్రీంకోర్టుకు అప్పీల్ చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని నంజేగౌడ తరపు న్యాయవాది చేసిన విజ్ఞప్తిని హైకోర్టును అంగీకరించింది. అత్యున్నత న్యాయస్థానానికి అప్పీల్ చేసుకునేందుకు వీలుగా 30 రోజుల పాటు ప్రస్తుతం ఇచ్చిన తీర్పుపై స్టే విధించింది.

## డెహ్రాడూన్ను ముంచెత్తిన వానలు

### నీట మునిగిన షాపులు, ఆలయాలు

ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్ తడిసి ముద్దవుతోంది. మంగళవారం కూడా కుండపోత వానలు కొనసాగడంతో నగరం జలప్రళయాన్ని ఎదుర్కొంటోంది. క్లౌడ్ బరస్ట్ నగరాన్ని అల్లకల్లోలం చేస్తోంది. వరదల కారణంగా లోతట్టు ప్రాంతాలు నీట మునిగిపోయాయి. ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు భయభ్రాంతులకు లోనవుతున్నారు. రోడ్లు నదుల్లా మారిపోయాయి. వందల కొద్దీ కార్లు, ఆటోలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. దుకాణాలు నీట మునిగి తీవ్ర నష్టాన్ని చవిచూశాయి. పలు ఆలయాలు కూడా నీటిలో మునిగిపోయాయి. అనేక వీధులు ఇప్పుడు ప్రమాదంగా మారాయి. రెస్క్యూ బృందాలు స్పందించి సహాయ చర్యలు చేపట్టినా భారీ వరద కారణంగా ప్రజల ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా తమ్సా నది ఒడ్డున ఉన్న ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

## జనం కోసమే

## సెలవు రోజుల్లో విజయ్ ప్రచారం

చెన్నై: తన పర్యటనలకు జనం అధిక సంఖ్యలో రావాలనే ఆలోచనతోనే తమిళగ వెట్రి కళగం నాయకుడు విజయ్ వారాం తపు సెలవుదినాల్లో ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి రఘుపతి విమర్శించారు. పుదుకోటలో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయ్ రాకవల్ల డీఎంకే ఓటు బ్యాంక్ ఏ మాత్రం తగ్గే అవకాశమే లేదన్నారు.



విజయ్ పర్యటనల్లో ప్రభుత్వ ఆస్తులకు నష్టం జరుగుతోందని, పోలీసు నిబంధనలు ఉల్లఘించి సభలు జరుపుతున్నారని, అందువల్లే పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. 2011లో డీఎంకేకు మద్దతుగా హాస్యనటుడు వడివేల్ ప్రచారం చేసినప్పుడు ప్రస్తుతం విజయ్ రోడ్షోల కంటే అధికసంఖ్యలో జనాలు వచ్చారని ఆయన చెప్పారు. శని, ఆదివారాలు స్కూళ్లు, కాలేజీలకు సెలవు కనుక యువకులను పెద్ద సంఖ్యలో సభకు వస్తారని భావించే విజయ్ ఆ రెండు రోజులు మాత్రమే ప్రచారం చేయడం గర్హనీయమని అన్నారు.

## మోదీ జన్మదినం సందర్భంగా

# బీహార్లో చలో జీతే హై చిత్ర ప్రదర్శన

**◆ ఎల్ఈడీలతో 243 వాహనాలు సిద్ధం**




పాట్నా: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 17న తన 75వ పుట్టినరోజు జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ ప్రత్యేకంగా సేవా పక్వాడ పేరుతో దేశవ్యాప్తంగా 17 నుంచి అక్టోబర్ 2 వరకూ సేవా కార్యక్రమాలు నిర్వహించనుంది. బీహార్ బీజేపీ యూనిట్ మోదీ పుట్టిన రోజును మరింత ప్రత్యేకంగా జరుపుకోనుంది. ప్రధానమంత్రి బాల్యం నేపథ్యంలో రూపొందిన 'చలో జీతే హై' చిత్రాన్ని రాష్ట్రంలోని 243 అసెంబ్లీ నియోజవర్గాల్లో బుధవారం నాడు ప్రదర్శించనుంది. దీనితో పాటు రెండువారాల సేవా పక్వాడ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరాలు, క్లీన్లీ నెస్ డ్రైవ్, పీఎం మోదీ సాధించిన విజయాలపై ఎగ్జిబిషన్, చర్చాగోష్టులు నిర్వహించనుంది. ప్రధాని మోదీ బాల్యం నేపథ్యంలో రూపొందిన 'చలో జీతా హై' చిత్రాన్ని ప్రధాని పుట్టినరోజు సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శించనున్నట్టు కేంద్రమంత్రి నిత్యానందరాయ్ తెలిపారు. ఇందుకోసం ఎల్ఈడీలు అమర్చిన 243 వాహనాలను సిద్ధం చేశామని చెప్పారు. 'ఇది కేవలం సినిమా కాదు, ప్రధాని బాల్యానికి చెందిన వాస్తవ చిత్రం. పేదరికాన్ని ఆయన చూశారు. తన తల్లి వేరేవాళ్ల ఇళ్లలో పాత్రలు తోమడం, ఎంతో కష్టపడటం చూశారు. పేద ప్రజల బాధలేమిటో ఆయనకు బాగా తెలుసు' అని నిత్యానందరాయ్ చెప్పారు. హిందీలో రూపొందించిన 'చలో జీతే హై' షార్ట్ ఫిల్మ్కు మంగేష్ హడవాలే దర్శకత్వం వహించారు. మహావీర్ జైన్, భూషణ్ కుమార్ నిర్మించారు. ఈ చిత్రం 2018 జూలై 11న విడుదలైంది. బెస్ట్ నాన్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరిలో జాతీయ అవార్డును కూడా గెలుచుకుంది.

# భక్తుల డబ్బు కల్యాణ మండపాల నిర్మాణానికి కాదు



దేవాలయాలకు భక్తులు సమర్పించే డబ్బులు కల్యాణ మండ పాల నిర్మాణానికి కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఆలయ నిధులను ప్రభుత్వ నిధులుగా పరిగణించలేమంటూ మద్రాస్ హైకోర్టుకు చెందిన మదురై బెంచ్ ఇటీవల ఇచ్చిన తీర్పుపై స్టే విధించేందుకు నిరాకరించింది. తమిళనాడులోని ఐదు దేవాలయాలకు చెందిన నిధులతో రాష్ట్రంలోని వివిధ ఆలయాల ప్రాంగణాల్లో కల్యాణ మండపాల నిర్మాణానికి అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై పిటిషనర్లు మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను కొట్టివేసింది. దీన్ని సవాలు చేస్తూ తమిళనాడు సర్కారు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన 'సుప్రీం' ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "కల్యాణ మండపాల ఏర్పాటు కోసం భక్తులు తమ డబ్బును ఆలయాలకు ఇవ్వరు. ఆలయ అభివృద్ధి వంటి వాటికోసం ఇస్తుంటారు. ఒక ఆలయ ప్రాంగణంలో పెళ్లి జరుగుతుంటే.. అక్కడ అసభ్యకరమైన పాటలు ప్లే చేస్తుంటే.. అది సరైనదేనా?" అని ప్రశ్నించింది. ఆ డబ్బును విద్య, వైద్యం వంటి దాతృత్వ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తే బాగుంటుందని సూచించింది. తదుపరి విచారణను నవంబర్ 19కి వాయిదా వేసింది.

# సివిల్ సర్వీస్ అధికారిణి ఇంట్లో నోట్ల కట్టలు, నగలు

**◆ ప్రత్యేక విజిలెన్స్ సెల్ సోదాల్లో అడ్డంగా పట్టుబడిన వైనం**

గువాహటి: అస్సాంకు చెందిన సివిల్ సర్వీస్ అధికారిణి నూపుర్ బోరా.. ముఖ్యమంత్రి ప్రత్యేక విజిలెన్స్ సెల్ సోదాల్లో అడ్డంగా పట్టుబడ్డారు. ఆమె ఇంట్లో రూ.92 లక్షల నగదు, రూ.2 కోట్లు విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. భూకుంభకోణం, ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణల నేపథ్యంలో ఈ దాడులు జరిగాయి. అక్రమ సెటిలర్స్ పేరున ప్రభుత్వ, సతారా భూముల అక్రమ రిజిస్ట్రేషన్లకు బోరా పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయని ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తెలిపారు. బెంగాలీ మాట్లాడే ముస్లింలను 'మియా'గా మిలుస్తారు. వీరిని బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన అక్రమ వలసదారులుగా బీజేపీ చెబుతోంది. ముందుగా అనుకున్న ప్రకారం బోరా నివాసంపై గత ఆదివారం రాత్రి దాడులు జరపాల్సి ఉండగా ఆమె గెస్ట్ హౌస్లో ఉండటంతో సోదాల్లో జాప్యం జరిగింది. సోమవారం ఉదయం ఆపరేషన్ తిరిగి ప్రారంభమైంది. గువాహటిలోని ఆమె నివాసంతో పాటు ఆమెకు సంబంధించిన మరో మూడు ప్రాంతాల్లో అధికారులు సోదాలు జరిపారు. బార్పేటలో అద్దెకు ఉంటున్న ఇంటిలో కూడా అధికారులు సోదాలు చేపట్టారు. బోరాపై స్థానిక యాక్టివిస్ట్ గ్రూప్ క్రిషక్ ముక్తి సంగ్రామ్ సమితి లాంఛనంగా ఫిర్యాదు చేసింది. భూములకు సంబంధించిన సేవలకు ఆమె 'రేట్ కార్డ్' పెట్టారని, భూముల రికార్డుల్లో మార్పులు చేసేందుకు రూ.1,500 నుంచి రూ.2 లక్షల వరకూ లంచంగా తీసుకునే వారని కేఎంఎస్ఎస్ ఆరోపించింది.



నూపుర్ బోరా కేవలం ఆరేళ్ల సర్వీసులోనే పెద్ద మొత్తంలో సంపద కూడబెట్టారని విజిలెన్స్ సెల్ అధికారులు తెలిపారు. కూడబెట్టిన ఆస్తులు, ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లను సోదాల్లో స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

# పెనవేసుకుంటున్న పాక్-యూఎస్

## వచ్చేవారం ట్రంప్‌తో భేటీకానున్న షరీఫ్?



పరస్పర అవసరాలరీత్యా.. అమెరికా, పాకిస్థాన్ రోజురోజుకూ దగ్గరవుతున్నాయి. తాజాగా.. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్ అగ్రరాజ్యంలో పర్యటించనున్నారన్నది సమాచారం. వచ్చేవారం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ కానున్నట్టు తెలుస్తోంది. సెప్టెంబర్ 25న రెండు వర్గాలమధ్య చర్చలు జరగనున్నాయని పాక్ మీడియా కథనం పేర్కొంది.

అమెరికాలో ఐరాస సభ్య దేశాల ప్రతినిధుల అత్యున్నతస్థాయి సమావేశాలు ఈనెల 23నుంచి 29వరకు జరగనున్నాయి. ఈ క్రమంలోనే యూఎస్, పాక్ నేతల మధ్య భేటీ జరగనుందని సమాచారం. దాయాది దేశంలో సంభవించిన వరదలు, ఖతార్‌పై ఇజ్రాయెల్ దాడుల గురించి చర్చించే అవకాశముంది. అలాగే భారత్-పాక్ మధ్య ఉన్న దౌత్యపరమైన ఉద్రిక్తతలు చర్చకు రానున్నట్టు తెలుస్తోంది. అయితే ఈ పర్యటనపై ఎలాంటి అధికారిక ప్రకటనా రాలేదు. పాక్ ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్ అమెరికాలో వరుస పర్యటనలు చేసిన సంగతి తెలిసిందే. ఆపరేషన్ సిందూర్ తర్వాత ట్రంప్ విందులో పాల్గొన్న మునీర్.. తర్వాత రెండు నెలలకే మరోసారి అక్కడకు వెళ్లారు. అమెరికా, పాకిస్థాన్ మధ్య ఉన్న పరస్పర ప్రయోజనాలే వాటిని దగ్గర చేస్తున్నాయి. ఆర్థిక సమస్యలతో కునారిల్లుతున్న ఇస్లామాబాద్‌కు ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల నుంచి సాయం అందాలన్నా, ఫైనాన్సియల్ టాస్క్‌ఫోర్స్ ఆంక్షలను తప్పించుకోవాలన్నా అమెరికా సహకారం కావాలి. బలూచిస్థాన్ తిరుగుబాటుదారులు, తెహ్రీకే తాలిబన్ దాడులను ఎదుర్కొనేందుకూ వాషింగ్టన్ తోడ్పాటు కావాలి. భారత్‌తో దౌత్యపరమైన ఉద్రిక్తతల వేళ.. ఈ అనుబంధం అవసరమని దాయాది భావిస్తోంది. రష్యా, చైనాల ప్రాబల్యం దృష్ట్యా వాటిని ఎదుర్కోవడానికి అగ్రదేశానికి పాక్ అవసరమవుతుంది. పాక్‌లో అస్థిర పరిస్థితులు నెలకొంటే అణ్వాయుధాలు ఉగ్రవాదుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదముంది. దీన్ని నిరోధించాలన్నా, అణ్వాయుధ టెక్నాలజీ, ముడిపదార్థాలు ఇరాన్‌లాంటి దేశాలకు అందకుండా చూడాలన్నా పాక్ తమ కనుసన్నల్లో ఉండాల్సిందేనని అమెరికా కోరుకుంటోంది. ఇలాంటి కారణాలే రెండు దేశాలను దగ్గర చేస్తున్నాయి. ఆ రెండు దేశాలది స్నేహం కాదని, పక్కా వ్యాపారమని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

# 'కిమ్‌కు కోపమొచ్చింది..

### ఐస్‌క్రీమ్ పేరు మారిపోయింది'

### ద.కొరియా పదాలు వినిపించకుండా జాగ్రత్తలు

ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌కు కోపమొస్తే.. ఏదోక ఉపద్రవం చోటుచేసుకోవడం ఖాయం. ఇప్పుడు ఆయనకు ఐస్ క్రీమ్‌మీద కోపమొచ్చింది. అంతే.. తక్షణం దాని పేరునే మార్చేశారు. అంతేకాదు.. పనిలోపనిగా మరికొన్ని ఫేమస్ పదార్థాల పేర్లనూ మార్చేశారు. సాంస్కృతిక నియంత్రణ కోసం ఈనిర్ణయం తీసుకొన్నట్టు అక్కడి ప్రభుత్వం చెబుతోంది. ప్రపంచవ్యాప్తంగా 'ఐస్క్రీమ్' అనేది ఎక్కడికి వెళ్లినా గుర్తుపట్టే పేరు. కానీ, ఉత్తరకొరియా అధినేత మాత్రం ఈ పేరువల్ల విదేశీ ప్రభావం ప్రజలపై పడుతుందని అనుమానించారు. దీంతో ఉత్తరకొరియా భాషలో 'ఎసుకిమో'గా మార్చేశారు.లేకపోతే ఇయోరియెంబో సెంగిగా పిలవాలని మినహాయింపు నిచ్చారు. వీటికి 'ఐసు మిఠాయి' అని అర్థం. ఈ విషయాన్ని డెయిలీ ఎన్‌కె పత్రిక పేర్కొంది. దక్షిణ కొరియా, పశ్చిమదేశాల పదాలను దేశ భాషనుంచి తొలగించడమే దీని లక్ష్యంగా వెల్లడించింది. ప్రస్తుతం ఉత్తరకొరియాలోని టూర్ గైడ్లకు వాన్సన్ సహా పలు ప్రదేశాల్లో మూడు నెలల శిక్షణ ప్రారంభించింది. దానిలో భాగంగా విదేశీ పర్యాటకులతో మాట్లాడే సమయంలో కూడా ఎటువంటి ఇంగ్లిష్ పదాలు రాకుండా ఎలా జాగ్రత్త తీసుకోవాలో వెల్లడించారు. అయితే విదేశీ పర్యాటకులతో అలా ఎలా మాట్లాడతామంటూ వారు తలలు పట్టుకొంటున్నారు. కిమ్ చెప్పాక చేయడం మినహా మరో ఆప్షన్ లేకపోవడంతో.. శిక్షణలకు హాజరవుతున్నారు. సాధారణంగా ఆర్కిటిక్, అలాస్కా, కెనడా, గ్రీన్‌లాండ్, సైబీరియాల్లో ఎస్కిమో అనే జాతి ఉందని మనకు తెలుసు. తాజాగా 'ఎసుకిమో' పదం కూడా దానిని పోలి ఉండటంతో గందరగోళం నెలకొంది. ఇదిలావుంటే, ప్రపంచవ్యాప్తంగా సుపరిచితమైన హామ్‌బర్గ్ పేరును కూడా కిమ్ మార్చేశారు. దీనిని 'డాజిన్-గోగి గియోపాంగ్'గా పిలవాలని ఆదేశించారు. గ్రౌండ్ బీఫ్‌తో రెండు బ్రెడ్లు అని అర్థం. కారియోకి మెషిన్ల పేరును కూడా ఉత్తరకొరియా నియంత మార్చేశారు. పర్యాటకులు తమ దేశంలో ఉన్నప్పుడు వారు దక్షిణ కొరియా పదాలు వాడకుండా నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నారు. ఇటీవల కంగ్వాన్ ప్రావిన్స్‌లోని బీచ్‌వద్ద వాన్సన్ అనే విలాసవంతమైన రిసార్ట్ హబ్‌ను అభివృద్ధి చేశారు. దీని అధికారి ఒకరు మాట్లాడుతూ విదేశీ ప్రభావంనుంచి ఉత్తర కొరియావాసులను రక్షిస్తూ టూరిజాన్ని ప్రమోట్ చేయడమే దీని లక్ష్యమని పేర్కొన్నారు. గైడ్లకు ఈ శిక్షణ కార్యక్రమం ఆగస్టు 21న మొదలైంది. దీనిని ఆ దేశ వర్కర్స్ పార్టీ క్యాడర్ డిపార్ట్మెంట్ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తోంది. వాన్సన్ అంతర్జాతీయ టూరిజమ్ హబ్‌గా మారుతుందని కిమ్ భావిస్తున్నారు.





# అది.. మారణహోమమే!

### గాజాలో ఇజ్రాయెల్ చర్యపై ఐరాస నివేదిక

గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడిందని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది. ఇజ్రాయెల్‌లోని అగ్రనాయకులు కూడా దాడులను ప్రోత్సహించారని పేర్కొంది. మొత్తం 72 పేజీల నివేదిక మంగళవారం విడుదలైంది. ఇజ్రాయెల్ 2023 అక్టోబర్ నుంచి 4 జాతి విధ్వంసకర దాడులకు పాల్పడిందని ఐరాస మానవహక్కుల మండలి ఏర్పాటు చేసిన కమిషన్ నివేదిక వివరించింది. అక్టోబర్ 7 దాడులకు ముందునుంచే ఇజ్రాయెల్ పాలస్తీనాలోకి సరకు రవాణాను అడ్డుకుందని నివేదిక పేర్కొంది. హమాస్ దాడి తర్వాత రవాణా పూర్తిగా ఆగిపోవడంతో గాజావాసుల జీవనం దుర్భరంగా మారిందని వివరించింది. 'జీవనాధార అవసరాలను నిలిపివేయడాన్ని ఇజ్రాయెల్ ఆయుధంగా మలచుకుంది. ముఖ్యంగా నీరు, ఆహారం, విద్యుత్, ఇంధనం, మానవతా సాయం సహా ఇతర ముఖ్యమైన సామగ్రిని నిలిపివేసింది' అని ఐక్యరాజ్యసమితి కమిషన్ పేర్కొంది. ఇజ్రాయెల్ దాడుల కారణంగా పాలస్తీనా వాసులకు తీవ్రమైన శారీరక, మానసిక హాని జరిగిందని ఐరాస నివేదిక పేర్కొంది. కొన్ని చర్యల ఫలితంగా ఆ ప్రాంతంలో జననాలు కూడా తగ్గిపోయాయని తెలిపింది. పౌరులు, జర్నలిస్టులు, ఆరోగ్యశాఖ సిబ్బంది. మానవతా కార్యకర్తలపై దాడులకు సంబంధించిన కొన్ని ఉదాహరణలు ఇచ్చింది. ఇళ్లు. ఆస్పత్రులు, పాఠశాలలు, మత ప్రదేశాలు అనే తేడా లేకుండా దాడులు జరిగాయని తెలిపింది. చిన్నారులని తెలిసి కూడా ఇజ్రాయెల్ సేనలు దాడి చేశాయని ఐదేళ్ల హింద్ రజాబ్ మరణాన్ని ఉదహరించింది. పౌరులు ప్రాణాలు కోల్పోతారని తెలిసి కూడా మందుగుండు వాడారని పేర్కొంది. పాలస్తీనా ఆరోగ్యశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం అక్టోబర్ 7నుంచి 65 వేలమంది చనిపోయారు. వీరిలో హమాస్‌కు చెందిన వారు ఎంతమంది? మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారా? అనే వివరాలు వెల్లడించలేదు. అయితే, తాము ఆత్మరక్షణ కోసమే దాడులు చేశామని ఎలాంటి మారణహోమానికి పాల్పడలేదని ఇజ్రాయెల్ చెప్పుకొచ్చింది. 'వక్రీకరించిన, తప్పుడు నివేదికను ఇజ్రాయెల్ తిరస్కరిస్తుంది. విచారణ కమిషన్‌ను వెంటనే రద్దు చేయాలని పిలుపునిస్తున్నాం' అని ఇజ్రాయెల్ విదేశాంగశాఖ ప్రకటించింది. ఈ నివేదిక హమాస్ తయారు చేసిన అబద్ధాలతో కూడి ఉందని విమర్శించింది. రచయితలకు ఉగ్రమూకలతో సంబంధాలున్నాయని ఆరోపించింది. యూదులగురించి వారి ప్రకటనలను ప్రపంచం మొత్తం ఖండించిందని ఇజ్రాయెల్ వ్యాఖ్యానించింది.



# చీకటి శక్తుల అడ్డా.. ఎక్స్!

### ముందు దానిని సంస్కరించాలి..

### మస్క్‌పై నవారో పరోక్ష దాడి

అమెరికా అధ్యక్షుడి వాణిజ్య సలహాదారు పీటర్ నవారో.. ఎలాన్ మస్క్‌ను లక్ష్యంగా చేసుకొని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' చీకటి శక్తులకు అడ్డాగా మారిందని ఆరోపించిన ఆయన.. దీనిలో వ్యాప్తిచెందే హింసాత్మక సమాచార వ్యాప్తికి ఆయనే బాధ్యత వహించాలన్నారు. లాస్ ఏంజెలెస్‌కు చెందిన ఓ ఉపాధ్యాయుడు ఇటీవల ఎక్స్‌లో చేసిన తీవ్ర వ్యాఖ్యలపై నవారో ఇలా స్పందించారు. "అత్యంతచెత్తగా మారిన ఎక్స్‌వేదికను ఎలామారుస్తారు. అనామక, గుర్తుతెలియని పోస్టులకు చోటు ఉండొద్దు. విదేశీయులు మీ వేదికను వాడుకొని ఇక్కడి రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేసేందుకు అవకాశం ఇవ్వొద్దు. చీకటి శక్తులకు ఎక్స్ అడ్డగా మారింది. ముందు ఎక్స్‌ను బాగు చేయాలి" అని పేర్కొంటూ మస్క్‌ను ఉద్దేశిస్తూ నవారో పేర్కొన్నారు. ఎక్స్ ఫ్యాక్ట్ చెకింగ్ వ్యవస్థపైనా నవారో ఇటీవల తీవ్ర విమర్శలు చేశారు. రష్యా నుంచి భారత్ చమురు దిగుమతి చేసుకుంటూ లాభపడుతోందని నవారో చేసిన వ్యాఖ్యలపై ఎక్స్‌లో ప్రతికూల స్పందనలు వచ్చాయి. ఆ పోస్టును ఎక్స్ కూడా ఫ్లాగ్‌చేసింది. ఇందన భద్రత కోసమే భారత్ కొనుగోలు చేస్తోందని,అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడం లేదని స్పష్టంచేసింది. ట్రంప్ సన్నిహితుడు, కన్జర్వేటివ్ యాక్టివిస్ట్ చార్లీ కిర్క్ హత్య తర్వాత అమెరికాలోని ఉటాలో కొంత ఉద్రిక్త పరిస్థితులు నెల కొన్నాయి. ఈ ఘటనను ప్రశంసిస్తూ కొందరు ఎక్స్‌పోస్టుల పెడుతుండటాన్ని మస్క్ ఖండించారు. ఇటువంటి వాటిని అదుపుచేయక పోతే వ్యక్తులకు బెదిరింపులు పెరుగుతాయన్నారు. అయితే మస్క్ సారథ్యంలోనే ఎక్స్ ఉందన్న అంశాన్ని నవారో గుర్తు చేశారు.

# ఔను.. అదే నిజం!

### ఆపరేషన్ సిందూర్‌లో మసూద్ కుటుంబం

### చిన్నాభిన్నం: జైషే కమాండర్



పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌లోని ఉగ్ర శిబిరాలు నిలవునా కూలిన సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో జైషే మహ్మద్ చీఫ్ మసూద్‌అజార్ కుటుంబంలోని పలువురు ప్రాణాలు కోల్పోయినట్టు నాడు కథనాలు వచ్చాయి. తాజాగా ఈవిషయాన్ని జైషే కమాండర్ మసూద్ ఇలియాస్ కశ్మీరీ అంగీకరించారు. ఉగ్రవాదాన్ని స్వీకరించి.. దేశ సరిహద్దులను రక్షించుకు నేందుకు తాము ఢిల్లీ, కాబూల్,కాందహార్‌లతోపోరాడామనిమసూద్ ఇలియాస్ కశ్మీరీ ఓకార్యక్రమంలో పేర్కొన్నారు.ఇందుకోసం తాము అన్నింటినీ త్యాగం చేశామంటూ వ్యాఖ్యా నించారు. మే 7న భారత దళాలు బహవల్పూర్‌లోని జైషే ప్రధాన కార్యాలయంపై జరిపిన దాడుల్లో అజార్ కుటుంబం ముక్కలైపోయిందని అంగీకరించారు. ఈ సందర్భంగా భారత్ ఆర్మీ తమ రహస్య స్థావరాల్లోకి ప్రవేశించి ఎలా దాడులు చేసిందనే విషయాలను ఇలియాస్ వివరంగా పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతుంది. జమ్మూకశ్మీర్లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవికంగా దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు.దీనికి ప్రతీకారంగా భారత ఆర్మీ ఆపరేషన్ సిందూర్ చేపట్టి.. పాక్‌కు బుద్ధిచెప్పింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్లోని తొమ్మిది ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసింది. బహవల్‌పూర్‌లోని మర్కజ్ సబాన్‌పైనా భారత సైన్యం విరుచుకుపడింది. దీన్ని జైషే మహ్మద్‌కు ఆపరేషనల్ హెడ్ క్వార్టర్‌గా పేర్కొంటారు. ఆ భవనాన్ని మసూద్ తన ఇంటిగా విని యోగిస్తున్నాడు. భారత్ ఆర్మీ చేసిన దాడుల్లో మసూద్ కుటుంబానికిచెందిన 10మంది ప్రాణాలు కోల్పోయారు.




## భారత కొత్త జెర్సీ స్పాన్సర్ అపోలో టైర్స్

భారత క్రికెట్ కొత్త జెర్సీ స్పాన్సరర్‌గా అపోలో టైర్స్ నిలిచింది. ఈసంస్థ 2027 వరకు స్పాన్సర్ షిప్ హక్కులను దక్కించుకుంది. ఇంతకు ముందు డ్రీమ్ 11టీమ్ ఇండియా స్పాన్సరర్‌గా వ్యవహరించింది. ఇటీవల ఆన్‌లైన్ గేమింగ్ నిషేధబిల్లు పార్లమెంటులో ఆమోదంపొందిన నేపథ్యంలో డ్రీమ్ 11తో ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం టీమ్ ఇండియా జెర్సీ స్పాన్సరర్ లేకుండానే ఆసియా కప్‌లో పాల్గొంటోంది. తాజాగా అపోలో టైర్స్ స్పాన్సరర్‌గా నిలిచిన నేపథ్యంలో ఆ సంస్థ బీసీసీఐకు మ్యాచ్‌కు రూ.4.5కోట్లు చెల్లించనుంది. ఇంతకు ముందు డ్రీమ్ 11 మ్యాచ్‌కు రూ.4కోట్లు ఇచ్చేది. భారత క్రికెట్లో ఇటీవల కాలంలో అత్యంత లాభదాయకమైన స్పాన్సర్‌షిప్ ఒప్పందాల్లో ఇది ఒకటిగా నిలిచింది.

### స్పీడ్ స్కేటింగ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో

## భారత్‌కు తొలి స్వర్ణం



స్పీడ్ స్కేటింగ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు తొలి స్వర్ణం దక్కింది. చైనాలో జరుగుతున్న 2025ఎడిషన్‌లో తమిళనాడుకు చెందిన 22 ఏళ్ల యువ స్కేటర్ ఆనంద్‌కుమార్ వేల్‌కుమార్ భారత్‌కు స్వర్ణాన్ని అందించాడు. 1000 మీటర్ల సీనియర్ స్ప్రింట్‌లో ఆనంద్‌కుమార్ 1:24,924సెకన్ల టైమింగ్‌తో రేసును పూర్తిచేసి స్పీడ్‌స్కేటింగ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ చరిత్రలో భారత్‌కు తొలి స్వర్ణ పతకం సాధించిపెట్టాడు. ఇదే టోర్నీలో ఆనంద్‌కుమార్ 500 మీటర్ల స్ప్రింట్‌లో కాంస్య పతకం సాధించాడు. ఈ టోర్నీలో ఆనంద్‌కుమార్ సాధించిన విజయాలు భారతదేశంలో స్పీడ్ స్కేటింగ్‌ను కొత్త దిశను చూపించనున్నాయి. ఇప్పటివరకు అంతర్జాతీయ స్థాయిలో ఈ క్రీడలో భారత్‌కు పెద్దగా గుర్తింపు లేదు. ఆనంద్‌ను మూర్ఖు ప్రధాని నరేంద్ర మోదీ అభినంద నలు తెలిపారు. అతని విజయాలు దేశానికి గర్వకారణమని అన్నారు. ఆనంద్‌కుమార్ అంకితభావం, శ్రమ భారత యువతకు స్ఫూర్తిదాయకమని ఎక్స్ ద్వారా తెలిపారు.

**జూనియర్ విభాగంలో క్రిష్ శర్మకు స్వర్ణం**

స్పీడ్ స్కేటింగ్ వరల్డ్ ఛాంపియన్ షిప్‌లో జూనియర్ విభాగంలోనూ భారత్‌కు స్వర్ణం దక్కింది. క్రిష్ శర్మ 1000 మీటర్ల స్ప్రింట్‌లో భారత్‌కు తొలి గోల్డ్ మెడల్ అందించాడు.

### యువరాజ్, ఉతప్ప, సోనూసూద్‌కు

## ఈడీ సమన్లు

మనీలాండరింగ్ కేసులోనటుడు సోనూసూద్ సహా ఇద్దరు మాజీ క్రికెటర్లకు ఈడీ సమన్లు జారీ చేసింది. ఈనెల 22న మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప, 23న యువరాజ్ సింగ్,24న సోనూసూద్ విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో సూచించింది. నిషేధిత ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ లావాదేవీల్లో మనీలాండరింగ్‌కు సంబంధించి ఉతప్పను ఈడీ ప్రశ్నించనుంది. ఈ కేసులో ఇప్పటివరకు ముగ్గురు మాజీ క్రికెటర్లకు సమన్లు అందాయి. మాజీ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌లను ఇటీవలే ఈడీ ప్రశ్నించింది. ఇదే కేసులో టీఎంసీ మాజీ ఎంపీ,నటి మిమిచక్రవర్తిని ఈడీ సోమవారం విచారించి ఆమె వాఙ్మూలం నమోదు చేసింది. బెంగాలీ నటుడు అంకుశ్ హజ్రా మంగళవారం ఈడీ ఎదుట హాజరయ్యారు. నటి ఊర్వశీ రౌతేలా కూడా 1-బెట్..బెట్టింగ్ యాప్‌నకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవ హరిస్తున్నారు.ఆమెకు కూడానోటీసులు వెళ్లాయి.



# తొలి అనధికార టెస్ట్.. భారత్ ఏ బౌలర్లు విఫలం

- తొలిరోజు ఆస్ట్రేలియా 337/5
- సామ్ కొన్‌స్టాస్ సెంచరీ

లక్నోలోని ఏక్నా స్టేడియంలో భారత-ఏ జట్టుతో జరుగుతున్న తొలి అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో తొలిరోజు మంగళవారం ఆట ముగిసే సరికి ఆస్ట్రేలియా ఏ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 337 పరుగులు చేసింది. జోష్ ఫిలిప్ 3, లియామ్ స్కాట్ 47 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు.

ఈ మ్యాచ్లో ఆస్ట్రేలియా-ఏ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఆస్ట్రేలియా యువ సంచలనం సామ్ కొన్‌స్టాస్ భారత గడ్డపై తన తొలి మ్యాచ్‌లోనే మెరుపు సెంచరీతో కదంతొక్కాడు. 19 ఏళ్ల ఈ ఆసీస్ యువ ఓపెనర్ 122 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. తనుష్ కోటియన్ బౌలింగ్లో భారీ సిక్సర్ బాది సెంచరీ సాధించాడు.




కొన్‌స్టాస్‌తో పాటు మరో ఓపెనర్ క్యాంప్‌బెల్ కెల్లావే కూడా (88) అదరగొట్టాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 198 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. కెల్లావే 73 పరుగుల వద్ద ఉండగా.. 56 పరుగుల వద్ద ఉండిన కొన్‌స్టాస్ అతడిని దాటిపోయి వేగంగా సెంచరీ పూర్తి చేశాడు.

టీమిండియాకు ఆడిన అనుభవం ఉన్న బౌలర్లు ప్రసిద్ధ కృష్ణ, ఖలీల్ అహ్మద్ కూడా ఈ మ్యాచ్‌లో ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. తనుశ్ కోటియన్, హర్ష్ దూబె భారీగా పరుగులు సమర్పించుకున్నారు. ఫాస్ట్ బౌలర్ గుర్నూర్ బ్రార్ ఒక్కడే ఆసీస్-ఏ ఓపెనర్లను కాస్త నిలువరించగలిగాడు. భారత బౌలర్లలో హర్ష్ దూబె 3, ఖలీల్ అహ్మద్ 1, గుర్నూర్ బ్రార్ 1 వికెట్ తీసుకున్నారు.

ఈ మ్యాచ్ లో ఆసిస్-ఏ జట్టుకు నాథన్ మెక్‌స్వీనీ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. భారత-ఏ జట్టు విషయానికొస్తే.. కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ వ్యవహరిస్తున్నాడు. అభిమన్యు ఈశ్వరన్, సాయి సుదర్శన్, ఎన్ జగదీషన్, దేవదత్ పడిక్కల్, ధృవ్ జురెల్, తనుష్ కోటియన్, హర్ష్ దూబే, ప్రసిద్ధ కృష్ణ, ఖలీల్ అహ్మద్, గుర్నూర్ బ్రార్ తది తరులు జట్టులో ఉన్నారు..

ఆస్ట్రేలియా-ఏ జట్టు రెండు అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లు (నాలుగు రోజుల మ్యాచ్‌లు), మూడు అనధికారిక వన్డేల కోసం భారత్ లో పర్యటిస్తోంది.

# ఐసీసీ వద్ద పాకిస్థాన్‌కు భంగపాటు

ఐసీసీ వద్ద పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) భంగపాటుకు గురయింది. ఆసియాకప్‌లో భాగంగా గత ఆదివారం భారత్, పాకిస్థాన్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్ తర్వాత పాకిస్థాన్ ఆటగాళ్లతో భారత క్రికెటర్లు కరచాలనం చేయలేదు. ఈ నేపథ్యంలో మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ నిబంధనల ఉల్లంఘనలకు కారణమయ్యారంటూ ఆరోపిస్తూ, ఆయన్ను తొలగించాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఫిర్యాదు చేసింది. లేదంటే టోర్నీని బహిష్కరిస్తామని పీసీబీ హెచ్చరించినట్టు వార్తలు వచ్చాయి. అయితే.. పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలపడమే తమ ఉద్దేశమని, తమ చర్యను టీమ్ ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సమర్థించుకున్నారు. మ్యాచ్ రిఫరీని తొలగించాలన్న పాకిస్థాన్ డిమాండ్‌ను తాజాగా మంగళవారం అంతర్జాతీయ క్రికెట్ సంఘం (ఐసీసీ) తిరస్కరించింది. మ్యాచ్ రిఫరీ ఐసీసీ ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించడం పై ఐసీసీకి పీసీబీ ఫిర్యాదు చేసింది. ఆసియాకప్ లో మ్యాచ్ రిఫరీగా ఉన్న పైక్రాఫ్ట్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశామని అని పీసీబీ చైర్మన్ మోహ సిన్ నఖ్వీ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నాడు. 'టాస్ సందర్భంగా భారత కెప్టెన్‌తో




కరచాలనం చేయొద్దని పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ ఆలీ అఘాతో రిఫరీ పైక్రాఫ్ట్ చెప్పారని అని అంతకుముందు ఓ ప్రకటనలో పీసీబీ పేర్కొంది. మరోవైపు పైక్రాఫ్ట్ ఒత్తిడి వల్లే భారత్, పాక్ కెప్టెన్ల మధ్య టీమ్ షీట్ల మార్పిడి జరగలేదంటూ పాక్ మేనేజర్ నవీద్ అక్రమ్ చీమా కూడా ఫిర్యాదు చేశాడు.

అయితే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చేసిన ఫిర్యాదును ఐసీసీ పెద్దగా పట్టించుకోలేదు. మ్యాచ్ రిఫరీపై చర్యలకు అంగీకరించలేదు. పీసీబీ డిమాండ్‌ను తిరస్కరించింది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అధికారికంగా మాత్రం ఆసియాకప్ టోర్నీ నుంచి వైదొలుగుతామని ఇంతవరకు ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో ప్రణాళిక ప్రకారమే పాకిస్థాన్ బుధవారం యూఏఈతో జరగనున్న మ్యాచ్‌లో తలపడనున్నట్లు తెలుస్తోంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తేనే పాక్ జట్టు సూపర్ 4కు చేరుకుంటుంది. సూపర్ 4 దశలో ఈ నెల 21న ఆ జట్టు టీమ్ ఇండియాతో మరోసారి మ్యాచ్ ఆడే అవకాశం ఉంది..

# మళ్లీ అగ్రస్థానానికి స్మృతి

భారత స్టార్ మహిళా క్రికెటర్ స్మృతి మంధన ఐసీసీ తాజాగా విడుదల చేసిన మహిళల వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానానికి చేరింది. గత వారం ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉండిన మంధన.. తాజాగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో రాణించి (58 బంతుల్లో 63: 6 ఫోర్లు, 2 సిక్సర్లు) 7 అదనపు రేటింగ్ పాయింట్లను సాధించింది. తద్వారా తన పాయింట్ల సంఖ్యను 735కు పెంచుకుని టాప్ ర్యాంక్‌కు చేరింది. ఈ క్రమంలో ఇంగ్లండ్ కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్‌ను అధిగమించి కెరీర్లో నాలుగో సారి అగ్రపీఠాన్ని అధిరోహించింది. 2019లో తొలిసారి టాప్ ర్యాంకును కైవసం చేసుకున్న మంధన.. ఈ ఏడాది జూన్, జులైల్లో కూడా స్వల్ప కాలం నంబర్ వన్ వన్డే బ్యాటర్‌గా కొనసాగింది. ప్రస్తుతం మంధనకు రెండో స్థానంలో ఉన్న బ్రంట్‌కు కేవలం నాలుగు రేటింగ్ పాయింట్ల వ్యత్యాసం మాత్రమే ఉంది.

ఈ వారం ఆస్ట్రేలియాతో జరుగబోయే మరో రెండు వన్డేల్లో మంధన ఇదే ఫాంను కొనసాగిస్తే.. రేటింగ్ పాయింట్లను మరింత మెరుగుపర్చుకుని అగ్రస్థానాన్ని పటిష్టం చేసుకునే అవకాశం ఉంది. మంధన కీలక సమయంలో నంబర్ వన్ స్థానానికి ఎగబాకింది. ఈ నెలాఖరు నుంచి (సెప్టెంబర్ 30) భారత్, శ్రీలంకల్లో వన్డే ప్రపంచకప్ ప్రారంభం కానుంది. ఇలాంటి తరుణంలో నంబర్ వన్ స్థానానికి ఎగబాకడం ఆమెకు మానసిక స్థైర్యాన్ని పెంచేదే.




తాజా ర్యాంకింగ్స్ మంధనతో పాటు మరో ఇద్దరు భారత బ్యాటర్లు కూడా లబ్ధి పొందారు. ప్రతీక రావల్ నాలుగు స్థానాలు మెరుగుపర్చుకుని 42వ స్థానానికి.. హర్లీన్ డియోల్ 5 స్థానాలు మెరుగుపర్చుకుని 43వ స్థానానికి ఎగబాకారు. మిగతా భారత బ్యాటర్లలో హర్మన్ ప్రీత్ 12వ స్థానంలో... జెమీమా రోడ్రిగ్జ్ 15 స్థానంలో, దీప్తి శర్మ 24వ స్థానంలో, రిచా ఘోష్ 37 స్థానంలో ఉన్నారు.

బౌలర్ల ర్యాంకింగ్స్ విషయానికొస్తే.. ఇంగ్లండ్‌కు చెందిన సోఫీ ఎక్లెస్టోన్ టాప్ ర్యాంక్ లో కొనసాగుతుండగా.. భారత స్పిన్నర్ స్నేహ్ రాణా ఐదు స్థానాలు మెరుగుపర్చుకుని 16వ స్థానానికి ఎగబాకింది. మరో భారత బౌలర్ దీప్తి శర్మ 3 స్థానాలు దిగజారి 7వ ర్యాంక్‌కు పడిపోయింది.



# ఆర్యన్.. ఓ పర్ఫెక్షనిస్టు

'ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్' వెబ్‌సిరీస్‌తో తనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించడంలో దర్శకుడిగా ఆర్యన్ సక్సెస్ అయ్యాడని నటుడు బాబీ డియోల్ ప్రశంసించారు. పాత్రలకు తగ్గట్టు ఆర్టిస్టుల నుంచి నటన రాబట్టుకున్నాడని అన్నారు. 'ఇది నా ఫీలింగే కాదు, సిరీస్‌లో నటించిన అందరి ఫీలింగ్' అని పేర్కొన్నారు. హీరో షారుఖాన్ తనయుడు ఆర్యన్‌ఖాన్.. 'ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్' వెబ్ సిరీస్‌తో దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఈనెల 18నుంచి ఓటీటీ 'నెట్‌ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ కానున్న సందర్భంగా ప్రమోషన్స్‌లో బాబీ దేవోల్ పాల్గొన్నారు. "ఈ సిరీస్ గురించి ఆర్యన్ ఫోన్ చేసినప్పుడు.. స్క్రిప్టు చదవకుండానే నటించేందుకు అంగీకరించాలనుకున్నా. కానీ, కథ వినాల్సిందేనని ఆర్యన్ పట్టుబట్టడంతో కాదనలేకపోయా. దర్శకుడిగా తనకేం కావాలో ఆర్యన్‌కు స్పష్టత ఉంది. అతడు పర్ఫెక్షనిస్ట్" అని ప్రశంసించారు. బాలీవుడ్‌లో ఎలాంటి ఈగోలు లేవన్నారు. షారుక్ కుటుంబంతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. హిందీ చిత్ర పరిశ్రమ చుట్టూ తిరిగే ఈ సిరీస్‌లో లక్ష్య, సహేర్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. షారుక్‌ఖాన్, సల్మాన్‌ఖాన్, ఆమిర్‌ఖాన్, దర్శకుడు రాజమౌళి తదితరులు అతిథి పాత్రల్లో సందడి చేయనున్నారు.

# సెట్స్‌లో.. అందరితో ఒకేలా ఉండేవారు

పవర్ఫుల్ గ్యాంగ్‌స్టర్ 'ఓజీ' సరసన అలరించనుంది నటి ప్రియాంక మోహన్. పవన్ కల్యాణ్ హీరోగా దర్శకుడు సుజీత్ రూపొందించిన సినిమా సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ప్రమోషన్స్‌లో భాగంగా ప్రియాంక తాజాగా మీడియాతో మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. పవన్‌తో వర్క్ చేయడం ప్రారంభించిన తర్వాత ఎన్నో విషయాలు నేర్చుకున్నట్టు చెప్పారు. పవన్ కల్యాణ్ అద్భుతమైన వ్యక్తి అని ప్రశంసించారు. మూవీని ప్రకటించిన తర్వాతే తనను పాత్రకు ఎంపిక చేసుకున్నారని, వీడియో కాల్‌లో స్టోరీ నెరేట్ చేసినపుడు.. వినగానే ఓకే చెప్పానని గుర్తు చేసుకున్నారు. 1980లో కథ కావడంతో.. తన లుక్ కూడా అలానే ఉంటుందని,అమాయకమైన అమ్మాయిలా తానుంటే.. గంభీర మైన 'ఓజాస్' పాత్రలో పవన్ కనిపిస్తారని చెప్పుకొచ్చింది. సువ్వీ సువ్వీ పాట హిట్‌పై మాట్లాడుతూ.. 'ఈ సినిమాలో చాలా ఇష్టమైనపాట. రెండేళ్ల నుంచి ఎప్పుడు రిలీజ్ అవుతుందా? అని ఎదురు చూస్తున్నా. ఆ పాట అందరికీ నచ్చడం హ్యాపీ. సినిమాలో మొదట కంపోజ్ చేసింది ఈ పాటనే' అన్నారు. ఇక హీరో పవన్.. సెట్స్‌లో అందరినీ ఒకేలా చూస్తారు. బుక్స్ గురించి ఎక్కువ మాట్లాడేవారు. అప్పుడప్పుడు పాలిటిక్స్ గురించీ. పవన్‌తో వర్క్ చేయడమే ఒక మెమొరీ, ఆయనకు బిడియ మెక్కువ అన్నారు. సోషల్ మీడియాపై తన అభిప్రా యాన్ని వ్యక్తం చేస్తూ.. అదో టైంవేస్ట్ ప్రాసెస్ అంటూ.. నా సోషల్ మీడియా అకౌంట్స్ అన్నీ నా టీమ్ చూసు కుంటుంది అన్నారు.



# కోహ్లి బయోపిక్ నేను చేయను

టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి బయోపిక్ గురించి ఎప్పటినుంచో వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ కోహ్లి బయోపిక్ గురించి మాట్లాడారు. ఒకవేళ ఈ బయోపిక్ తెరకెక్కించే అవకాశం తనకు వచ్చినా చేయనని చెప్పారు. కోహ్లి అంటే తనకు అభిమానం ఉన్నప్పటికీ బయోపిక్ స్వీకరించనని అన్నారు. "కోహ్లి ఇప్పటికే క్రికెట్ అభిమానులతోపాటు ఎంతోమంది దృష్టిలో హీరో. చిన్న పిల్లలు కూడా అతడిని విపరీతంగా అభిమానిస్తారు. ఒకవేళ నేను ఎవరిదైనా బయోపిక్ చేయాల్సివస్తే కష్టమైన సబ్జెక్ట్‌ను ఎంచుకుంటాను. ఒక సాధారణ వ్యక్తి జీవితాన్ని తెరపై చూపిస్తాను. కోహ్లి చాలా గొప్ప వ్యక్తి. నాకు వ్యక్తిగతంగా తెలుసు. అందంలోనే కాదు.. వ్యక్తిత్వంలోనూ ఆయన ప్రశంసనీయుడు. త్వరగా ఎమోషనల్ అవుతాడు. ఒక్క మాటలో చెప్పాలంటే కోహ్లి ఓ అద్భుతం" అని అనురాగ్ కస్యప్ అన్నారు. ఇక కోహ్లి బయోపిక్ గురించి వార్తలు రావడం ఇదేం తొలిసారి కాదు.. ఈ బ్యాటింగ్ మ్యాస్ట్రోపై బాలీవుడ్ బడా నిర్మాణసంస్థ సినిమా తీయనుందంటూ గతంలో వార్తలు వచ్చాయి. అంతేకాదు, అందులో టాలీవుడ్ హీరో రామ్‌చరణ్ నటించనున్నాడని కూడా అప్పట్లో జోరుగా ప్రచారం జరిగింది. ఈ విషయంపై అప్పుడు చరణ్ మాట్లాడుతూ.. 'కోహ్లి నాకు చాలా ఇష్టమైన క్రికెటర్. అతడు ఎంతోమందికి స్ఫూర్తి. నాకు తన పాత్ర పోషించే అవకాశం వస్తే ఎంతో సంతోషిస్తా. అది అద్భుతంగా ఉంటుంది" అంటూ తన కోరికను బయటపెట్టారు.



# వస్తున్నాడు.. 'వృషభ'




మలయాళ మెగాస్టార్ మోహన్‌లాల్‌నుంచి ఈ ఏడాదిలో ఇప్పటికే మూడు సినిమాలు వచ్చిన సంగతి తెలిసిందే. వాటిలో రెండు తెలుగులోనూ విడుదలయ్యాయి. ఇక ఈ చిత్రాల తర్వాత ఆయననుంచి వస్తోన్న మరో భారీ చిత్రమే "వృషభ". దర్శకుడు నంద కిషోర్ తెరకెక్కిస్తున్న భారీ పీరియాడిక్ చిత్రంనుంచి మేకర్స్ ఇపుడు సాలిడ్ అప్డేట్‌ని అందించారు. పాన్ ఇండియా భాషల్లో సినిమా ట్రైలర్ సెప్టెంబర్ 18న విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. పోస్టర్‌ని కూడా మోహన్‌లాల్‌పై డిజైన్‌చేసి వదలడంతో అభిమానులు ఎగ్జైట్ అవుతున్నారు. ఇక ఈ చిత్రానికి రీసెంట్ సెన్సేషనల్ హిట్ మహావతార్ నరసింహ సంగీత దర్శకుడు సామ్ సి ఎస్ వర్క్ చేయగా కనెక్ట్, ఏవిఎస్ అలాగే బాలాజీ ఫిలింస్ లిమిటెడ్ నిర్మించాయి.

# వాళ్లను వదిలేది లేదు..

నటి దిశా పటానీ కుటుంబానికి ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ హామీ ఇచ్చారు. ఇటీవల దిశా ఇంటి ముందు కాల్పులు జరిగిన ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే. దీనిపై సీఎం ఆరా తీశారు. దిశా తండ్రికి ఫోన్ చేసిన సీఎం.. కాల్పులకు పాల్పడిన వారు ఎక్కడున్నా పట్టుకొని తీరతామని హామీ ఇచ్చారు. సీఎం మాట్లాడిన వివరాలను దిశా తండ్రి జగదీశ్ మీడియాతో పంచుకున్నారు."యోగి ఆదిత్యనాథ్ మాకు ఫోన్ చేశారు. మా కుటుంబానికి ధైర్యాన్నిచ్చారు. రాష్ట్రం మొత్తం మాకు అండగా ఉంటుందని చెప్పారు. మాకు పూర్తి భద్రతనిస్తామన్నారు. ఈ విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం చేయబోమని తెలిపారు.

ఈ ఘటనకు పాల్పడినవారు అండర్ గ్రౌండ్లో దాగి ఉన్నా పట్టుకుంటామని హామీ ఇచ్చారు" అని సీఎం మాట్లాడారని దిశా తండ్రి మీడియాకు వివరించారు. ఇక బరేలీలోని (ఉత్తరప్రదేశ్) దిశా పటానీ ఇంటిముందు సెప్టెంబర్ 12న కాల్పులు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఓ వర్గం మనోభావాలు దెబ్బతీసేలా దిశా సోదరి ఖుష్బూ పటానీ వ్యాఖ్యలు చేశారన్న కారణంగా ఈ దాడి జరిగినట్టు తెలుస్తోంది. మరోవైపు ఈ కాల్పులను తామే జరిపామని గోల్డీ బ్రార్ గ్యాంగ్ ప్రకటించింది. మాజీ ఆర్మీ అధికారిణి అయిన ఖుష్బూ ప్రస్తుతం ఫిట్నెస్ ట్రైనర్‌గా పనిచేస్తున్నారు.



# యూ ఆర్ రియల్ హీరో...

కీర్తి చక్ర అవార్డు గ్రహీత మేజర్ మల్లా రామ్ గోపాల్‌నాయుడు తన అభిమాని కావడం ఎంతో గర్వంగా ఉందని చిరంజీవి అన్నారు.దేశ రక్షణ లో ఎప్పుడూముందుండే రియల్ హీరో తనను కలవడం ఆనందంగా ఉందన్నా రు. రామ్ గోపాల్ ఫ్యామిలీతో కలిసి దిగిన ఫొటోను సోషల్ మీడియా వేది కగా పంచుకున్నారు. మేజర్‌పై ప్రశం సలు కురిపించారు. "చిన్న వయసు లోనే దేశ రక్షణకు ఆయన చూపించిన శౌర్యపరాక్రమాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినిస్తాయి. దేశమాత రక్షణలో ఉన్న గొప్ప సైనికుడు నా అభిమాని కావడం ఎంతో ఆనందాన్నిస్తోంది. ఆయన అభిమానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ఆయన, ఆయన కుటుంబం ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నా" అని చిరు పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ నియంత్రణ రేఖ వద్ద జరిగిన దాడుల్లో పాక్ ఉగ్రవాదులను మట్టుబెట్టి, తోటి సైనికుల్ని రక్షించుకోవటంలో అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించారు రామ్ గోపాల్ నాయుడు. అందుకుగానూ కీర్తిచక్ర అవార్డు అందుకున్నారు.